

ఇందులో

* నూతన ప్రజాతంత్ర నియంతృత్వం
  మా-సి-టుంగ్
* సామ్రాజ్యవాదంలో పరస్పర వైరుధ్యాలు
  పామీ దత్తు
* సిద్ధాంతం—స్టాలిన్
* అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్
  23వ సమావేశము

21

15—8—49

జనత

CL

మార్క్సిస్టు సిద్ధాంత పక్షపత్రిక

సంచిక 21	15—8—1949	వెల : 8 అణాలు

నూతన ప్రజాతంత్ర నియంతృత్వం

మా - సి - టుంగ్
చైనా కమ్యూనిస్టుపార్టీ కేంద్రకమిటీ
అధ్యక్షుడు

చైనా కమ్యూనిస్టుపార్టీకి 1949 జూలై 1 వ తేదీతో 28 సంవత్సరాలు నిండుతాయి. మానవ జీవితం లాగానే పార్టీజీవితానికికూడా బాల్య, కౌమార, యౌవన, వార్ధక్య దశలుంటాయి. చైనాకమ్యూనిస్టుపార్టీ బాల్య కౌమారదశలను దాటి పరిపక్వ దశకు వచ్చింది. మానవునికి వృద్ధాప్యం వచ్చిన తర్వాత అతడు చచ్చిపోవడం జరుగుతుంది. పార్టీల విషయంలో కూడా అంతే. వర్గాలు అదృశ్యమైపోయినప్పుడు వర్గపోరాటాలకు సాధనములైన రాజకీయపార్టీలు, ప్రభుత్వ యంత్రం వాటి కార్యకలాపాలను విడనాడి, వాటి ఆవశ్యకతను కోల్పోయి క్రమంగా అదృశ్యమైపోతాయి. అవి తమ చారిత్రక బాధ్యతను నిర్వహించి పూర్తిచేసి, అంతకంటె ఉన్నతమైన మానవ సమాజ దశకు దారితీస్తాయి - అవకాశాన్ని కల్పిస్తాయి.

మనపార్టీ బూర్జువా రాజకీయ పార్టీలకు చాలా విభిన్నమైనది. వర్గాలూ, ప్రభుత్వాధికారం పార్టీలు అదృశ్యమైపోతాయి అనేవిష

యాన్ని గురించి మాట్లాడడానికే ఆ పార్టీలు భయపడతాయి. కాని మనం మాత్రం పై వాటిని త్వరగా అదృశ్యం చేయడానికి అవసరమైన పరిస్థితులను కల్పించడానికే దృఢమనస్కులమై పోరాడుతున్నాం అని బహిరంగంగానే ప్రకటిస్తాం. కమ్యూనిస్టుపార్టీ, నూతన ప్రజాతంత్ర ప్రభుత్వాధికారం అలాంటి పరిస్థితులను కల్పిస్తాయి. ఈ సత్యాన్ని గుర్తించ నిరాకరించేవారు కమ్యూనిస్టులు కాదు. ఇప్పుడే పార్టీలో చేరినటువంటి మార్క్సిజం- లెనినిజం మూలసూత్రాలను ఇంకా అధ్యయనం చేయనటువంటి యువక (యంగ్) కామ్రేడ్సు బహుశా ఈ సత్యాన్ని ఇంకా తెలుసుకొని ఉండకపోవచ్చు. వర్గాలూ ప్రభుత్వాధికారమూ పార్టీలూ అదృశ్యమయి పోయ్యే మార్గానికే- కమ్యూనికే- సమస్త మానవజాతి ప్రయాణం చేయవలసి ఉంటుందని ఆ కామ్రేడ్సు తెలుసుకోవాలి. పోతే ఇక అది ఎప్పుడు ఏ పరిస్థితుల్లో? అనేదే ఉన్న అసలు సమస్య.

బూర్జువావర్గంకంటె అన్నిచోట్లా కమ్యూనిస్టులు చాలా ముందడుగులోనే ఉంటారు. సమాజాభివృద్ధిని నిర్ణయించే సూత్రాలేవో వారెరుగుదురు. గతతార్కికసూత్రాలను వారెరుగుదురు. అందువల్లనే వారు చాలా ముందుకు చూడగలరు. ప్రజలు తమను స్థానభ్రష్టులుగా చేయడం బూర్జువావర్గానికి ఇష్టంఉండదు. కాబట్టి ఆవర్గానికి ఈ సత్యం సహించదు. క్యూమింటాంగ్ అభివృద్ధినిరోధకులను ఇప్పుడు మనం కూలద్రోసినట్లుగానే, మనమూ వివిధదేశప్రజలూ కలిసి ఇటీవల జపాను సామ్రాజ్యవాదాన్ని కూలద్రోసినట్లుగానే, తాముకూడా కూల్చివేయబడతారనే అలోచనరావడమే బూర్జువావర్గానికి బాధాకరంగా ఉంటుంది. కార్మికవర్గమూ, కార్మికప్రజలూ, కమ్యూనిస్టులూ తాము కూలద్రోయబడతారనే సమస్యే వారిని ఎదుర్కోవడంలేదు. మానవజాతి ప్రపంచకమ్యూనిజంపంథా నవలంబించేందుకు వర్గాలూ, ప్రభుత్వాధికారమూ, రాజకీయపార్టీలూ వాటంతటవే అదృశ్యమైపోయేందుకు అవసరమైన పరిస్థితులను కల్పించడానికి తీవ్రమైన కృషి చేయడం అనే సమస్యే వారిని ఎదుర్కొంటూఉంది.

ఈ దిగువసమస్యలను పరిష్కరించే ఉద్దేశంతో మానవసమాజాభివృద్ధికి సంబంధించిన పైవిషయాలను గురించి ఉల్లేఖించడం జరి

గింది. మనపార్టీకి ఇప్పుడు 28 సంవత్సరాల వయస్సు నిండింది. ఈ సంవత్సరాలు శాంతియుతంగా గడచిపోలేదనీ, కష్టాలతో నిండియున్న వనీ ప్రతివారికి తెలుసు. అంతరంగిక శత్రువులతోనూ, బాహ్య శత్రువులతోనూ, పార్టీలోపలా, పార్టీ బైటా ఉన్న శత్రువులతోనూ మనం పోరాడవలసివచ్చింది. ఈ పోరాటాన్ని సాగించే ఆయుధం మన కిచ్చినందుకు మార్క్సు, ఎంగిల్స్, లెనిన్, స్టాలిన్‌లకు మనం రుణపడి ఉన్నాం. మనకు వారిచ్చిన ఆయుధమేమిటి? మరతుపాకియా? కాదు. మార్క్సిజం - లెనినిజం అనే ఆయుధాన్ని వారు మనకు ప్రసాదించారు. లెనిన్ 1920 లో తాను రచించిన "అతివాద కమ్యూనిజం, ఒక చంటిబిడ్డజబ్బు" అనే గ్రంథంలో రష్యన్లు ఏవిధంగా విప్లవసిద్ధాంతాన్ని సృష్టించారో తెలియజేశాడు. అనేక సంవత్సరాల కృషిఫలితంగా, ప్రయత్నాలఫలితంగా వారు చివరకు మార్క్సిజానికి రాగలిగారు. విప్లవానికి పూర్వంఉన్న రష్యాపరిస్థితులకూ, చైనాపరిస్థితులకూ చాలా సామ్యంఉంది. ఉభయదేశాలూ ఫ్యూడల్‌వర్గాలచేత అణచబడేవే. రెండు దేశాలూ ఆర్థికంగా సాంస్కృతికంగా వెనకబడిఉన్నాయి. రెండు దేశాలూ వెనకబడ్డదేశాలే. రష్యాకంటెకూడా చైనా ఇంకా ఎక్కువ వెనకబడినదేశం. జాతీయ పునరుద్ధరణను సాధించే విప్లవసత్యాన్ని అన్వేషించడానికి అభ్యుదయవాదులు ఎంతో పోరాటంజరిపారు. ఈ పోరాటం ఉభయదేశాల్లోనూ జరిగింది.

నల్లమందు యుద్ధంలో (1840) చైనా ఓడిపోవడంతో పాశ్చాత్య దేశాల్లో సత్యాన్ని అన్వేషించడానికి చైనా ప్రజలు అనేకకష్టాలనుభవించారు. చైనాలో ఇంకా కమ్యూనిస్టుపార్టీ ఏర్పడక పూర్వం పాశ్చాత్య దేశాల్లో సత్యాన్ని అన్వేషించ బూనుకొన్న గ్రూపుకు హాంగ్‌సియుచాన్, కాంగ్‌యువీ, యన్‌ఫు, సన్‌యట్‌సేన్‌లు ప్రతినిధులు. ఆనాడు అభ్యుదయాన్ని ఆకాంక్షించే చైనీయులు పాశ్చాత్య నూతన భావాలున్న ప్రతిపుస్తకాన్నీ చదివేవారు. అనేకమంది తమ చదువుకోసం జపాన్, ఇంగ్లాండు, అమెరికా, ఫ్రాన్సు, జర్మనీ దేశాలకు వెళ్లారు. పాశ్చాత్య దేశాలనుంచి నేర్చుకోడానికి వారే ప్రయత్నలోపం చేయలేదు. అధికారవర్గానికి (అఫీషియల్‌డం) సంబంధించిన పురాతన

పరీక్షా విధానాన్ని రద్దుచేశారు. కొత్తగా అనేకస్కూళ్ళను తెరిచారు. నేనుకూడా నా చిన్నవయస్సులో ఈ విధంగా చదువుకున్నవాణ్ణే. నూతన పాఠశాలలు అని పిలవబడే వీటి అధ్యయనంలో ఆనాటి సామాజిక శాస్త్రం, ప్రకృతి శాస్త్రం కూడా ఉండేవి. ఇది పాశ్చాత్య బూర్జువా ప్రజాతంత్ర సంస్కృతి. 'పురాతన పాఠశాల' అని పిలవబడే చైనా ఫ్యూడల్ సంస్కృతికి ఇది పూర్తిగా విభిన్నమైనది.

ఈ నూతన పాఠశాలలు, ఈ నూతన భావాలే చైనాకు మోక్షం కలిగిస్తాయని నూతన జ్ఞానాన్ని ఆర్జించినవారు చాలాకాలం వరకు విశ్వసిస్తూ ఉండేవారు.

"సనాతన భావాలను" పట్టుకొని ఊగులాడేవారుగాక "నూతన భావాలు" గలవారిలో ఏ కొద్దిమందో మినహా మిగతా అందరూ ఇదేవిధంగా విశ్వసించేవారు. దేశాన్ని కాపాడడానికి సంస్కరణలను ప్రవేశపెట్టడమే– అంటే: విదేశ ప్రభుత్వాలనుంచి నేర్చుకొనడం ఒక్కటే శరణ్యం అని భావించేవారు. విదేశప్రభుత్వాల్లో ఆనాడు పాశ్చాత్య పెట్టుబడిదారీ దేశాలు మాత్రమే అభ్యుదయకరంగా ఉండేవి. ఆ దేశాలు అధునిక బూర్జువా ప్రభుత్వాలను నిర్మించాయి. పాశ్చాత్య దేశాలనుంచి నేర్చుకొనడంద్వారా జపానీయులు చాలా గొప్ప ఫలితాలను సాధించారు. కాబట్టి చైనీయులు జపాన్‌నుంచి నేర్చుకోవాలనుకున్నారు. ఆనాడు చైనాదృష్టిలో రష్యా ఒక వెనకబడ్డ దేశం. కాబట్టి ఆ దేశాన్నుంచి నేర్చుకోడానికి ఎక్కువ మంది ఇష్టపడేవారుకాదు. మొత్తంమీద 1840 నుంచి 20 వ శతాబ్దం ప్రారంభదశవరకు విదేశీ ప్రభుత్వాలనుంచే చైనా ప్రజలు నేర్చుకుంటూ ఉండేవారు. కాని సామ్రాజ్యవాదులు సాగించిన దురాక్రమణ ఫలితంగా పాశ్చాత్య దేశాలనుంచి ఎంతో నేర్చుకోవాలి అనుకున్న చైనా ప్రజల ఆశలు పటాపంచలై పొయ్యాయి. గురువు లెప్పుడూ తమ శిష్యులపై అక్రమంగా ఆక్రమణ చేస్తూ ఉండడం నిజంగా విచిత్రమైన విషయం కాదూ ?

పాశ్చాత్య దేశాలనుంచి, చైనాప్రజలు అనేక విషయాలను నేర్చుకున్నారు. కాని వారు నేర్చుకున్న విషయాలన్నిటినీ ఆచరణలో

పెట్టలేకపోయారు. వారు తమ ఆదర్శాలను గుర్తించలేకపోయారు. అనేకసార్లు వారు సాగించిన పోరాటం - 1911 విప్లవంలాంటి జాతి యోద్యమం కూడా-ఓడిపోయింది. రోజురోజుకూ దేశం మరింత అధ్వాన్న పరిస్థితులకు దిగజారిపోయింది. ప్రజలిక ఏమాత్రం సహించలేనంత తీవ్రంగా పరిస్థితులు విషమించాయి. సందేహాలు పొడసూపాయి. పొడసూపిన సందేహాలు బలపడ్డాయి.

మొదటి ప్రపంచయుద్ధం ప్రపంచాన్ని అంతా ఊపివేసింది. రష్యన్లు నవంబరు విప్లవాన్ని సాగించి ప్రపంచంలో మొట్ట మొదటి సోషలిస్టుదేశాన్ని సృష్టించారు. విదేశీయులదృష్టికి అగపడకుండా అంతవరకు మరుగుపడిఉన్న రష్యన్ శ్రామికవర్గంయొక్క, కార్మిక ప్రజలయొక్క శక్తి లెనిన్ స్టాలిన్‌ల నాయకత్వాన ఒక్కసారిగా అగ్నిపర్వతంలాగా విజృంభించింది. తదాది సమస్త మానవజాతి చైనాతో సహా-రష్యన్లను మరొక దృక్పథంతో చూడసాగింది. అప్పుడే -అప్పుడు మాత్రమే-సిద్ధాంతరంగంలో కృషిచేసే చైనీయులు పూర్తిగా ఒకనూతన శకంలో ప్రవేశించారు. ప్రపంచం అంతటికీ వర్తించే విశ్వజనీనసత్యమైన మార్క్సిజం- లెనినిజాన్ని చైనీయులు కనిపెట్టారు. చైనా ఆకారం మారిపోయింది. రష్యన్లు మార్క్సిజాన్ని ఆచరణలో పెట్టిన ఫలితంగా చైనీయులు మార్క్సిస్టు విజ్ఞానాన్ని ఆర్జించారు. నవంబరు విప్లవానికి పూర్వం లెనిన్ స్టాలిన్ లెవరో, మార్క్సు ఎంగిల్సు లెవరో చైనా దేశస్థులకు తెలియదు. నవంబరు విప్లవమే మనకు మార్క్సిజం- లెనినిజాన్ని ఇచ్చింది. ప్రపంచ శ్రామికవర్గ దృక్పథానికి అన్వయించి దేశభవిష్యత్తును నిర్ణయించడంలోనూ, తమ తమ సమస్యలను పరిశీలించుకోడంలోనూ నవంబరు విప్లవం ప్రపంచాభ్యుదయ శక్తులన్నింటికీ- చైనాలోని అభ్యుదయ శక్తులకుకూడా - తోడ్పడింది. రష్యన్లు అవలంబించిన పంథానే అనుసరించి మనం కూడా పురోగమించవలసి ఉంటుంది అనే నిర్ణయానికి వచ్చాం.

1919 లో 'నాలుగవ మే' ఉద్యమం నడిచింది. 1921 లో చైనా కమ్యూనిస్టుపార్టీ ఏర్పడింది. సన్‌యట్‌సెన్ నిరాశచెందిఉన్న సమయంలో నవంబరు విప్లవం జరిగింది. చైనాలో కమ్యూనిస్టుపార్టీ

స్థాపించబడింది. నవంబరు విప్లవానికీ, చైనాకు రష్యా చేసే సహకారానికి, చైనా కమ్యూనిస్టుపార్టీతో సహకారానికీ, సన్ యట్ సేన్ హృదయ పూర్వకంగా స్వాగతం ఇచ్చాడు.

సన్ యట్ సెన్ చనిపోయినతర్వాత ఛియాంగ్ కై షేక్ అధికారంలోకి వచ్చాడు ఇరవై సంవత్సరాల తన పరిపాలనలో చైనాను దుర్భర దారిద్ర్యానికి గురిచేశాడు. ఈ కాలంలో జరిగిన ఫాసిస్టువ్యతిరేక రెండో ప్రపంచయుద్ధంలో మూడు పెద్ద సామ్రాజ్యవాద ప్రభుత్వాలు నాశనమయ్యాయి. మరో రెండు సామ్రాజ్యవాద ప్రభుత్వాలు బలహీనమయ్యాయి. ఈ యుద్ధంలో సోవియట్ యూనియన్ ప్రధాన పాత్రవహించింది. సామ్రాజ్యవాద దేశాల్లో ఒక్క అమెరికా మాత్రమే యుద్ధంలో ఏమీనష్టపడలేదు. కాని అమెరికాలో కూడా ఆంతరంగిక సంక్షోభం చాలా తీవ్రంగానేఉంది. ప్రపంచాన్ని అంతా తనకు బానిసగా చేసుకోవాలని అమెరికా ప్రయత్నిస్తూఉంది. ఛియాంగ్ కై షేక్ కు ఆయుధాలు సప్లయిచేయడంద్వారా లక్షోపలక్షల చైనా ప్రజల ప్రాణాలను బలిగొంటానికి అమెరికా తోడ్పడింది.

కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన చైనాప్రజలు జపాన్ సామ్రాజ్యవాదులను చైనానుంచి తరిమివేసినతర్వాత, ఇప్పటికి మూడుసంవత్సరానుంచి ప్రజావిముక్తి పోరాటాన్ని కొనసాగిస్తూఉన్నారు. ఈ పోరాటంలో మహత్తర విజయాన్ని సాధించారు. ఈవిధంగా పాశ్చాత్య బూర్జువా నాగరికత - బూర్జువా ప్రజాతంత్రం - బూర్జువా రిపబ్లిక్, చైనా ప్రజలదృష్టిలో తమ దివాళాకోరురూపంతో బైటబడ్డాయి. బూర్జువా ప్రజాతంత్రంపోయి ఆస్థానంలో, కార్మిక ప్రజలచే నడపబడే నూతన ప్రజాతంత్రం వచ్చింది. బూర్జువా రిపబ్లిక్ స్థానంలో ప్రజల రిపబ్లిక్ ఏర్పడింది. ఈవిధంగా ప్రజల రిపబ్లిక్ ఏర్పడడంద్వారా వర్గాలు రద్దయి సోషలిజాన్నీ కమ్యూనిజాన్నీ సాధించడానికి అవకాశం కలిగింది. కాంగ్ యువీ ప్రపంచ కమ్యూనిజాన్ని గురించి ఒక పుస్తకం వ్రాశాడు. కాని ప్రపంచ కమ్యూనిజానికి మార్గమేదో ఆయన గ్రహించలేదు. గ్రహించలేదుకూడా - విదేశాల్లో బూర్జువా రిపబ్లిక్కులున్నాయి. సామ్రాజ్యవాదులచే అణచబడిన దేశంగాబట్టి

చైనాలో బూర్జువా రిపబ్లిక్‌కుస్థానం లేదు. వర్గాను రద్దుచేయడానికీ, ప్రపంచ కమ్యూనిజాన్ని సాధించ డానికీ కార్మికవర్గ నాయకత్వాన ప్రజల రిపబ్లిక్కును నెలకొల్పడం ఒక్కటే ఏకైకమార్గం. తదితర మార్గాలన్నీ - ప్రయత్నాలన్నీ -ఇదివరకే నిష్ఫలమయ్యాయి.

ఇతర ఉపదేశాలను - మార్గాలను - అనుసరించినవారు అపజయం పొందడమైనా జరిగింది, లేక తమ తప్పులను గుర్తించడమైనా జరిగింది, లేక తమ భావాలను తిరిగి పరిశీలించుకోడమైనా జరుగుతూ ఉంది. పరిస్థితులు అతి శీఘ్రంగా మార్పుచెందాయి. ఇంత త్వరగా మార్పు వస్తుందని అనేకమంది ఊహించనైనా ఊహించ లేక పోయారు. పరిస్థితులను మళ్ళీ వారిప్పుడు కొత్తగా అర్థం జేసుకోడానికి ప్రయత్నిస్తున్నారు. ఆవిధంగా ప్రయత్నించడం మంచిదే. అందుకు మేము స్వాగతం ఇస్తున్నాం. నవంబరు విప్లవం తర్వాత చైనా శ్రామికవర్గంయొక్క అగ్రదళం మార్క్సిజం - లెనినిజాన్ని అధ్యయనం చేసింది. కమ్యూనిస్టు పార్టీని నిర్మించింది. తదనంతరం చైనా శ్రామికవర్గంయొక్క అగ్రదళం రాజకీయ పోరాటంలోకి దిగింది. విజయాన్ని సాధించడానికి పూర్వం 28 సంవత్సరాలు మహా కష్టభరితమైన మార్గంవెంట నడవవలసి వచ్చింది.

ఈ 28 సంవత్సరాల అనుభవాన్నిబట్టీ సన్‌యట్‌సెన్ తన మరణ శాసనంలో ఉదహరించిన "40 సంవత్సరాల అనుభవా"న్నిబట్టీ ఈ క్రింది జనరల్ నిర్ణయాన్ని చేయగలం.

"విజయాన్ని సాధించడంలో అచంచల విశ్వాసం ఏర్పడేటట్లు అసంఖ్యాక ప్రజానీకంలో మనం జాగృతిని కలిగించి పరిగణించే ప్రపంచ జాతులతో ఉమ్మడి (కామన్) పోరాటంలో ఐక్య పరచాలి."

మన ప్రపంచ దృక్పథానికీ సన్‌యట్ సేన్ ప్రపంచ దృక్పథానికీ భేదముంది. సమస్యలను నిర్ణయించడంలో పరిష్కరించడంలో ఆయన మరొక విభిన్నమైన వర్గ దృక్పథంతో వ్యవహరిస్తాడు. కాని 20వ శతాబ్దంలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగించిన పోరాటంలో ఆయన దృక్పథం ప్రధానవిషయాల్లో మన దృక్పథంతో ఏకీభవించింది.

సన్‌యట్‌సెన్ మరణించి ఇప్పటికి 24 సంవత్సరాలు గడచి పోయ్యాయి. ఈ 24 సంవత్సరాల కాలంలో చైనా కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన చైనా విప్లవ సిద్ధాంతమూ - ఆచరణా ఎంతో అభి వృద్ధి చెందాయి. చైనా ఆకారంలోనే అవిఎంతో అభివృద్ధి చెందాయి. చైనా ఆకారంలోనే అవి ఎంతో మార్పు తెచ్చాయి. ఇప్పటివరకు చైనా ప్రజలు రెండు ప్రధాన విషయాల్లో ప్రావీణ్యత గడించారు :

1. దేశంలోని ప్రజానీకంలో వచ్చిన జాగృతి - అంటే: దీని అర్థం కార్మికవర్గ నాయకత్వాన ఐక్యసంఘటనలో కార్మికవర్గాన్నీ, రైతాంగాన్నీ, చిన్న (పెటీ) బూర్జువావర్గాన్నీ, జాతీయ బూర్జువా వర్గాన్నీ, ఐక్యపరచడం; కార్మికవర్గ నాయకత్వాన, కార్మికుల రైతుల సన్నిహిత సంబంధంపై నూతన ప్రజాతంత్ర నియంతృత్వం ఏర్పర చడం అన్నమాట.

2. మనలను సమాన హోదాగల జాతిగా పరిగణించేటటువంటి ప్రపంచ దేశాలన్నిటితోనూ వివిధ దేశాల ప్రజలందరితోనూ సామాన్య (కామన్) పోరాటంలో ఐక్యత అంటే దీని అర్థం సోవియట్ యూనియన్‌తోనూ, యూరప్‌లోని నూతన ప్రజాతంత్ర దేశాల తోనూ, ఇతర దేశాల ప్రజానీకంతోనూ, అంతర్జాతీయ ఐక్య సంఘటన నిర్మించడంలో సన్నిహిత సంబంధం ఏర్పడడం.

"అయితే మీరు ఒకపక్షంవైపుకే మొగ్గుతున్నారు." అని కొందరంటున్నారు. విజయం సాధించడానికీ సాధించిన విజయాన్ని సుస్థిరం చేసుకోడానికీ మనం తప్పకుండా ఒకపక్షంవైపుకే మొగ్గవలసి ఉంటుంది. సన్‌యట్‌సెన్ 40 సంవత్సరాల అనుభవంవల్ల కమ్యూనిస్టు పార్టీ యొక్క 28 సంవత్సరాల అనుభవంవల్ల మనం ఖచ్చితంగా ఇదే అభిప్రాయానికి వచ్చాం. చైనాప్రజలు సామ్రాజ్యవాదపక్షమైనా లేక సామ్యవాదపక్షమైనా తీసుకోనక తప్పదనీ ఇందులో ఎట్టి మినహా యింపు లేదనీ 40 సంవత్సరాల అనుభవమూ, 28 సంవత్సరాల అను భవమూ చాటుతూన్నాయి. ఈ రెండుపక్షాలకు మధ్యస్థంగా ఉండడం అనే సమస్యే లేదు. మూడోపంథా అంటూ మరేదీ లేదు. సామ్రా

వాదపక్షంలో ఉన్న చియాంగ్ కైషేక్ అభివృద్ధి నిరోధక ముఠాతో మనం యుద్ధంచేస్తున్నాం. మూడోపంథా అనే భ్రమలు మన కేమీ లేవు. అటు సామ్రాజ్యవాద పక్షాన్ని అయినా బలపరచవలసి ఉంటుంది లేక ఇటు సామ్యవాద (సోషలిజం) పక్షాన్ని అయినా బలపచవలసి ఉంటుంది. ఇది ఒక్క చైనా విషయంలోనేకాదు: ప్రపంచంలోని అన్ని దేశాల విషయంలోనూ ఇంతే. తటస్థత అనేదిఒక ముసుగుమాత్రమే. మూడో పంథా అంటూ అసలు లేనేలేదు.

"మీరు కయ్యానికి కాలుదువ్వుతున్నారు." అని మనల్ని కొందరంటున్నారు స్వదేశీ విదేశీ అభివృద్ధినిరోధకులతో, అంటే సామ్రాజ్యవాదులతో వాళ్ళ కాపలాకుక్కలతో – మిగతా ప్రజలతో మాత్రంకాదు – ఎలా వ్యవహరించడం అనేదే అసలు సమస్య. విదేశీ అభివృద్ధి నిరోధకులకూ చైనా అభివృద్ధినిరోధకులకూ సంబంధించినంత వరకు కయ్యానికి కాలుదువ్వేస్వభావం అనే సమస్యేలేదు. ఎందు కంటే వాళ్ళు అభివృద్ధినిరోధకులు కాబట్టి. ఇందులో పెద్ద తేడా యేమీ లేదు – విప్లవశ్రేణుల్లో తగినంత జాగరూకత తీసుకుంటూనే, అభి వృద్ధినిరోధకుల లక్ష్యాలనూ కుట్రలనూ బట్టబయలు చేయడంద్వారానే, మన నైతికబలాన్ని వృద్ధిచేసుకోవడంద్వారానే, అభివృద్ధినిరోధకులను ప్రజలనుంచి వేరుచేయడం, జయించడం, అణచివేయడం సాధ్యమవు తుంది. ఒక భయంకరమృగాన్ని ఎదిరించేటప్పుడు ఎలాంటి పిరికితనం పనికిరాదు. ఆయుధాలేమీ లేకుండానే వట్టిచేతులతో చింగ్‌యాంగ్ రిడ్జ్‌పై పెద్దపులిని చంపివేసిన వూసుంగ్‌నుంచి ("ప్రజలంతా సోదరులు" అనే సుప్రసిద్ధచరిత్ర గ్రంథంలోని 108గురు వీరుల్లో ఈవూసుంగ్ కూడా ఒకడు.) మనం ఎంతో నేర్చుకోవాలి. మనం ముందుగా రెచ్చగొట్టినా రెచ్చగొట్టకపోయినా పెద్దపులి ప్రజలను మింగివేస్తుందని వూసుంగ్‌కు గట్టిగా తెలుసు. కాబట్టి పులిని తానైనా చంపివేయాలి లేకపోతే పులి తననైనా చంపివేస్తుంది. అంతకంటే వూసుంగ్‌కు మరో గత్యం తరంలేదు.

"మనం వ్యాపారాన్ని (బిజినెస్) కొనసాగించాలి" అం కొందరంటున్నారు. అప్పను ఇప్పుడు కూడా వ్యాపారాన్ని కొనసాగించ

వలసిందే. మన వ్యాపార సరళి కొనసాగకుండా అడ్డుపడే స్వదేశీ, విదేశీ అభివృద్ధి నిరోధకులకు మాత్రమే మనం వ్యతిరేకులం. మరెవరికీ మనం వ్యతిరేకులం కాదు. మనం విదేశాలతో మన వ్యాపారాన్ని కొనసాగించకుండా, వాటితో రాజకీయ సంబంధాలను పెట్టుకోకుండా అడ్డుపడేది సామ్రాజ్యవాదులూ, వాళ్ళతొత్తులైన ఛియాంగ్ కై షేకు ముఠా మాత్రమే అని మనం తెలుసుకోవాలి. స్వదేశీ, విదేశీ అభివృద్ధి నిరోధకులను తుడిచిపెట్టి వేయుడానికి మన దేశంలోనూ, తదితర దేశాల్లోనూ ఉన్న శక్తులన్నింటినీ మనం ఐక్యపరచినప్పుడే సమాన హోదాపై, పరస్పరం ప్రయోజనకారిగా, ప్రాదేశిక స్వాతంత్ర్యాన్ని (టెరిటోరియల్ సావరిసిటీ) ఉభయ పక్షాలు గౌరవించే ప్రాతిపదికపై, వ్యాపారం ప్రారంభ మవుతుంది. రాజకీయ సంబంధాల నేర్పరచు కోడం సాధ్యమవుతుంది.

"అంతర్జాతీయ సహాకారంలేకుండాకూడా విజయం సాధించ వచ్చును." అని కొందరంటున్నారు. కాని ఈ అభిప్రాయం సరియైనది కాదు. సామ్రాజ్యవాదయుగంలో ఏ దేశంలోనూ నిజమైన ప్రజావిప్లవం అంతర్జాతీయ విప్లవశక్తులనుంచి అనేకరకాల సహాకారం లభించని దే విజయంపొందదు. ఒకవేళ విజయం పొందినా దాన్ని సుస్థిరం చేసుకోడం అసంభవం. ఇదేవిధంగా నవంబరు మహత్తర విప్లవం విజయం పొందిందనీ, సుస్థిరం అయిందనీ స్టాలిన్ మన కెప్పుడో చెప్పాడు. ఈ సిద్ధాంత ప్రాతిపదికపైనే మూడు సామ్రాజ్యవాద ప్రభుత్వాలనూ నాశనంచేయడం, నూతన ప్రజాతంత్ర ప్రభుత్వాలేర్పడడం జరిగింది. చైనా ప్రజలముందు ఈనాడున్న పరిస్థితులూ ఇకముందుండబోయే పరిస్థితులూ ఇవే. ఈపరిస్థితులుమనకండ్లముందుస్పష్టంగానే కనిపిస్తున్నాయి. సోవియట్ యూనియనే లేకపోయినట్లయితే, ఫాసిస్టు వ్యతిరేక ద్వితీయ ప్రపంచయుద్ధంలో విజయాన్ని సాధించి ఉండకపోయినట్లయితే, జపాన్ సామ్రాజ్యవాదం ఓడించబడకపోయినట్లయితే, (ఇది మనకు చాలా ముఖ్యమైనవిషయం) నూతన ప్రజాతంత్ర దేశాలే లేకపోయినట్లయితే, అణచబడిన తూర్పు దేశాల్లో విజృంభిస్తూఉన్న పోరాటాలే లేకపోయి

నట్లయితే, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు, జర్మనీ, ఇటలీ, జపాను, తదితర పెట్టుబడిదారీ దేశాల్లో పరిపాలకముఠాలకు వ్యతిరేకంగా ప్రజాపోరాటాలే లేకపోయినట్లయితే,(పై చెప్పిన విషయాల్లో ఏఒకటిలేకపోయినా అంతర్జాతీయ అభివృద్ధినిరోధకశక్తుల ఒత్తిడి ఇప్పటికంటె ఇంకా ఎక్కువగా ఉండేదనడంలో ఎట్టి సందేహంలేదు.) నేటి పరిస్థితుల్లో మనం విజయాన్ని సాధించగలిగిఉండేవాళ్ళమూ ? లేదు. విజయాన్ని సాధించిన తర్వాత దాన్ని సుస్థిరం చేసుకోడంకూడా అసంభవం. ఈవిషయంలో చైనాప్రజలకు చాలా అనుభవముంది. అంతర్జాతీయ విప్లవశక్తుల ఐక్యతనుగురించి సన్‌యట్‌సేన్ తన మరణానికి పూర్వంచెప్పిన సూక్తులే ఈ అనుభవానికి ఎప్పటినుంచో ద్యోతకాలుగా ఉన్నాయి

"బ్రిటిష్, అమెరికా ప్రభుత్వాల సహాయం మనకు అవసరం"

అని కొందరంటున్నారు. కాని ఈనాడు ఈవిధంగా మాట్లాడడం చిన్నపిల్లల వాదనలాగా ఉంటుంది. బ్రిటన్‌లో, అమెరికాలో ఇంకా నేటికీ సామ్రాజ్యవాదులే పరిపాలన కొనసాగిస్తున్నారు. సామ్రాజ్యవాదులు ఒక ప్రజా ప్రభుత్వానికి సహాయం చేస్తారా ? ఈ దేశాలతో మనం వ్యాపారం సాగించడం, ఉభయులకు లాభసాటిగా ఉండే షరతులపై ఇకముందు ఈ దేశాలు మనకు అప్పురూపంలో డబ్బు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయని అనుకోడం, సాధ్యంగాదని ఎందువల్ల భావిస్తున్నాం ? ఎందుకంటే ఈ దేశాల్లోని పెట్టుబడి దారులు తమ పెట్టుబడిద్వారా ఇంకా ఎక్కువ భాగ్యవంతులు కావాలని చూస్తున్నారు. ఆర్థిక సంక్షోభాన్ని తగ్గించుకోడానికి బ్యాంకర్లు వడ్డీ డబ్బులు వసూలు చేసుకోవాలని చూస్తున్నారు. అంతేకాని చైనా ప్రజలకు సహాయం చేయాలనే ఉద్దేశం వాళ్ళకు లేదు. ఆ దేశాల్లోని కమ్యూనిస్టుపార్టీలూ, అభ్యుదయ పార్టీలూ గ్రూపులూ మనతో ఆ దేశాలు వర్తక వ్యాపారాలు సాగించాలనీ రాజకీయ సంబంధాలు కూడా పెట్టుకోవాలనీ ఆందోళన చేస్తున్నాయి. వాటి ఉద్దేశాలు మంచివే. అవి మనకు తోడ్పడతాయి. ఆదేశాల్లోని బూర్జువావర్గ క్రియాకలాపాలతో వాటిని పోల్చగూడదు. సన్‌యెట్‌సెన్ తన జీవితంలో ఒకసారి కాదు - అనేకసార్లు - సహాయం కోసం సామ్రాజ్యవాదులను అర్థిం

చాడు. కాని ఆయన ప్రయత్నాలన్నీ నిష్ఫల మయ్యాయి. సామ్రాజ్యవాదులు సహాయం చేయకపోగా, పైగా ఆయనమీద దాడి సాగించారు. ఆయన జీవితంలో ఒకే ఒకసారి ఆయనకు అంతర్జాతీయ సహకారం లభించింది... ఎక్కడనుంచి? ఒక్క సోవియట్ యూనియన్ నుంచి మాత్రమే సామ్రాజ్యవాద దేశాలనుంచి ఎటువంటి సహాయం అపేక్షించవలదని ఆయన తన మరణ శాసనంలో ప్రజలకు విజ్ఞప్తి చేశాడు. ఆ విజ్ఞప్తి వైపు పాఠకులు ఒకసారి తమ దృష్టిని ప్రసరింపజేయండి. "మనలను సమానజాతిగా పరిగణించే ప్రపంచ జాతులతో ఏకంకండి" అని ఆయన ప్రజలకు బోధించాడు సన్ యెట్ సెన్ మోసగింపబడ్డాడు. అందువల్ల ఆయన అనుభవపూర్వకంగా చెప్పిన మాటలను మనం మరచిపోగూడదు. మనం కూడా మళ్ళీ సామ్రాజ్యవాదుల మోసానికి గురి కాగూడదు.

అంతర్జాతీయంగా సోవియట్ యూనియన్ ఆధ్వర్యం వహించిన సామ్రాజ్యవాద వ్యతిరేక సంఘటనలో మనం ఉన్నాం. ఈ సంఘటన నుంచే మనం నిజమైన సుహృద్భావపూరిత సహకారాన్ని అపేక్షిస్తున్నాం. అంతేకాని సామ్రాజ్య వాదుల కూటమినుంచి మాత్రం కాదు.

"మీరు నియంతృత్వాన్ని నెలకొల్పుతున్నారు" అని కొందరు మనతో అంటున్నారు. ప్రియమైన పెద్దలారా! మీరనేమాట నిజమే. నిజంగా మేము నియంతృత్వాన్నే నెలకొల్పుతున్నాం. అనేక దశాబ్దాలనుంచి చైనా ప్రజలు గడించిన అనుభవమే నూతన ప్రజాతంత్ర నియంతృత్వాన్ని నెలకొల్పవలసిన అవసరాన్ని తెలియజేస్తోంది. నూతన ప్రజాతంత్ర నియంతృత్వం అంటే అభివృద్ధి నిరోధకులకు వోటింగు హక్కుండదు. ప్రజలకు మాత్రమే వోటింగ్ హక్కుంటుంది. తమ అభిప్రాయాన్ని తెలియపరిచే హక్కుంటుంది. "ప్రజలు" అంటే ఎవరు? చైనాదేశపు నేటిదశలో కార్మికవర్గమూ, రైతువర్గమూ, చిన్న బూర్జువా వర్గమూ, జాతీయ బూర్జువా వర్గమూ -వీరే ప్రజలు. కార్మికవర్గమూ, కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన ఈ వర్గాలు తమ స్వంత ప్రభుత్వాన్ని (స్టేటు) ఏర్పరచుకోడానికీ, తమ స్వంత ప్రభుత్వాన్ని ఎన్నుకోడానికీ సామ్రాజ్యవాదుల తొత్తులైన భూస్వామి

వర్గంపై నిరంకుశ పెట్టుబడిదారీ వర్గంపై నియంతృత్వం నెరపడానికీ, ఆవర్గాలను అణచివేయడానికీ, అనుమతించిన కొన్ని పరిమితుల్లో మాత్రమే ఆవర్గాలు తమ కార్యక్రమాలను సాగించుకొనేటట్లూ ఆ పరిమితులను మాటల్లోగానీ చేతల్లోగానీ, అతిక్రమించకుండా ఉండేటట్లు చూడడానికీ ఏకమయ్యాయి. ప్రజల్లో ప్రజాస్వామిక విధానం తప్పకుండా అమలు జరపబడుతుంది. ప్రజలకు వాక్సభాసంఘ స్వాతంత్ర్యాలుంటాయి. వోటింగు అధికారం ప్రజలకు మాత్రమే ఉంటుంది. అభివృద్ధి నిరోధకుల కుండదు. ప్రజలకు ప్రజాస్వామికం, అభివృద్ధి నిరోధకులపై నియంతృత్వం – ఈ రెండు విషయాలు నూతన ప్రజాతంత్ర నియంతృత్వానికి ప్రాతినిధ్యం వహిస్తాయి.

పరిస్థితులెందువల్ల ఖచ్చితంగా ఈరూపాన్నే తీసుకుంటున్నాయి? ఈరూపాన్ని తీసుకోకపోతే విప్లవం ఓడిపోవడం, ప్రజలు దురదృష్టానికి గురికావడం, దేశం నాశనంకావడం జరుగుతుందని స్పష్టంగా బోధపడుతుంది.

“ప్రభుత్వాధికారాన్ని మీరు నిర్మూలించివేయదలచుకోలేదా?” అని కొందరు అడుగుతున్నారు. అవును, నిర్మూలించివేయదలచుకొన్నమాట వాస్తవమే; కాని ఇప్పుడుగాదు. ప్రభుత్వాధికారాన్ని ప్రస్తుతం నిర్మూలించివేయలేము. ఎందువల్ల? సామ్రాజ్యవాదం ఇంకా జీవించేఉంది. చైనా అభివృద్ధినిరోధకవర్గం ఇంకాఅలాగే ఉంది. దేశంలో వర్గాలు ఇంకా అలాగే ఉన్నాయి. కాబట్టి ప్రజాప్రభుత్వ యంత్రాన్ని బలపరచడమే నేటి మన కర్తవ్యం. అంటే; ముఖ్యంగా ప్రజాసైన్యాన్నీ, ప్రజా పోలీసులనూ, ప్రజాకోర్టులనూ, దేశరక్షణనూ, బలపరచడమన్నమాట. ప్రజల ప్రయోజనాలను సంరక్షించడమన్నమాట. వ్యావసాయిక దేశాన్నుంచి చైనా ఒక పారిశ్రామిక దేశంగా అభివృద్ధిచెందాలంటే, వర్గాలను రద్దుచేసి ప్రపంచ కమ్యూనిజానికి తీసుకొనివెళ్ళడానికి నూతన ప్రజాతంత్రంనుంచి చైనా సోషలిస్టు, కమ్యూనిస్టు సమాజాలకు పరిణతిచెందాలంటే కార్మికవర్గ నాయకత్వాన నిరంతరాభివృద్ధిచెందడం అత్యవసరం. వర్గాలను అణచివేయడానికి సైన్యం, పోలీసు, ప్రభుత్వ కోర్టులూ ఇవి వర్గసాధనాలు

ప్రభుత్వయంత్రం వ్యతిరేకవర్గాలను అణచివేసే సాధనం. అది హింసాయుత సాధనంకాని 'కరుణా'యుగ సాధనం కాదు

"మీరు సదయహృదయులు కారు" అని కొందరంటున్నారు. అదినిజమే. అభివృద్ధి నిరోధకులకూ, అభివృద్ధి నిరోధకవర్గాలకూ, సంబంధించినంతవరకు మేము ఖచ్చితంగా నిర్దయహృదయులమే. సదయహృదయత ప్రజలపట్ల మాత్రమే మేము ప్రదర్శిస్తాం. ప్రజల్లో పరిగణింపబడని అభివృద్ధి నిరోధకుల, అభివృద్ధి నిరోధకవర్గాల కార్యకలాపాల విషయంలో మాత్రంకాదు. ప్రజాప్రభుత్వం ప్రజలను రక్షిస్తుంది. స్వదేశీవిదేశీ అభివృద్ధి నిరోధకుల పలుకుబడిని ప్రభావాన్ని (ఈ ప్రభావం ఇంకా చాలాబలంగానే ఉంది. ముందుకూడా ఇంకా చాలా కాలంవరకు బలంగానే ఉంటుంది. ఇదిత్వరగా నిర్మూలించబడదు.) తొలగించడానికీ, పాతసమాజం నుంచి సంక్రమించే చెడు అలవాట్లనూ సిద్ధాంతాలనూ త్రోసివుచ్చడానికీ, అభివృద్ధి నిరోధకులు సూచించే అపసవ్యమార్గాన్ని అనుసరించకుండా సోషలిస్టు కమ్యూనిస్టు సమాజాలను నిర్మించేదశలో అభివృద్ధిచెందడానికీ — పురోగమనం సాగించడానికీ — ఒక్క ప్రజాప్రభుత్వంలోనే జాతీయస్కేలుపై ప్రజలు ప్రజాస్వామిక పద్ధతులను వర్తింపచేయగలరు. తమను పూర్తిగా విజ్ఞానవంతులుగా పునర్విజ్ఞానవంతులుగా చేసుకొనగలరు.

ఈ విషయంలో మనం ఉపయోగించే పద్ధతులు ప్రజాస్వామికంగా ఉంటాయి. అంటే మనం ఈ రంగంలో బలత్కార పద్ధతులను అవలంబించం. నచ్చజెప్పిమాత్రమే లోబరచుకుంటాం. ప్రజలు చట్టాన్ని ఉల్లంఘించిన పక్షంలో శిక్షింపబడడం జైళ్ళల్లో బంధించడం జరుగుతుంది. ఉరిశిక్షలుకూడా విధించబడవచ్చు. కాని ఇవి వ్యక్తులకు సంబంధించిన కేసులు మాత్రమే. ఒక వర్గంగా మొత్తం వర్గానికి వ్యతిరేకంగా సాగించే నియంతృత్వానికీ, ఈ వ్యక్తిగత కేసులకూ అసలు సిద్ధాంతంలోనే భేదం ఉంది. తమ్ముతాము తిరిగి విజ్ఞానవంతులుగా చేసుకొనగలందులకై అభివృద్ధి నిరోధకుల రాజకీయాధికారాన్ని కూలద్రోసిన తర్వాత అభివృద్ధి నిరోధక వర్గానికీ, అభివృద్ధి నిరోధక ముఠాకి కూడా భూములు ఇవ్వబడతాయి. పనులు

చూపబడతాయి. జీవనాధారం కల్పించబడుతుంది. కాని తిరుగుబాట్లకు ప్రయత్నించమని, విధ్వంస చర్యలకు పూనుకోమనీ వారు హామీ ఇవ్వవలసి ఉంటుంది. వారు పనిచేయ నిరాకరిస్తే ప్రజా ప్రభుత్వం వారిచే బలత్కారంగా నైనా పనిచేయించి తీరుతుంది. అంతేకాకుండా మనం ఖైదీలుగా పట్టుకున్న అధికారుల్లో లాగే వారిలోకూడా రాజకీయ ప్రచారము, విజ్ఞాన ప్రచారమూ చేయబడుతుంది. దీన్నికూడా కారుణ్య భరితమైన పరిపాలనగానే భావించవలసి ఉంటుంది. ఇదివరకు మనకు వ్యతిరేకంగా ఉన్న వర్గాలకు సంబంధించినంతవరకు దీన్ని బలప్రయోగం ద్వారానే అమలుపరచవలసి ఉంటుంది. విప్లవాత్మక ప్రజల్లో మనం కొనసాగించే విజ్ఞానకృషితో దీన్ని సమానంగా పోల్చగూడదు. ఈ విధంగా అభివృద్ధి నిరోధక వర్గాలను పునర్విజ్ఞానవంతులుగా (రిఎడ్యుకేట్) చేయడం అనేది నూతన ప్రజాతంత్ర నియంతృత్వ ప్రభుత్వంలో మాత్రమే సాధ్యమవుతుంది.

ఈ కృషిని సక్రమంగా కొనసాగించేపక్షంలో చైనాలోని ప్రధాన దోపిడివర్గాలైన భూస్వామిక వర్గమూ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గమూ లేక గుత్త పెట్టుబడిదారీ వర్గమూ చివరకు తుడిచిపెట్టివేయబడతాయి. మరో దోపిడి వర్గమయిన జాతీయ బూర్జువా వర్గం విషయంలో ప్రస్తుతదశలో తీవ్రమైన విజ్ఞానకృషి కొనసాగించవలసి ఉంటుంది. సోషలిజం అనుభవంలోకి వచ్చినప్పుడు, లేక మరోమాటల్లో చెప్పాలంటే, వ్యక్తిగత పరిశ్రమలు జాతీయం చేయబడినప్పుడు జాతీయ బూర్జువావర్గం తనను ఇంకా ఎక్కువ విజ్ఞానవంతంగా, పునర్విజ్ఞానవంతంగా చేసుకోగలుగుతుంది. బలమైన ప్రభుత్వయంత్రం ప్రజల చేతుల్లో ఉంది; కాబట్టి జాతీయ బూర్జువావర్గం తిరుగుబాటు చేస్తుందనే భయంలేదు.

రైతులను విజ్ఞానవంతులుగా చేయడమనేది ఒక తీవ్రమైన సమస్య. రైతుకుటుంబాలు చిందరవందరగా ఉంటాయి. సోవియట్ యూనియన్ యొక్క అనుభవాన్నిబట్టిచూస్తే వ్యవసాయాన్ని సంఘపరం (సోషలైజ్) చేయడానికి ఎక్కువకాలం పడుతుంది. ఇంకా

ఎక్కువ కృషి అవసరం అవుతుంది. వ్యవసాయాన్ని సంఘపరం చేయకుండా పరిపూర్ణమైన, స్థిరమైన సోషలిజం అంటూ ఉండదు వ్యవసాయాన్ని సంఘపరంచేయాలంటే అంతకుముందు ప్రభుత్వ పరిశ్రమలను ఆధారభూతంగా చేసుకొని భారీపరిశ్రమలను నిర్మించడం అత్యవసరం. పల్లెటూళ్ళను పారిశ్రామికం చేయడం అనే సమస్యను నూతన ప్రజాతంత్ర నియంతృత్వ ప్రభుత్వం ఒక్కొక మెట్టు చొప్పున పరిష్కరించవలసి ఉంటుంది. ఆర్థిక సమస్యను గూర్చి ఈవ్యాసంలో చర్చించడం లేదు గాబట్టి ఇక్కడ ఈవిషయాన్ని మనం లోతుగా తరచవలసిన పనిలేదు.

1924 లో జరిగిన మొదటి కొమింటాంగ్ కాంగ్రెసులో ఆమోదించబడిన సుప్రసిద్ధ ప్రణాళికలో (మానిఫెస్టో) లో ఈ క్రిందివిధంగా ఉంది : (ఈ కాంగ్రెసు స్వయంగా సన్ యెట్ సెన్ పర్యవేక్షణక్రిందనే జరిగింది. దీనికి కమ్యూనిష్టులుకూడా హాజరయ్యారు.)

" ఆధునిక దేశాల్లోని ప్రజాస్వామికం అనబడే విధానం తరచుగా పెట్టుబడిదారీవర్గంయొక్క గుత్తాధికారంగా తయారయింది. ప్రజల నణచ డానికి ఒక సాధనంగా దీన్ని వాళ్ళు ఉపయోగిస్తున్నారు. కాని కొమింటాంగ్ ప్రజాస్వామిక ఏకొద్దిమంది వ్యక్తుల చేతుల్లోనో వారి వ్యక్తిగత ఆస్తిగా ఉండకుండా సర్వజనులకు సంబంధించిన ఆస్తిగా ఉటుంది. "

నడిపేదెవరు ? నడపబడేదెవరు ? అనే ప్రశ్నల నటుంచి జనరల్ రాజకీయ కార్యక్రమం దృష్టితో చూస్తే ఈ రకపు ప్రజాస్వామికం మనం పేర్కొనే ప్రజల ప్రజాస్వామికంతోనూ, లేక నూతన ప్రజాతంత్రంతోనూ సరిపోతుంది. బూర్జువా వర్గంయొక్క వ్యక్తిగత ఆస్తిగా గాకుండా ప్రజలందరకు ఉమ్మడి ఆస్తిగా ఉండే ప్రభుత్వ విధానానికి కార్మికవర్గ నాయకత్వాన్ని జతపరిస్తే అది నూతన ప్రజాతంత్ర నియంతృత్వమే అవుతుంది. కాని ఛియాంగ్ కై షేక్ సన్ యట్ సెన్ కు ద్రోహంచేశాడు. చైనాప్రజలను అణచివేయుడానికి ఒక ఆయుధంగా నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామివర్గాల నియంతృత్వాన్ని ఉపయోగించాడు. ఈ విప్లవ ప్రతిఘాతి నియంతృత్వం 22 సంవత్సరాలు చలామణి అయింది. మన నాయకత్వాన ఇప్పుడు చైనాప్రజలు ఈ నియంతృత్వాన్ని కూలద్రోశారు.

"నియంతృత్వం" అనీ "నిరంకుశత్వం" అనీ మనల నాక్షేపించే విదేశీ అభివృద్ధినిరోధకులే నిజానికి శ్రామికవర్గానికీ తదితర ప్రజానీకానికీ వ్యతిరేకంగా ఏకవర్గ నియంతృత్వాన్ని-బూర్జువావర్గ నియంతృత్వాన్ని-నిరంకుశత్వాన్ని చలాయిస్తున్నారు. ఆధునిక దేశాల్లో ప్రజలను అణచివేసే బూర్జువావర్గమని సన్‌యట్‌సెన్ పేర్కొన్నది ఈ అభివృద్ధినిరోధకులనే. తన విప్లవ ప్రతిఘాతనియంతృత్వాన్ని నెలకొల్పడంలో ఛియాంగుకైషేక్ ఈ అభివృద్ధినిరోధకుల అడుగుజాడల్లోనే నడిచాడు. నూంగు వంశీయుడైన చూ-సీ అనే తత్వశాస్త్రవేత్త అనేకగ్రంథాలను రచించాడు. అనేక ఉపన్యాసాలిచ్చాడు. కాని మనం వాటిని ఇదివరకే మరచిపొయ్యాం. అయినాఆయనజెప్పినసుభాషితం ఒకటి మనకెప్పుడూ జ్ఞాపకం ఉంటుంది. "వారు నీపట్ల ఎలా వ్యవహరిస్తారో, నీవు వారిపట్ల అలాగే వ్యవహరించు." సరిగ్గా నేడు మనం జేస్తూఉన్న పనికూడా ఇదే. అంటే: సామ్రాజ్యవాదులూ వాళ్ళ తొత్తులైన అభివృద్ధినిరోధక ఛియాంగ్‌కైషేక్ ముఠా ఇతరులపట్ల ఎలా వ్యవహరించిందో అలాగే వారిపట్ల ఇతరులు వ్యవహరిస్తున్నారు. అంతే మరేమీలేదు.

విప్లవాత్మక నియంతృత్వమూ, విప్లవ ప్రతిఘాత నియంతృత్వమూ, ఒకదానికొకటి పరస్పర విరుద్ధములైనవి విప్లవ ప్రతిఘాత నియంతృత్వం నుంచి విప్లవాత్మక నియంతృత్వం అనేకవిషయాలను నేర్చుకుంది. ఈవిధంగా నేర్చుకోవడం చాలా ప్రాముఖ్యమైన విషయం. ఎందుకంటే, విప్లవప్రతిఘాత వర్గాలపై అధికారం సాగించే పద్ధతుల్లో విప్లవాత్మక ప్రజలు ప్రావీణ్యాన్ని సంపాదించకపోతే వారు తమ ప్రభుత్వాన్ని కాపాడుకోలేరు స్వదేశీ, విదేశీ అభివృద్ధినిరోధక ముఠాలు వారి ప్రభుత్వాన్ని కూల్చివేస్తాయి. అభివృద్ధినిరోధకులు మళ్ళీ అధికారాన్ని స్థాపించి విప్లవాత్మక ప్రజలను అనేక కష్టాలపాలు చేస్తారు.

కార్మికవర్గమూ, రైతాంగమూ, పట్టణ పెటీబూర్జువావర్గమూ వీటియొక్క సన్నిహితసంబంధం – ముఖ్యంగా రైతాంగంతో కార్మికవర్గంయొక్క సన్నిహితసంబంధమే(ఎందుకంటే మొత్తం వీరి సంఖ్యయే జనాభాలో నూటికి 80 నుంచి 90 వరకూఉంటుంది.) నూతన ప్రజాతంత్ర నియంతృత్వానికి ప్రాతిపదికగావుతుంది. ప్రధానంగా కార్మిక వర్గశక్తుల

చేత రైతాంగ శక్తుల చేతనే, సామ్రాజ్యవాదమూ అభివృద్ధినిరోధక కోమింటాంగు కూటమి కూల్చివేయబడ్డాయి. ముఖ్యంగా ఈ రెండువర్గాల సన్నిహిత సంబంధంపైనే నూతన ప్రజాతంత్ర దశనుంచి సోషలిజందశకు జరిగే మార్పు ఆధారపడిఉంటుంది. కార్మికవర్గంమాత్రమే తదితరవర్గాలన్నిటి కంటె దూరదృష్టిగలదీ, న్యాయసంగతమైనదీ, స్వార్థరహితమైనదీ నిరంతర విప్లవాత్మకమైనదీ, కాబట్టి నూతన ప్రజాతంత్ర నియంతృత్వానికి కార్మికవర్గమే తప్పకుండా నాయకత్వంవహిస్తుంది. కార్మికవర్గ నాయకత్వంలేకపోతే విప్లవం విఫలమైతీరుతుందని విప్లవాలన్నిటి చరిత్ర చాటి చెప్పతూఉంది. కార్మికవర్గ నాయకత్వాన విప్లవం జయప్రదం అవుతుంది. సామ్రాజ్యవాదయుగంలో ఏదేశంలోనూ మరే ఇతరవర్గమూ విప్లవాన్ని విజయవంతంగా నడిపించలేదు. చైనా పెటీ బూర్జువా వర్గమూ, జాతీయ బూర్జువావర్గమూ అనేకసార్లు విప్లవాన్ని నడిపింది. కాని ఆ విప్లవం ఎప్పుడూ విఫలమవుతూనేవచ్చింది. ఇదే పై విషయాన్ని పూర్తిగా ధ్రువపరుస్తూఉంది.

ప్రస్తుతదశలో జాతీయ బూర్జువావర్గం చాలా ముఖ్యమైనది. సామ్రాజ్యవాదం ఇంకా మన ప్రక్కనే ఉంది. అది చాలా క్రూరమైన శత్రువు. చైనా నిజమైన ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించడానికి ఇంకా చాలాకాలం పడుతుంది. చైనా పరిశ్రమలు అభివృద్ధి చెంది, ఆర్థికంగా చైనా విదేశాలపై ఆధారపడకుండా ఉన్నప్పుడు మాత్రమే నిజమైన సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించినట్లవుతుంది. చైనా జాతీయాదాయంలో ఆధునిక పరిశ్రమల దామేషా ఇంకా స్వల్పంగానే ఉంది. మనకింకా అధికారపూర్వకమైన లెక్కలు లభ్యం కాలేదు. కాని దొరికిన వివరాలనుబట్టి చూస్తే దేశంయొక్క జాతీయాదాయంలో జనరల్ పారిశ్రామిక ఉత్పత్తిలో ఆధునిక పరిశ్రమల ఉత్పత్తి నూటికి పదివంతులే అని అంచనా వేయబడుతూఉంది. సామ్రాజ్యవాదుల ఒత్తిడిని తొలగించడానికీ, వెనకబడిన ఆర్థిక విధానాన్ని ఒక అడుగు పురోగమింప చేయడానికీ, జాతీయాదాయానికి లాభదాయకమైనటువంటీ, ప్రజల జీవనస్థాయిని దెబ్బగొట్టనటువంటీ, పట్టణాల్లోనూ, పల్లెల్లోనూ ఉన్న పెట్టుబడిదారుల ప్రతి ఒక పరిశ్ర

మనూ చైనా తప్పకుండా ఉపయోగించుకోవలసి ఉంటుంది. ఉమ్మడి పోరాటంలో జాతీయ బూర్జువా వర్గంతో చైనా ఏకం అయితీరాలి. పెట్టుబడిదారీ విధానాన్ని పరిమితం చేయడమే కాని నాశనంచేయడం మన ప్రస్తుత పాలసీ కాదు.

ఏమైనా, జాతీయ బూర్జువావర్గం విప్లవానికి నాయకుడుగా ఉండజాలదు. ప్రభుత్వంలో ప్రధాన (లీడింగ్) స్థానాన్ని కూడా ఆవర్గం ఆక్రమించుకొనజాలదు. ఎందుకంటే ఆవర్గం యొక్క సాంఘిక ఆర్థిక స్థితియే దాని బలహీనతను నిర్ణయిస్తూ ఉంది. దూరదృష్టి ధైర్యసాహసాలు లేకపోవడం, ప్రజలంటే భయమూ ఆవర్గ ప్రతినిధుల్లో అనేక మందిలో ప్రదర్శితమయ్యాయి. "ప్రజల్లో జాగృతిని కలిగించాలి" అనీ, లేక "రైతులకూ కార్మికులకూ సహాయంచేయాలి" అనీ సన్ యట్ సెన్ చెప్పాడు. ప్రజల్లో జాగృతి కలిగించడానికీ వారికి తోడ్పడడానికీ పాటుపడే దెవరు? సన్ యట్ సెన్ ఉద్దేశం ప్రకారం చిన్న బూర్జువా వర్గమూ, జాతీయ బూర్జువావర్గమూ. కాని ఆచరణలో ఇది సాధ్యమయ్యేది కాదు. 40 సంవత్సరాలు సన్ యట్ సెన్ చేసిన విప్లవకృషి తుదకు విఫలమైపోయింది. ఎందువల్ల? సామ్రాజ్యవాద యుగంలో పెటీ బూర్జువావర్గమూ జాతీయ బూర్జువావర్గమూ, నిజమైన ఏ విప్లవాన్నీ విజయవంతంగా నడిపించలేవు. మన 28 సంవత్సరాల అనుభవంకూడా ఇదే చెప్పుతూఉంది. మనం అమూల్యమైన అనుభవాన్ని గడించాం. ఆ అనుభవంయొక్క సారం ఈ క్రింది మూడువిషయాల్లో ఇమిడిఉంది. మార్క్స్, ఎంగిల్స్, లెనిన్, స్టాలిన్‌ల సిద్ధాంత విజ్ఞానాన్ని ఆర్జించి టువంటీ ఆత్మవిమర్శన పద్ధతిని ఉపయోగించేటటువంటీ ప్రజాసామాన్యంతో ఘనిష్ట సంబంధం కలిగినటువంటీ, క్రమశిక్షణ గలిగిన పార్టీ; ఈ పార్టీచే నడపబడే సైన్యమూ; ఈపార్టీనాయకత్వాన సమాజంలోని వివిధ విప్లవ సెక్షన్ల యొక్క, గ్రూపులయొక్క ఐక్య సంఘటన.

ఇది మన పూర్వులనుంచి మనలను విభిన్నులుగా చేస్తూఉంది. పై జెప్పిన ఈమూడుసూత్రాలపై ఆధారపడి మనం ప్రధాన విజయాన్ని సాధించాం. కష్టమైన మార్గాన మనం పయనించాం. పార్టీలోని మితవాద, అతివాద, అవకాశవాద పోకడలకు వ్యతిరేకంగా పోరాటం సాగించాం. తీవ్రమైన పొరపాట్లు చేసినప్పుడు విప్లవం

వెనుకంజ వేసింది. మనంచేసిన పొరపాట్ల నుంచీ, గప్పులనుంచీ, మనం గుణపాఠాలు నేర్చుకున్నాం. ఇంకా ఎక్కువ విజ్ఞానవంతులమయ్యాం. ఆ విధంగా ఇంకా బాగా కృషిచేయగలిగిన వారమయ్యాం. ఏపార్టీకి అయినా, ఏవ్యక్తికిఅయినా, పొరపాట్లు దొర్లకుండా ఉండవు కాని పొరపాట్లు సాధ్యమైనంతతక్కువగా జరిగేటట్లు చూడాలి. జరిగిన పొర పాటును దిద్దుకోవాలి. ఆ దిద్దుకోవడం అనేది ఎంత త్వరగా ఎంత పూర్తిగా జరిగితే అంతమంచిది. మన అనుభవాన్ని ఈవిధంగా సంగ్ర హించవచ్చు: కార్మికవర్గ నాయకత్వాన (కమ్యూనిస్టు పార్టీ ద్వారా) కార్మికుల రైతుల ఘనిష్ట సంబంధంపై ఆధారపడిన నూతన ప్రజాతంత్ర నియంతృత్వం. ఈ నియంతృత్వం అంతర్జాతీయ విప్లవశక్తులతో తప్ప కుండా ఒడంబడి ఉండాలి. ఇదీ మన సిద్ధాంతం. మన ముఖ్యానుభవం. మన కార్యక్రమం.

మన పార్టీ తన ఈ 28 సంవత్సరాల జీవితంలో విప్లవ పోరా టంలో ప్రధానమైన విజయాన్ని సాధించింది. ఇది చాలా ముఖ్య మైన విషయం. ఎందుకంటే, ఇది ప్రజావిజయం. చైనాలాంటి ఒక పెద్ద దేశంలో విజయం.

ఇంకా మనముందు చేయవలసిన పని చాలా ఉంది. పదివేల మైళ్ళ పొడుగున్న రోడ్డులో మనం ఇప్పటికి ఒక్క అడుగుమాత్రమే పురోగమించారు. ఇంకా మనం శత్రు అవశేషాలను నిర్మూలించవలసి ఉంది. ఆర్థిక నిర్మాణం అనే ముఖ్యమైన కర్తవ్యం నేడు మనల నెదు ర్కొంటూ ఉంది. ఇప్పటివరకు మనం అలవాటుపడిన పనిని త్వరలోనే ముగించి మనం ఒక నూతన కృషిని సాగించవలసి ఉంటుంది. ఉన్న ఇబ్బంది అంతా ఇక్కడే ఉంది. మనల నెదుర్కొనే ఆర్థిక సమస్యను మనం పరిష్కరించలేమని సామ్రాజ్యవాదులు భావిస్తూఉన్నారు మనకు అపజయం ఎప్పుడు కలుగుతుందా అని వాళ్ళు పొంచి చూస్తూ ఉన్నారు. మనం కష్టాలను అధిగమించవలసి ఉంది. మనకింతవరకు క్రొత్తగా ఉన్న విషయాల్లో మనం ప్రావీణ్యత గడించవలసి ఉంది. ఆర్థికరంగంలో, మనం ప్రతివ్యక్తినుంచీ – ఆ వ్యక్తి ఎవరైనాసరే–పని చేయడాన్ని నేర్చుకోవాలి. అలాంటివారిని మనం మన గురువులుగా గుర్తించి వారినుంచి నేర్చుకోవాలి. మనకు తెలియని విషయాన్ని

గురించి అంతా ఇదివరకే తెలిసినట్లు నటించగూడదు. మనం నిరంకుశులుగా తయారు కాగూడదు. మనం పనులు తీసుకోవాలి. వాటిని అనేక మాసాల్లో ఒకటి రెండు సంవత్సరాల్లో లేక మూడు నుంచి ఐదు సంవత్సరాల్లో నయినా సరే వాటిని నిర్వహించి తీరాలి.

సోవియట్ యూనియన్‌లో కూడా మొట్టమొదట అనేకమంది కమ్యూనిస్టులకు ఆర్థికరంగంలో ఎలా కృషిచేయాలో తెలిసిందికాదు. సామ్రాజ్యవాదులు అప్పుడు కూడా ఇదేవిధంగా భావించారు- సోవియట్ యూనియన్‌కు అపజయం కలుగుతుందని ఆశించారు- కాని సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ తనకర్తవ్యాన్ని జయప్రదంగా నిర్వహించింది. లెనిన్ స్టాలిన్‌ల నాయకత్వాన కమ్యూనిస్టు పార్టీ విప్లవకృషి సాగించడమే కాకుండా నిర్మాణ కృషినికూడా సాగించింది. ఇప్పటికే ఒక మహత్తరమైన ఉజ్వలమైన సోషలిస్టు దేశాన్ని నిర్మించింది. మనకు సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ ఉత్తమోత్తమమైన గురువు. ఆపార్టీనుంచి మనం ఎంతో నేర్చుకోవలసిఉంది. అంతర్జాతీయ పరిస్థితులూ ఆంతరంగిక పరిస్థితులూ మనకు సుముఖంగా ఉన్నాయి. అభివృద్ధి నిరోధకులను మినహాయించి; యావద్దేశంలోని ప్రజలందరిలో ఐక్యత సాధించడానికీ అచంచలంగా మన లక్ష్యంవైపు పురోగమించడానికీ నూతన ప్రజాతంత్ర నియంతృత్వం అనే ఆయుధంపై మనం పూర్తిగా ఆధారపడవచ్చు.

"ఫర్ ఏ లాస్టింగ్ పీస్ ఫర్ ఏ పీపుల్స్ డెమాక్రసీ" 15 జూలై 1949.

"వివిధ 'నాగరిక' క్రూరమృగాలు నేడు చైనాప్రజాస్వామికంపై పండ్లు నూరుతూ ఉన్నాయి. మహత్తరమైన చైనా రిపబ్లిక్ ఎలాంటి బాధలకు గురిఅయినా ప్రపంచంలో మరేశక్తీ ఆసియాఖండాన్ని మళ్ళీ బానిసత్వంలో అట్టిపెట్టలేదు. ఆసియాదేశాల్లోనూ అర్థఆసియాదేశాల్లోనూ అసంఖ్యాక ప్రజానీకంయొక్క ప్రజాతంత్రాన్ని తుడిచిపెట్టివేయలేదు."

లెనిన్

("మార్క్స్, ఎంగెల్స్ - మార్క్సిజం")

సామ్రాజ్యవాదంలో పరస్పర వైరుధ్యాలు

రజనీ పామీదత్తు

★

దాదాపు మూడున్నర దశాబ్దాల కాలంగా పెట్టుబడిదారీ విధానంలో సర్వతో వ్యాప్తమైన సంక్షోభం ప్రారంభమై త్వరితగతిని వృద్ధిపొందుతుంది. పెట్టుబడిదారీవిధానం గుత్తపెట్టుబడిదారీ దశనూ, సామ్రాజ్యవాదదశనూ అందుకొని ప్రపంచ విభజనకు కారణభూతమైన తరువాత తానే స్వయంగా సృష్టించిన ఉత్పత్తి శక్తులను యింక అభివృద్ధిచేయడం అసాధ్యమైపోయింది. ప్రపంచాన్ని తిరిగి పునర్విభజించడానికే యీ ఉత్పత్తిశక్తులు స్వవినాశకరమైన సంఘర్షణలో బ్రద్దలవడం సంభవిస్తుంది. పెట్టుబడిదారీవిధానంలోనే శాంతియుతంగా అభివృద్ధి చెందడానికి అవకాశముంటుందనీ, దానితో కార్మిక వర్గమూ దానిమిత్రులూ అభివృద్ధి చెందడానికి తగిన పరిస్థితులు సృష్టించబడి అవి సామ్రాజ్యవాదాన్ని కూలద్రోసి, సోషలిస్టు విజయానికి పురోగమించే బాధ్యతను నెరవేర్చగలవనే సంస్కరణవాద భ్రమలను ప్రథమ ప్రపంచ యుద్ధం పటాపంచలుచేసింది. రష్యాలో అక్టోబరు సోషలిస్టు మహా విప్లవ విజయంతోనూ, సామ్రాజ్యవాదపు దాడులను జయప్రదముగా తట్టుకొని నూతన సోషలిస్టురాజ్యం నిలబడ గలగడంతోనూ ప్రపంచ పెట్టుబడిదారీ విధానంలో మొట్టమొదటి సారిగా గండి కొట్టబడింది. దీనితో ప్రపంచ సోషలిస్టు విప్లవయుగం ప్రారంభమైంది. ఈ విధంగా పెట్టుబడిదారీవిధానంలో సర్వతో వ్యాప్తి సంక్షోభం ఆరంభమైంది.

ప్రథమ ప్రపంచ యుద్ధానంతర పరిస్థితిని రెండో ప్రంపంచ యుద్ధానంతర ప్రపంచ పరిస్థితితో పోల్చి చూసుకొంటే యీ మధ్యకాలంలో పెట్టుబడిదారీ విధానము ఎంతటి తీవ్రతరమైన సర్వవ్యాపిత సంక్షోభానికి గురిఅయిందో స్పష్టంగా బోధపడుతుంది.

మొదటి ప్రపంచ యుద్ధానంతరం కూడా సామ్రాజ్యవాద నాయకులు తమ విధానానికి (పెట్టుబడిదారీ) ఎంతటి బలమైనదెబ్బ తగిలిందో గ్రహించలేక పోయారు. వారు మొదటి ప్రపంచ యుద్ధాన్ని మామూలు పరిస్థితులలో అనుకోకుండా, ఏదో యాదృచ్ఛికంగా జరిగిన ఒక సంఘటనగా భావించారు. దీనినే చర్చిల్ తన బోస్టన్ ప్రసంగంలో "అకస్మాత్తుగా జరిగిన తీవ్ర సంఘటన"లుగా పేర్కొన్నాడు. అక్టోబరు విప్లవాన్ని మిలిటరీ బలంతో అణచివేయడానికి వీలైన ఒక తిరుగుబాటుగా మాత్రమే వారు భావించారు. "బోల్షివిజాన్ని ఆది

లోనే తుద ముట్టించడానికి" తాము చేసిన ప్రయత్నం విఫలమైనప్పటికీ, ప్రపంచ విప్లవ వెల్లువ ఒకవైపున ఉన్నా చిట్టచివరకు యితరచోట్ల తాముపొందిన విజయాలకు ఆత్మసంతృప్తిని పొందారు. కార్మిక ఉద్యమంలోవున్న సోషల్ డెమాక్రట్లు తమకు అధికంగా సహాయపడటం మూలంగానూ, రష్యా బయట బోల్షివిక్ పార్టీలు లేకపోవడంవల్లనూ సామ్రాజ్యవాదులు ముఖ్యంగా యీ విజయాన్ని సాధించగలిగారు. సోవియట్ రిపబ్లిక్‌ను నాశనం చేయడంలో విఫలత చెందిన తరువాత సామ్రాజ్యవాదులు దానిని ప్రపంచాన్నుండి వెలివేయడానికి ప్రయత్నించారు. సోవియట్ యూనియన్‌చుట్టూ తూర్పు యూరప్‌లో అభివృద్ధి నిరోధక కీలుబొమ్మ ప్రభుత్వాలను ఒక అడ్డుకోటగా నిర్మించారు. సామ్రాజ్యవాద నానాజాతి సమితిని ఏర్పరచి, అందులో సోవియట్ యూనియన్‌కు సభ్యత్వమివ్వ నిరాకరించారు. "ఇదివరకున్న మామూలు స్థితికే వెళ్ళాలనీ" "ఉన్నవాటిని స్థిరపరచుకోవాలి" మొదలుగాగల నినాదాలతో పని చేయడం ప్రారంభించారు.

పశ్చిమ, మధ్యయూరప్‌లో తాత్కాలికంగా ఆర్థికవ్యవస్థలో స్థిరత్వం ఏర్పడటానికి అమెరికానుండి సామ్రాజ్యవాదులు ఆర్థిక సహాయాన్ని పొంది, 'ప్రజాస్వామికానికి' "శాంతి"కి ఆలవాలమైన నూతన యుగం ప్రారంభమైనదనే భ్రమను వ్యాపింపజేయడానికి సామ్రాజ్యవాదులు ప్రయత్నించారు. సోషల్ డెమోక్రసీ వారి పవిత్ర గురువు, గుత్త పెట్టుబడిదారుడైన ఫోర్డు వారి పోషకుడు; "అమెరికా మహత్తు" వారికి నమోనా. కాని పరిస్థితులలో తాత్కాలిక ఉపశమనం కలిగినా ఆ తరువాత అసమానత్వంతోనూ, అస్థిరత్వంతోనూ కూడుకొన్న పరిమిత పెట్టుబడిదారీ అభివృద్ధిపరిస్థితులు కేపిటలిస్టు చారిత్రలోకల్లా బ్రహ్మాండమైన ప్రపంచ ఆర్థికసంక్షోభాన్ని "అమెరికా మహత్వం" వున్న స్వంతదేశంలోనే రాగా, నూతన సాంఘిక, రాజకీయ కల్లోలాలు సంభవించాయి. దీనితో "నాగరిక" సామ్రాజ్యవాద గుత్త పెట్టుబడిదారుల పవిత్ర ఆయుధంగా ఫాసిస్టు రాక్షసత్వం, దారుణ నిర్బంధ విధానం ఆరంభమయ్యాయి. తిరిగి అంతర్జాతీయ వైరుధ్యాలు తీవ్రతరమవడం, మిలిటరీ దురాక్రమణలు, ఒకరితో మరొకరు పోటీలుపడి ఆయుధ నిర్మాణాన్ని అధికంచేయడం—ఇవన్నీ రెండో ప్రపంచయుద్ధానికి దారి తీశాయి. ఈవిధంగా 1920 లో కన్న కలలు కల్లలై ఉన్న భ్రమలు పటాపంచలై, పెట్టుబడిదారీవిధానంలోని సర్వవ్యాపితంగా తీవ్రతర మవుతున్న సంక్షోభం నగ్నంగా బట్టబయలు అయింది.

* * *

రెండో ప్రపంచయుద్ధానంతరం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రపంచ సామ్రాజ్యవాదమనే కోటకు తూర్పు, ఆగ్నేయ యూరప్‌లోకూడా గండికొట్టబడింది. సోవియట్ యూనియన్ నేడు ఏకాకిగాలేదు. సామ్రాజ్యవాద బానిసత్వాన్నుండి విముక్తిపొంది దోపిడీవర్గాల పాలనను అంతంచేసి, దానిస్థానంలో శ్రామికప్రజల పాలనను నిర్మించుకొన్న కొత్తరకపు రాజ్యాల దృఢమైన అండ దానికిప్పుడుంది. ఈ నూతనరాజ్యాలనే - యీ ప్రజాస్వామిక ప్రజాతంత్ర రాజ్యాలనే యిదివరకు తమ బానిసత్వంక్రింద వుంచుకొని పశ్చిమ సామ్రాజ్యవాదులు

సోవియట్ యూనియన్‌ను వ్యతిరేకంగా అభివృద్ధినిరోధక కీలుబొమ్మ రాజ్యాల గొలుసుగా నిర్మించారు. యీ కీలుబొమ్మ రాజ్యాల గొలుసే యీనాడు పడమట వైపుకు - పశ్చిమజర్మనీ, ఫ్రాన్సు, బ్రిటన్‌లకు మార్చబడింది. ఈ రాజ్యాలు అమెరికా సామ్రాజ్యవాదానికి నేడు పోలీసు బంటులుగా వ్యవహరించుతున్నాయి.

పశ్చిమరాజ్యాల సామ్రాజ్యవాదులు అంచనావేసుకొన్నట్లు ఫాసిస్టు యుద్ధాగ్నికి సోవియట్‌యూనియన్ ఆహుతి కాలేదు సరికదా బలహీన రాజ్యంగా కూడా బయటపడలేదు. యుద్ధంలో ఎంతగానో నష్టాలకూ, విధ్వంసానికి గురిఅయినప్పటికీ ప్రపంచరాజ్యాలలో ఒక బలవత్తరమైన ఆర్థిక రాజకీయ శక్తిగా సోవియట్ యూనియన్ నిలబడగలిగింది యుద్ధానంతరం నూతననిర్మాణ ప్రణాళికల ద్వారా త్వరితగతిని యుద్ధనష్టాలనుపూడ్చుకొని మరింత బలపడటమేగాక సోషలిజానికి అనుకూలంగానే పరిస్థితులను మార్చివేసింది.

ఆసియా, ఆఫ్రికా ఖండాలలో సామ్రాజ్యవాదం అధీనంలోవున్న వలస, బానిసదేశాలలో కూడా మహత్తరమైన మార్పులు వచ్చాయి. అమెరికా ఆర్థిక, ఆయుధ సహాయంగల జంగ్-కై-షేక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చైనా ప్రజాతంత్ర విప్లవం సాధించినవిజయం హిట్లర్, ముసులోని, టోజోల పతనం తరువాత సామ్రాజ్యవాదానికి ఇంతటి గొప్ప ఓటమి సంభవించలేదు. అది ప్రపంచంలోకెల్లా అత్యధిక జనసంఖ్యగల-మానవజాతిలోనే దాదాపు ఐవ వంతు జనాభాగల దేశం ప్రజావిముక్తియొక్క మహత్తర విజయం. చైనా ప్రజాతంత్ర విజయం యావత్తు ఆసియావిముక్తికి నాంది ప్రస్తావన. వలసదేశాల ప్రజల పోరాటాన్నుండి వియత్నామ్, ఇండోనేషియా రిపబ్లిక్‌లాంటి నూతనరాజ్యాలు అవతరించాయి. అవి సామ్రాజ్యవాదుల సాయుధదాడులనుండి తమ స్వాతంత్ర్యాలను రక్షించుకోవడానికి పోరాడుతున్నాయి. ఇంకొకవైపున మలయా, బర్మాలాంటి యితర దేశాలలోని స్వాతంత్ర్య పోరాటాలు పరిపూర్ణమైన విముక్తి యుద్ధాల దశకే చేరుకున్నాయి. ఇక ఇండియా,సిలోన్‌లాంటి దేశాలలో సామ్రాజ్యవాదం అనేక రాజకీయకుట్రలద్వారా కీలుబొమ్మ ప్రభుత్వాలుగల ఉపగ్రహ రాజ్యాలను ఏర్పరచి, వాటిద్వారా తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోనేస్థితికి వచ్చింది. ఈ దేశాలలో సహితం ఆ ప్రభుత్వాల సెంతటి తీవ్రమైన సంక్షోభం ఎదుర్కొంటున్నదో వాటి జాతీయ ప్రతిష్ట ఎంత దిగజారిపోయిందో ఆదేశాలలో అనుసరించబడుతున్న దారుణ నిర్బంధవిధానమే చెప్పక చెప్పుతున్నది. సామ్రాజ్యవాదులు ఆసియాను పోగొట్టుకొన్న తరువాత తమ చిట్టచివరి ఆశగా పెట్టుకొన్న ఆఫ్రికా ఖండంలో సహితం ప్రజా విప్లవ వెల్లువలు అప్పుడే ఆరంభమయ్యాయి. ఆఫ్రికాలోని వలసప్రాంతాలంతటా సామ్రాజ్యవాదులస్థానుల నన్నింటినీ మట్టుపెట్టడానికి అప్పుడే జాతీయ విముక్తి ఉద్యమాలు పరిపక్వస్థితికి వచ్చాయి.

కార్మిక వర్గంలోకూడా ఎంతగానో మార్పులు వచ్చాయి. సామ్రాజ్యవాదం యొక్క పునాది బలహీన పడటంతో, యూరప్‌దేశాలలో ఎంతో కాలంగా బలంగా వుండిన సోషల్ డెమోక్రసీ పతనమైంది. ఫ్రాంసు ఇటలీలాంటి దేశాలలో

రాజకీయానుభవం విపరీతంగా గడించిన బలవత్తరమైన ప్రజా కమ్యూనిస్టుపార్టీలు కార్మికవర్గంలో ఎదురులేని నాయకత్వాన్ని సంపాదించి, యావత్తు దేశానికీ నాయకులుగానే యీనాడు నిలబడి ఉన్నాయి. ఇక చివరకు మిగిలిపోయిన బూర్జువా కార్మికోద్యమం ఆంగ్లో-అమెరికన్ కూటమికి చెందిన అమెరికా, బ్రిటన్‌లలో మాత్రమే కేంద్రీకరించబడివుంది. అక్కడ రాజకీయాభివృద్ధి చాల తక్కువ స్థాయిలో వుండబట్టి బూర్జువా కార్మిక నాయకత్వం పలుకుబడిని యింకా దెబ్బ గొట్టవలసి ఉంది. ఈ కేంద్రాలనుండి సామ్రాజ్యవాద అగ్రనాయకత్వం అంతర్జాతీయ కార్మికోద్యమాన్ని విచ్ఛిన్నపరచే కుటిలదృష్టితో మహత్తరమైన ప్రపంచ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్‌ను దెబ్బ తీయడానికి ప్రయత్నించింది. కాని అది చాల మైనారిటీ స్థితిలో వుండబట్టి ప్రపంచ ట్రేడ్‌యూనియన్ ఫెడరేషన్ ప్రపంచంలోని సంఘటిత కార్మికులలో అత్యధిక మెజారిటీఅండతో జయప్రదంగా ముందుకు పురోగమించుతోంది.

* * *

సామ్రాజ్యవాద పునాదులు రోజురోజుకు బలహీనపడటమే యీ నూతన సంఘటనల అంతరార్థం. జర్మనీ, జపాన్ సామ్రాజ్యవాదాల పతనంమూలంగానూ, ప్రపంచంలో నాలుగోవంతుభాగం సామ్రాజ్యవాద అధీనంనుండి, ఏక పలుకుబడినుండి బయటపడటంమూలంగానూ యిప్పటికే సామ్రాజ్యవాద పునాదులు చాలవరకు సంకుచిత పరచబడ్డాయి. కాని యీ విధంగా సంకుచితం చేయబడ్డ సామ్రాజ్యవాద ప్రపంచంలోనే పరస్పర సంబంధ బాంధవ్యాలు మారిపోయినాయి.

పెట్టుబడిదారీవిధాన అభివృద్ధిలోని అసమానత్వం ఎంతవరకు దారితీసిందంటే అమెరికా సామ్రాజ్యవాదం యుద్ధకాలపు లాభాలతో తెగబలిసింది. దీనికారణంగా అమెరికాలోని కొద్దిపాటి-వేళ్ళపై లెక్క-పెట్టదగిన - గుత్తపెట్టుబడిదారుల గ్రూపు చేతిలో దేశంలోని యావత్తు ఆర్థిక, రాజకీయ అధికారం కేంద్రీకరించబడింది. ఈ అధికారం తక్కిన యావత్తు కేపిటలిస్టు ప్రపంచానికున్న అధికారంకంటే అధికం. మరొకవైపున ప్రధాన వలస సామ్రాజ్యాలన్నీ పాతయూరోపియన్ సామ్రాజ్యవాద రాజ్యాల చేతులలోనే ఉండిపోయాయి. అయితే యీ దేశాలు యుద్ధంలో నష్టాలకు గురికావడమేగాక వారి ఆర్థిక విధానం టెక్నికల్‌గా వెనకబడిపోయింది. అందువలన యుద్ధానికిపూర్వం తమ సామ్రాజ్య "సౌభాగ్యానికి" ఆధారభూతమైన ఆసియా, ఆఫ్రికాలలోని పాత వలస ఆధిపత్యాలు కూలిపోయినాయి. వీటన్నింటి కారణంగా పాత యూరప్ సామ్రాజ్యవాద రాజ్యాలు పూర్తిగా బలహీనపడిపోయి వారి ఆర్థికవిధానమంతా విచ్ఛిన్నమయింది. ఇదివరకు తమ వలస దేశాలలో లభించే రబ్బరు, తగరం, రాగి, నూనెలతో పశ్చిమ యూరప్‌దేశాలు అమెరికాఖండాన్నుండి తమకు కావలసిన డాలర్ వస్తువులు (డాలర్లతో కొనుక్కోవడానికి వీలయ్యే) కొనుక్కోవడానికి వీలయ్యేది. ఈ వలసదేశాల పునాది విచ్ఛిన్నమవడం ప్రారంభమైన దగ్గర నుండి పశ్చిమయూరప్ దేశాలవర్తక వ్యాపారాల రాబడి చెల్లుబడులకు అదే పనిగా తరుగురావడం ప్రారంభమైంది. ముఖ్యంగా డాలర్ల కరువుతో యీ దేశాలు అవస్థపడసాగాయి.

పెట్టుబడిదారీవిధానం అభివృద్ధిలో వచ్చిన విపరీతమైన అసమానత్వం, దానికి కారణంగా ప్రపంచాధిపత్యానికి అమెరికా సామ్రాజ్యవాదుల దాడి, పాత యూరోపియన్ సామ్రాజ్య దేశాలు బలహీనపడటం, సామ్రాజ్యవాదం అధీనంలోవున్న ప్రదేశం ప్రపంచంలో విపరీతంగా తగ్గిపోవడం, వలస దేశాల ప్రజల తిరుగుబాట్లు బాగా విజృంభించడం, ఈ పరిస్థితులన్నీ రెండో ప్రపంచయుద్ధం తరువాత సామ్రాజ్యవాద నూతన సంబంధాలను సరిదిద్దుకొనే ప్రయత్నాలన్నీ విఫలం చేస్తాయి.

అమెరికా సామ్రాజ్యవాదం తాను అన్నిదేశాల్లోకి స్వేచ్ఛగా వ్యాపించడానికి అడ్డుగావున్న వ్యాపార అడ్డుగోడలను అతిక్రమించడానికి ప్రయత్నించుతూంది. కాని అదేసమయంలో తన దేశానికి ఇతర దేశాలనుండి స్వేచ్ఛగా వస్తువులు ప్రవహించకుండావున్న పెద్ద అడ్డుగోడలను (టారిఫ్స్ మాత్రం) అలాగేవుంచింది. దీనివల్ల ప్రపంచ ఆర్థిక అసమానత్వం మరింత తీవ్రతరమైంది. యూరప్‌లోని పెట్టుబడిదారీ దేశాలు విపరీతమైన ఆర్థిక ఇబ్బందులకు గురిఅవుతూ దానిని తప్పించుకోవాలనే తాపత్రయంతో ప్రజలపై మరింత భారాన్ని మోపి వలస యుద్ధాలకు గడంగుతున్నాయి ఇవి దేశాల దారిద్ర్యానికి మరింత హేతువైనాయి. తమ ఆర్థిక, రాజకీయ స్థితిని నిలవొక్కుకోవాలనే ప్రయత్నాలు వారిని రోజురోజుకూ ఆర్థికంగానూ, రాజకీయంగానూ, మిలిటరీ రీత్యానూ అమెరికా సామ్రాజ్యవాదంపై ఆధారపడేటట్లు చేశాయి.

ప్రపంచాధిపత్యానికి అమెరికా సామ్రాజ్యవాదంయొక్క వ్యాప్తి అనేక దశలద్వారా - ట్రూమన్ సిద్ధాంతం, మార్షల్‌ప్లాను, అట్లాంటిక్ సంధి, మిలిటరీ అరువు కవులు ఒడంబడిక, యూరోపియన్ రాజ్యాల అధీనంలోవున్న వలస దేశాలను దోపిడీ చేయాలనే ప్రెసిడెంటు ట్రూమన్ నాలుగో అంశంద్వారా - అమలు జరుపబడుతున్నది. మార్షల్ ప్లానును ఆమోదించిన అన్ని యూరప్ దేశాల రాజధానీ నగరాలలోనూ ఆ దేశాల ఆర్థిక విధానాన్ని తమ కంట్రోలులో వుంచుకోడానికి అమెరికా తన ఏజంట్లను అట్టేపెట్టింది. తూర్పు యూరప్‌తో పశ్చిమ యూరప్ వ్యాపారం చేయడాన్ని అమెరికా నిషేధించడం మూలముగా యూరప్ ఆర్థిక పునర్నిర్మాణానికి దెబ్బతగిలింది. అమెరికా తన మిలటరీ కేంద్రాలను బ్రిటన్‌లోనూ యింకా అనేక యితర దేశాలలోనూ స్థాపించింది. ఉపగ్రహాలైన పశ్చిమ యూరప్ దేశాల ప్రభుత్వాలు అమెరికా పాలకవర్గాల అనుమతిలేకుండా కాలుకదపడానికి వీలులేని పరిస్థితి ఏర్పడింది.

కాని యీ పరిస్థితులలో ఉత్పన్నమైన నూతన సమస్యలను అమెరికా సామ్రాజ్యవాదులుగానీ, పశ్చిమ యూరప్‌సామ్రాజ్యవాదులుగాని పరిష్కరించలేక పోతున్నారు. యూరప్ పునరుద్ధరణకంటూ ఏర్పడిన మార్షల్ ప్లానుయొక్క బూటకత్వం అప్పుడే బట్టబయలు అయింది. "మార్షల్" పశ్చిమ యూరప్‌దేశాలలో రోజు రోజుకూ ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నమవుతోంది. ప్రజల జీవనప్రమాణం క్రమేణా తగ్గిపోతోంది. మరొక వేపున తూర్పు యూరప్ దేశాలలో పునర్నిర్మాణం అత్యంత జయప్రదంగా కొనసాగడం, ప్రజల జీవనప్రమాణం హెచ్చ

డం-ఇదంతా తూర్పు, పశ్చిమయూరప్‌ల మధ్యగల వ్యత్యాసం స్పష్టంగా ప్రతి వారికీ కనపడుతోంది. పశ్చిమ యూరప్‌లోని మార్షల్ "పునరుద్ధరణ" కార్యక్రమం 1952లో ముగియడంతోనే పశ్చిమ యూరప్ ఆర్థిక పతనానికి గురికావచ్చునని పడమటి యూరప్‌లో మార్షల్ ప్లానును అమలు పరచడానికి నియమించబడిన ప్రధాన కార్యదర్శి మార్జొలినే స్వయంగా ప్రకటించాడు.

పెట్టుబడిదారీ ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం వచ్చే పరిస్థితులు దగ్గరపడుతున్నకొద్దీ యుద్ధప్రయత్నాలు మరింత జోరుగానూ, బహిరంగంగానూ, సాగడం ప్రారంభమయ్యాయి. ఆర్థికమాంద్యం నుండి బయటపడాలంటే ఆయుధ పునరుత్పత్తి ఒక్కటే మార్గమని గుత్తపెట్టుబడిదారుల గులాములైన ఆర్థికవేత్తలు బాహాటంగా బాకాలూదడం మొదలిడారు. శాంతికాలంలో ఎన్నడూ ఎరుగనంతగా సైన్యం వృద్ధిచేసే కార్యక్రమం కొనసాగించబడుతుంది. దీనితో హిట్లర్ ఆయుధ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని పోల్చిచూస్తే చాలాతక్కువనిపిస్తుంది. అమెరికా మిలిటరీ వ్యయం యద్ధానికి పూర్వస్థితి కంటే 20 రెట్లు అధికం చేయబడింది. అసలే దరిద్రంతో కృంగిపోతున్న బ్రిటన్ తనమిలటరీ వ్యయాన్ని 1989 స్థితికంటె అంటే రెండో ప్రపంచయుద్ధానికి ముందు స్థితికంటే మూడురెట్లు హెచ్చించింది. కృత్రిమ యుద్ధ వాతావరణం సృష్టించే తలంపుతో యుద్ధ అనుకూల ప్రచారం విపరీతంగా రెచ్చగొట్టబడుతోంది. ఈ విధంగా సృష్టించబడిన యుద్ధ ప్రమాద వాతావరణాన్ని సాకుగా వినియోగించుకొని కార్మికవర్గాన్ని యితర ప్రజాతంత్ర ఉద్యమాలను రాజకీయంగా దెబ్బకొట్టడానికి ప్రయత్నించుతూవున్నారు. అభివృద్ధి నిరోధక రాజకీయ చర్యలను పురికొల్పుతూ ఉన్నారు.

ఈ విధంగా మొదటి ప్రపంచ యుద్ధానంతర పరిస్థితితో రెండో ప్రపంచయుద్ధ పరిస్థితిని పోల్చి చూసుకొంటే విపరీతమైన వ్యత్యాసం కండ్లకుగట్టినట్లు కనపడుతుంది.

"మామూలు పరిస్థితులను తీసుకొని రావాలి" "స్థిరత్వం ఏర్పడాలి" "శాంతియుత ప్రజాతంత్ర అభివృద్ధి జరగాలి" అనే నినాదాలకు బదులుగా సామ్రాజ్యవాద నాయకులు బాహాటంగా యుద్ధవిషవాతావరణాన్ని వ్యాపింపజేస్తున్నారు. శాంతి అనేది ప్రమాదకరంగా నిరసింపబడుతున్నది. శాంతికోసం జరిగే ప్రచారం "కమ్యూనిస్టుకుట్ర" క్రింద చిత్రించబడుతున్నది. అంతర్జాతీయశాంతి భద్రతలకు మిత్రరాజ్యసమితిని బలపరచడానికి బదులు దానిస్థానంలో యుద్ధసన్నాహాలకు కొన్నిరాజ్యాలతో అట్లాంటిక్ సంధిని చేసుకొన్నారు. ఈ విధంగా మరొకయుద్ధానికితయారవడం సామ్రాజ్యవాద దివాళాకోరుతనాన్ని స్పష్టంగా సూచించుతున్నది. దీనినిబట్టి సామ్రాజ్యవాద ప్రతినిధులు తమసమస్యలను పరిష్కరించుకొనేస్థితిలో లేరని స్పష్టంగా రుజువవుతున్నది.

యుద్ధోన్మాదంతో చిందులుత్రొక్కుతున్న సామ్రాజ్యవాదులు నేడనుసరిస్తున్న చర్యలు సామ్రాజ్యవాదం యింకా తీవ్రతరమైన సర్వవ్యాపిత సంక్షోభానికి గురికా [illegible] తోడ్పడతాయి. ఈ విపరీత [illegible] ర్మాణకార్యక్రమభారం ఆ [illegible] మరింత ఎక్కువగా [illegible] పరాన్నభుక్త

సామ్రాజ్యవాద ఆర్థికవిధానాన్ని అలాగే కొనసాగించుకోవాలంటే వలస రాజ్యాలపై పెత్తనాన్ని నిలబెట్టుకోవలసిన ఆవశ్యకత తప్పనిసరి. ఇందుకోసం యురోపియన్ సామ్రాజ్యవాద రాజ్యాలు కొనసాగించుతున్న వలసయుద్ధాలు ఆర్థిక సంక్షోభాన్ని తీవ్రతరం చేయడానికే దారితీస్తున్నాయి. తమ ఆర్థిక బడ్జెట్టులో తరుగును మరింత ఎక్కువచేస్తున్నాయి. అమెరికా ఆధిపత్యం మూలంగా సామ్రాజ్యవాదంలో అంతర్గతంగావున్న పరస్పర వైరుధ్యాలు అంతమొందడానికి బదులు మరింత తీవ్రతరమైనాయి.

సామ్రాజ్యవాదంలోని పరస్పర వైరుధ్యాలను తీవ్రపరచడానికి ఏ చర్యలు దోహదమిస్తున్నాయో సరిగా అవే అదే సమయంలోనే సామ్రాజ్యవాదుల అభివృద్ధి నిరోధక పాలసీలనూ, యుద్ధ పాలసీలనూ ప్రజలు నిరోధించడానికి దారితీశాయి. అమెరికా సామ్రాజ్యవాదానికి గులాములుగా పనిచేస్తున్న ప్రభుత్వాలూ, పార్టీలూ, ముఖ్యంగా సోషల్ డెమోక్రట్లూ తమ జాతీయ ప్రయోజనాలకూ, జాతీయ స్వాతంత్ర్యానికి ద్రోహంచేస్తున్న ఫలితంగా ప్రజలచే అసహ్యాహించుకోబడి, పలుకుబడినిపోగొట్టుకుంటున్నారు. అంతే కాదు; యీ ప్రభుత్వాలు ప్రజల అత్యవసర ఆర్థిక అవసరాలను ఏమాత్రం నెరవేర్చలేకపోతున్నాయి. దానితోపాటు అమెరికా సామ్రాజ్యవాదం బహిరంగంగానూ, నగ్నంగానూ తమ దేశ అంతరంగిక వ్యవహారాలలో జోక్యం కలిగించుకోవడంవల్ల ఆ దేశాలలోని ప్రజలు తమ జాతీయ ప్రతిష్ఠకు భంగం వాటిల్లినట్లు గుర్తించి, సామ్రాజ్యవాదుల జోక్యాన్ని ప్రతిఘటించడానికి కమ్యూనిస్టుపార్టీల వెనుక సమీకరణ అవుతున్నారు.

పెట్టుబడిదారీ విధానంలో తీవ్రతరమైన సంక్షోభానికి ప్రతిబింబమైన సాంఘిక, రాజకీయ పోరాటాలు పరాకాష్టను అందుకోవడం 1949 మే దినం స్పష్టంగా తెలియపరుస్తోంది. ఆర్థికసంక్షోభానికీ, యుద్ధానికి సామ్రాజ్యవాదులు అనుసరిస్తున్నమార్గం వారిని మరింత బలహీనపరచి, ఆ విధానంయొక్క అంతిమ పతనానికి దారితీస్తుంది. ప్రజల శిబిరం ప్రజాస్వామికానికీ, శాంతికీ కార్మికవర్గం, సోషలిజంల భవిష్యత్తు విజయానికి పురోగమిస్తోంది. నేటి ప్రపంచంలోని రెండు శిబిరాలమధ్య జరుగుతున్న సంఘర్షణలో పెట్టుబడిదారీ విధానంలో తీవ్రతరమవుతున్న నేటి సంక్షోభదశ స్పష్టంగా ప్రతిబింబిస్తోంది.

("ఫర్ ఏ లాస్టింగ్ పీస్ ఫర్ ఏ పీపుల్స్ డిమోక్రసీ" 15 మే 1949)

29

సిద్ధాంతం

స్టాలిన్

సిద్ధాంతానికి సంబంధించిన మూడు విషయాలను పరిశీలిద్దాం.

(1) కార్మిక ఉద్యమానికి సిద్ధాంత ఆవశ్యకత (2) ప్రాప్త కాలజ్ఞతా, 'సిద్ధాంతం' మీద విమర్శ (3) కార్మిక విప్లవ సిద్ధాంతం.

1. సిద్ధాంతంయొక్క ప్రాముఖ్యత : 'లెనినిజమ్' అంటే సిద్ధాంతముకు ముందు ఆచరణయే ప్రధానమని, మార్క్సిస్టు సూత్రాలను కార్యాచరణలో పెట్టుటయే ప్రధానమని కొందరభిప్రాయం. సిద్ధాంత విషయాన్ని గురించి 'లెనినిజమ్' ఎక్కువగా పాటించదని కూడా వీరి అభిప్రాయం. సిద్ధాంతాన్ని గురించి, ముఖ్యంగా తత్వ శాస్త్రాన్ని గురించి, లెనిన్ ఎక్కువగా పట్టించుకునేవాడు కాదని ప్లెఖనోవ్ లెనిన్ గురించి అప్పుడప్పుడూ విమర్శిస్తూ ఉండేవాడు. ప్రస్తుత పరిస్థితులలో కార్యరంగమునందు నిర్వహించవలసిన పనులు ఎన్నో ఉండుటవల్ల, లెనినిస్టు వర్కర్లలోగూడా చాలామందికి ఈనాడుగూడా సిద్ధాంతమంటే ఎక్కువ ఇష్టంలేదు. లెనిన్‌ను గురించి, లెనినిజమ్‌ను గురించి, ఏర్పడిన వింత అభిప్రాయాలలో అర్థమేమీ లేదు. అవి పూర్తిగా తప్పు అనిగూడా చెప్పవలసి యున్నది. కార్య రంగంలో పనిచేసేవారే సిద్ధాంతాన్ని త్రోసివేయుటకు ప్రయత్నించుటవల్ల 'లెనినిజమ్' యొక్క మూలభావానికే వ్యతిరేకమగుటయే గాక, మన ప్రధాన ఆశయానికే గొప్ప అపాయం కలు

అన్ని దేశాల్లోని కార్మిక ఉద్యమాలరొ
సిద్ధాంత మవుతున్నది. సిద్ధాంతంయొక్క సర్వస
సిద్ధాంత సహాయం లేకుండా గుడ్డిగా జరి
దృక్పథంగల ఆచరణతో సంబంధంలేని సి
అవుతుంది. విప్లవ ఆచరణతో అభేద్య

నిర్మించగలిగినప్పుడు, ఆ సిద్ధాంతం కార్మిక ఉద్యమంలో బలమైన శక్తిగా తయారవుతుంది. అటువంటి సిద్ధాంతమే ఉద్యమానికి బలమైన పునాది. సిద్ధాంత సహాయంతో, మనచుట్టూ ప్రతిక్షణమూ జరిగే ఘటనలమధ్యగల సంబంధాన్ని తెలుసుకొని, ప్రజా ఉద్యమానికి సరియైన పంథాను నిర్ణయించగలం. ప్రస్తుత పరిస్థితులలో వివిధ వర్గాల వైఖరి ఎలా ఉన్నదో, వెంటనే ముందువాటి వైఖరి ఎలా పరిణమించబోతున్నదో గూడా సిద్ధాంతం తెలియజేస్తుంది. ప్రసిద్ధికెక్కిన ఈ క్రింది మాటలను లెనిన్ కొన్ని వందలసార్లు నొక్కి చెప్పాడు.

"ఒక విప్లవ సిద్ధాంతం లేకుండా విప్లవ ఉద్యమ నిర్మాణం అసంభవం"

ప్రస్తుతం మన దేశంలోని క్లిష్టపరిస్థితులను బట్టి, అంతర్జాతీయ పరిస్థితులనుబట్టి మన పార్టీకి ప్రత్యేక బాధ్యతలు ఏర్పడి, అంతర్జాతీయ కార్మిక వర్గానికి నాయకత్వం వహించవలసిన కర్తవ్యం నిర్వహించవలసి యున్నది. అటువంటిమన పార్టీకి ప్రత్యేకంగా, సిద్ధాంతంయొక్క ప్రాముఖ్యత ఎంతగొప్పదో అందరికంటె బాగా లెనిన్ గ్రహించాడు. మన పార్టీయొక్క ప్రత్యేక పాత్రను 1920 లోనే గుర్తించి లెనిన్, అభివృద్ధికరమైన సిద్ధాంతం మార్గదర్శిగా ఉన్నప్పుడే పార్టీ తనయొక్క నాయకత్వపాత్రను నిర్వహించగలుతుంది" అని చెప్పాడు. మన పార్టీ పాత్రనుగురించి లెనిన్ చెప్పిన మాటలు నిజమైన తరువాత, యిప్పుడు సిద్ధాంతమునుగురించి లెనిన్ చెప్పిన ఈ విషయాలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఏర్పడుతున్నదని వేరుగా చెప్పనక్కరలేదు.

...ంతమునకు గొప్ప ప్రాముఖ్యత నిచ్చిన లెనిన్, ఎంగెల్సు
...తన రోజులవరకూ ఆమధ్యకాలంలో జరిగిన శాస్త్ర
...భౌతికవాద దృక్పథంనుంచి వ్యాఖ్యానించి సార్వజ
..., భౌతికవాద విరుద్ధంగా ఆలోచించే మార్క్సు
...ఖండించాడు. 'ప్రతి నూతన శాస్త్ర పరిశోధ
...గూడా నూతన పరిణామం పొందాలని'
...యొక్క కాలానికి వర్తించినంతవరకూ

ఈ కర్తవ్యాన్ని లెనిన్ జయప్రదంగా నెరవేర్చాడని అతనియొక్క 'భౌతికవాదం, పామరవిమర్శన' అను ఉత్కృష్టగ్రంథంవల్ల తెలుస్తుంది. సిద్ధాంతంతో పనిలేదని లెనిన్‌ను గురించి హేళనచేసిన ప్లెఖానోవ్, కనీసం ఈ కర్తవ్యాన్ని నెరవేర్చుటకు ప్రయత్నంగూడా చేయలేదు.

(2) ప్రాప్తకాలజ్ఞతా 'సిద్ధాంతం'మీద విమర్శ లేక ఉద్యమంలో నాయకత్వంయొక్క పాత్ర;—ప్రాప్తకాలజ్ఞతా 'సిద్ధాంతం' అవకాశవాదులయొక్క సిద్ధాంతం. కార్మిక ఉద్యమంయొక్క ఆకస్మిక స్వభావాన్ని పూజిస్తూ, కార్మికవర్గ నాయకత్వాన్ని, కార్మికవర్గపార్టీ నాయకత్వాన్ని గుర్తించని సిద్ధాంతం ఇది.

ఆకస్మిక ఘటనలను, ప్రాప్తకాలజ్ఞతను పూజించే సిద్ధాంతం, కార్మిక ఉద్యమంయొక్క విప్లవస్వభావానికి విరుద్ధమని వేరుగా చెప్ప నక్కరలేదు. పెట్టుబడివిధానమునకు వ్యతిరేకంగాచేసే పోరాటపంథాకు ఈ సిద్ధాంతం కేవలం విరుద్ధమని చెప్పాలి. 'సాధించతగిన' కోర్కెల కొరకు, పెట్టుబడిదారులు 'అంగీకరించే' కోర్కెలకొరకు మాత్రం ఉద్యమాన్ని సాగించాలని ఈ సిద్ధాంతం చెపుతుంది. కనీసపోరాటంతో, పోరాటం లేకుండానే ఉద్యమాన్ని సాగించాలనేపంథా ఇది. ఈ సిద్ధాంతప్రకారం కేవలం ఆర్థికహక్కులకొరకు కార్మిక ఉద్యమాన్ని సాగించాలి.

ఆకస్మిక ఉద్యమానికి ఒక నిర్ణీతమైన పద్ధతి, చైతన్యం కార్యక్రమం కల్పించుట ఈ ప్రాప్తకాలజ్ఞతా సిద్ధాంతానికి వ్యతిరేకం. ప్రజలకు వర్గచైతన్యాన్ని కల్గించి, ప్రజాఉద్యమానికి పార్టీ నాయకత్వం వహించి నడిపే పంథాను ఈ సిద్ధాంతం అంగీకరించదు. ఉద్యమం ముందుకు సాగిపోతున్నప్పుడు వర్గచైతన్యంగలవారు దానికి అడ్డుపడ గూడదని, ఉద్యమగతిని అనుసరిస్తూ, దాని తోకపుచ్చుకొని పార్టీ సాగిపోవాలని ప్రాప్తకాలజ్ఞుల అభిప్రాయం. ప్రజాఉద్యమంలో చైతన్యం గలవారి పాత్రను అంగీకరించక, తోకపట్టుకొనిపోయే ఖ్వోస్టిజమ్ (—ఖ్వోస్టు అంటే రష్యన్‌భాషలో తోక అని అర్థం) సిద్ధాంతం ఇది. అవకాశవాదులగు విద్రోహుల పంథాకుపునాది ప్రాప్తకాలజ్ఞతా సిద్ధాంతమని గుర్తించాలి.

మొదటి రష్యన్ విప్లవమునకు పూర్వమే (1905) ఈ సిద్ధాంతం బయలుదేరింది దాని అనుచరులైనవారు, రష్యాలో ప్రత్యేక స్వతంత్ర కార్మికవర్గపార్టీ అవసరం లేదని ఆచరణలో వ్యతిరేకించారు. జారిస్టు ప్రభుత్వాన్ని కూలద్రోయుటకు రష్యన్ కార్మికవర్గం చేసే విప్లవపోరాటాన్ని వ్యతిరేకించారు. కేవలం ఆర్థిక హక్కులకొరకే పాటుపడాలనే దృక్పథంతో కార్మిక ఉద్యమాన్ని నడపాలని కార్మిక ఉద్యమాన్ని మితవాద బూర్జువా నాయకత్వాన అధీనం చేయాలని వీరి వాదన. దీనినే ఆర్థికవాదం (ఎకనామిజమ్) అంటారు.

"ఏమి చెయ్యాలి" అనే లెనిన్ పుస్తకంలో ప్రాప్తకాలజ్ఞతా 'సిద్ధాంతాన్ని' గురించి చేయబడిన చక్కటి విమర్శన, ఇస్క్రా పత్రిక ఈసిద్ధాంతానికి వ్యతిరేకంగా చేసిన పోరాటం ఈ ఆర్థిక వాదాన్ని నిర్మూలించుటయేగాక, రష్యన్ కార్మిక విప్లవోద్యమానికి సిద్ధాంత అంకురాలను గూడా వేసింది.

ఈ పోరాటం చేయకుండా, రష్యాలో ఒక ప్రత్యేక స్వతంత్ర కార్మికపార్టీని నిర్మించే విషయాన్ని గురించిగాని, అటువంటి కార్మిక పార్టీ విప్లవంలో వహించే నాయకత్వాన్ని గురించిగాని ఎంత ఆలోచించినా ప్రయోజనమేమీ లేదు.

ప్రాప్తకాలజ్ఞతా "సిద్ధాంతం" ఒక రష్యాలోనేకాదు. రెండవ అంతర్జాతీయ సంస్థకు చెందిన అన్నిపార్టీలలో ఈ సిద్ధాంతం, అనేక రూపాలలో, విరివిగా వ్యాపించి ఉన్నది. ఉదాహరణకు రెండవ అంతర్జాతీయ సంస్థయొక్క నాయకులచే అంగీకరింపబడిన ఉత్పత్తి శక్తుల సిద్ధాంతాన్ని తీసుకుందాం. ప్రతివిషయాన్ని సమర్థిస్తూ, ప్రతి వారితో సమాధానపడుతూ, అందరికీ అసహ్యం కలిగిన తరువాత గూడా తిరిగి చెప్పినవిషయాలనే చెప్పి, వాటిమీద వ్యాఖ్యానం చేస్తూ తృప్తిపడే సిద్ధాంతం ఇది: ప్రపంచ ఘటనలయొక్క అర్థాన్ని వివరించుటయేగాక, ప్రపంచమును మార్చుటగూడా భౌతికవాద సిద్ధాంతంయొక్క కర్తవ్యమని మార్క్సు చెప్పాడు. కాని కాట్‌స్కీ మురాకు ప్రపంచ మార్పులతో పని లేదు. ప్రపంచ పరిస్థితులను వివరించుటతోనే వారు తృప్తిచెంది కూర్చుంటారు. వారి 'సిద్ధాంతాన్ని' వర్తింప

చేసిన అనేక ఉదాహరణలలో ఒకదాన్ని తీసుకుందాం. సామ్రాజ్యవాదులు యుద్ధాన్ని ప్రారంభించే పక్షంలో, ఆయుద్ధాన్ని తిరుగు యుద్ధంతో ఎదుర్కొంటామని రెండవ అంతర్జాతీయ పార్టీలు చేసిన బెదిరింపును గురించి ఇదివరకే చెప్పబడింది. ప్రత్యక్షంగా యుద్ధం ఆరంభమయేసరికి ఈ నినాదాన్ని త్రోసివేసి దానికి పూర్తిగా వ్యతిరేకమయిన 'యుద్ధం చేయండి' అనే నినాదాన్ని స్వదేశ సామ్రాజ్యవాద ప్రభుత్వానికి ఇచ్చారని కూడా తెలుసుకున్నాం. ఈనినాదం మార్పు ఫలితంగా లక్షలమంది కార్మికులు మృత్యువాత పడ్డారని కూడా మనకు తెలుసును. కాని దీనికంతకూ కారణం కొంతమంది వ్యక్తులని, వారు కార్మికవర్గానికి ద్రోహంచేశారని తలంచగూడదు! ఎంతమాత్రం కాదు! అంతా జరుగవలసినట్లుగానే జరిగింది. ఎందుకంటే రెండవ అంతర్జాతీయ సంస్థ యుద్ధాన్ని పురిగొల్పే సంస్థగాక, "శాంతి సంస్థ" గనుక! రెండవ కారణం, అప్పటి ఉత్పత్తిశక్తుల స్థాయినిబట్టి మరొకవిధంగా జరుగుటకు అవకాశంలేదు! బాధ్యతఅంతా "ఉత్పత్తి శక్తులది" నిందిస్తే ఉత్పత్తిశక్తులను నిందించాలని కాట్స్కీముఠావారు మనకు చెప్తూ వారి "ఉత్పత్తిశక్తుల సిద్ధాంతాన్ని" సమర్థించుకుంటారు. ఈ సిద్ధాంతాన్ని నమ్మనివాడు మార్క్సిస్టుకాడు: ఉద్యమంలో పార్టీయొక్క పాత్రను గురించికూడా ఇదే సమాధానం; ముఖ్యమైన 'ఉత్పత్తిశక్తుల' స్థాయిముందు, పార్టీ ఏం చేయగలదు? ఇదీ వారి వాదం!

మార్క్సిజంను ఈవిధంగా పెడత్రోవలలో, తప్పుమార్గాలలో వర్తింపచేసిన ఉదాహరణలు లెక్కలేనన్ని ఉన్నాయి.

మొదటి రష్యన్ విప్లవానికి పూర్వమే లెనిన్ 'ఖ్వోస్టిజమ్'కు వ్యతిరేకంగా పోరాటము చేశాడని చెప్పబడింది. ఆ ఖ్వోస్టిజం యొక్క మారురూపమే ఈ యూరపియన్ 'ఉత్పత్తిశక్తుల సిద్ధాంతం'. ఇటువంటి మారురూపాలు యూరపులో ఇంకా చాలా ఉన్నాయి. వీటి అన్నిటి సారాంశం ఒకటే, అవకాశవాదం.

పాశ్చాత్యదేశాల్లో నిజమైన విప్లవ పార్టీలను నిర్మించుటకు పూనుకునేటందుకు, మార్క్సిజమును పెడత్రోవలోపెట్టే ఈ తప్పు సిద్ధాంతాలను నిర్మూలించుట అవసరమని వేరుగా చెప్పనక్కరలేదు.

(3) కార్మిక విప్లవ సిద్ధాంతం;

కార్మిక విప్లవాన్ని గురించిన లెనినిస్టు సిద్ధాంతంముఖ్యంగా మూడు ప్రధాన విషయాలమీద ఆధారపడియున్నది.

1. మొదటి విషయం :- బాగా అభివృద్ధియైన పెట్టుబడి దేశాల్లో కోటీశ్వరులయొక్క ఆధిక్యత; స్టాకులు, బాండ్లద్వారా వీరు తమ పెట్టుబడి వ్యవహారాలను సాగించుట; ముడిసరకులు ఉత్పత్తి అయే స్థలాలకే పెట్టుబడిని ఎగుమతి చేయుట - ఇది సామ్రాజ్యవాదము యొక్క ఒక ముఖ్య లక్షణం; పెట్టుబడిగల కోటీశ్వరులయొక్క సర్వాధిపత్యం - ఇవన్నీ పెట్టుబడి విధానముయొక్క మొనాపలీ స్వభావాన్ని, పరాన్నభుక్కులైన పెట్టుబడిదారుల దారుణ అత్యాచారాన్ని తెలియజేస్తాయి. ఈ లక్షణములన్నీ అభివృద్ధి అయిన ఫలితంగా ప్రజాసామాన్యం మోయవలసిన భారం విపరీతంగా పెరిగి, పెట్టుబడివిధానముకు వ్యతిరేకంగా కార్మిక తిరుగుబాట్లు తీవ్రమై, కార్మిక విప్లవం తప్ప ప్రజలందరికీ వేరే మోక్షం లేదనే పరిస్థితులు ఏర్పడతాయి. (లెనిన్: సామ్రాజ్యవాదం- పెట్టుబడివిధానంయొక్క గరిష్టదశ)

అందువల్ల వచ్చే మొదటి నిర్ణయం - పెట్టుబడి దేశాల్లో విప్లవ పరిస్థితులు మరింత ఉధృతం అవుతాయి; సామ్రాజ్యవాదదేశాల్లో, కార్మికరంగంలో తిరుగుబాట్లు విజృంభిస్తాయి.

2. రెండవ విషయం :- వలసదేశాలకు, అస్వతంత్ర దేశాలకు ఎగుమతి అయే పెట్టుబడి విపరీతంగా పెరుగుట; వలసదేశాలు, అధీన ప్రాంతాలు ఎక్కువయి, ప్రపంచమంతా సామ్రాజ్యవాదుల అధీనం అగుట; వలసదేశాల్లోని అసంఖ్యాకులైన ప్రజలను ఏవో కొన్ని 'అభివృద్ధియైన' దేశాలు దోపిడిచేసే ప్రపంచపీడిత విధానంగా పెట్టుబడివిధానం మారిపోవుట- ఈలక్షణాల ఫలితంగా ఒకవైపున, వివిధ జాతీయ ఆర్థికవిధానాలు వివిధదేశాలు కలిసి ఒకే ఒక ప్రపంచ ఆర్థిక విధానం ఏర్పడుతున్నది. రెండోవైపున ప్రపంచ ప్రజలందరూ రెండు పక్షాలలోకి చీల్చివేయబడతారు:- పెద్ద పెద్ద విస్తీర్ణంగల వలసదేశాలను అస్వతంత్ర ప్రదేశాలను దోపిడిచేసే కొన్ని 'అభివృద్ధియైన' పెట్టుబడిదేశాలు, సామ్రాజ్యవాద దోపిడికి వ్యతిరేకంగా స్వాతంత్ర్య

విముక్తికై తప్పనిసరిగా పోరాడవలసియున్న వలసదేశాలు, అస్వతంత్రదేశాలు. (లెనిన్: సామ్రాజ్యవాదం.)

అందువల్ల వచ్చే రెండవనిర్ణయం:- వలసదేశాల్లో విప్లవ పరిస్థితులు తీవ్రమై, సామ్రాజ్యవాదమునకు వ్యతిరేకంగా వలసదేశ రంగాల్లో తిరుగుబాట్లు పెరిగిపోతాయి.

3. మూడవవిషయం:- వలసదేశాలను, అధీన రంగాలను గుత్తగా స్వాధీనపరుచుకొనుట; పెట్టుబడిదేశాలన్నీ ఒకేవిధంగా అభివృద్ధి కానందువల్ల ఇదివరకే వలసదేశాలను ఆక్రమించుకున్న దేశాలకు వలసదేశాలకొరకు తహతహలాడుతున్న దేశాలకుమధ్య ప్రపంచ పునర్విభజనకొరకు పోరాటాలు జరుగుట; "మామూలు పరిస్థితుల"ను తెచ్చుటకై తప్పనిసరిగా సామ్రాజ్యవాద యుద్ధాలు- ఇవన్నీ సామ్రాజ్యవాదుల మధ్యగల వైరుధ్యాలను తీవ్రపరచి, సామ్రాజ్య వాదాన్ని బలహీనపరచి; మొదటి రెండురంగాల్లోని శక్తులను (విప్లవ కార్మిక శక్తులను, వలసదేశాల్లోని స్వాతంత్ర్య శక్తులను) ఐక్యపరచుటకు తోడ్పడుతాయి. (లెనిన్ : సామ్రాజ్యవాదం)

అందువల్ల వచ్చే మూడవ నిర్ణయం:- సామ్రాజ్యవాదం ఉన్నంతకాలం యుద్ధాలు తప్పవు. యూరపులోని కార్మిక విప్లవశక్తులు వలసదేశాల్లోని స్వాతంత్ర్య ఉద్యమ శక్తులుకలసి ప్రపంచ సామ్రాజ్య వాదమునకు వ్యతిరేకముగా ప్రపంచ ఐక్యతా విప్లవ పోరాటాన్ని చేయక తప్పదు.

పై మూడునిర్ణయాలును కలిపి ఒకేదానిలో "సోషలిస్టు విప్లవం వచ్చే పరిస్థితులలో సామ్రాజ్యవాదం ఉందని" లెనిన్ చెప్పాడు.

అందువల్ల కార్మిక విప్లవవిషయాన్ని గురించి, దాని విప్లవ స్వభావం, అవకాశం, లోతు, కార్యక్రమాలను గురించి అవలంబించ వలసిన వైఖరిగూడ మారవలసి యున్నది.

ప్రతి ఒకదేశంలోని ఆర్థికపరిస్థితులనుబట్టి. కార్మికవిప్లవానికి అవసరమైన పరిస్థితులు ఏర్పడిందీ లేనిదీ పరిశీలించేవారు. ఇది పూర్వ పద్ధతి. ఇప్పుడు ఈదృక్పథం పనికిరాదు. మొత్తం అన్నిదేశాల్లో లేక అధికసంఖ్యగా ఉన్న దేశాల్లోని ఆర్థిక పరిస్థితులనుబట్టి, మొత్తం

ప్రపంచ ఆర్థిక విధానమునుబట్టి ఈనాడు కార్మిక విప్లవానికి సమయం వచ్చిందీ, లేనిదీ నిర్ణయించవలసియున్నది. ఎందుకంటే వివిధ దేశాల్లోని వ్యక్తిగత స్వయంపోషక ఆర్థిక విధానాలు నశించి, ప్రపంచ ఆర్థిక విధానములో భాగములైపోవుటయే దీనికి కారణం. 'నాగరికమైన' పెట్టుబడివిధానం సామ్రాజ్యవాదంగా పరిణామం చెందింది. సామ్రాజ్యవాదమంటే ప్రపంచంలోని అధికసంఖ్యాకులైన వెలసదేశాల ప్రజలను కొన్ని "అభివృద్ధి" అయిన దేశాలు ఆర్థికంగా దోపిడిచేయుడమే.

పూర్వం వ్యక్తిగతంగా ఒక్కొక్క దేశాన్ని తీసుకొని ఆదేశంలో కార్మిక విప్లవానికి పరిస్థితులున్నదీ లేనిదీ పరిశీలించుట జరుగుతూ ఉండేది. ఈనాడు ఈ దృక్పథం సరియైనది కాదు. ఇప్పుడు ప్రపంచ సామ్రాజ్యవాద ఆర్థిక విధానమునంతా లెక్కలోకి తీసుకొని మొత్తం ఈ ప్రపంచ విధానంలో విప్లవం వచ్చుటకు పరిస్థితులు ఉన్నదీ లేనిదీ చూడాలి. మొత్తంమీద ప్రపంచ విధానంలో విప్లవం వచ్చుటకు అవకాశమున్నప్పుడు పారిశ్రామికంగా తగినంత అభివృద్ధిలేని కొన్ని దేశాలు అక్కడక్కడా ఉన్నంతమాత్రాన, అవి ప్రపంచ విప్లవానికి అడ్డుకానేరవు.

పూర్వం ఒక దేశంలోని కార్మిక విప్లవాన్ని గురించి చెప్పినప్పుడు, ప్రత్యేకంగా, వేరుగా ఆదేశంలోని పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా జరిగే పోరాటమేనని చెప్పబడేది. ఇప్పుడు ఆ దృక్పథం సరియైనది కాదు. ఈనాడు ప్రపంచ కార్మిక విప్లవమును గురించి పరిశీలించవలసియున్నది. ఎందుకంటే, వివిధ జాతీయ పెట్టుబడిదారీవర్గాలన్నీ కలిసి ప్రపంచ సామ్రాజ్యవాద సంఘటనగా తయారయినాయి. అందువల్ల అన్నిదేశాల్లోని విప్లవోద్యమాలు ఐక్యమయి ఉమ్మడిగా ఈ ప్రపంచ సామ్రాజ్యవాద శక్తులను ఎదుర్కోవలసియున్నది.

పూర్వం ఒక్కొక్క దేశంలోని పరిస్థితుల అభివృద్ధిని బట్టి కార్మిక విప్లవం ఆ యా దేశాల్లో సాధ్యపడేదీ లేనిది నిర్ణయించబడేది. ఇప్పుడు ఆదృక్పథం తప్పు. ఇప్పుడు, ప్రపంచ సామ్రాజ్యవాదుల మధ్య గల వైరుధ్యముల పరిణామాన్ని బట్టి ప్రపంచ సామ్రాజ్య వాదులను ఐక్యంచేసే గొలుసు ఏదేశంలో బలహీనంగా ఉన్నదో చూసి ఆదేశంలో

సామ్రాజ్యవాదుల ఐక్యతను భగ్నం గావించే ఉద్దేశ్యంతో కార్మిక విప్లవం సాధ్యపడేది, లేనిదీ నిర్ణయించవలసివున్నది.

విప్లవం ఎక్కడ ప్రారంభమవుతుంది? ఎక్కడ, ఏదేశంలో పెట్టుబడివిధానాన్ని మొదట దెబ్బకొట్టవచ్చును?

ఈ ప్రశ్నకు పూర్వం ఇచ్చిన సమాధానం :- ఎక్కడ పారిశ్రామికాభివృద్ధి జరిగిందో, కార్మిక వర్గం ఎక్కడ అధిక సంఖ్యాకులుగా ఉన్నారో, ఎక్కడ విజ్ఞానం బాగా అభివృద్ధి అయిందో, ఎక్కడ ప్రజాస్వామ్యం ఎక్కువగా అమలులో వున్నదో అక్కడ మొదట విప్లవం వస్తుందని చెప్పబడేది.

ఇదికాదు సరియైన జవాబు-అని లెనినిస్టు విప్లవసిద్ధాంతము చెప్తోంది. పరిశ్రమలు ఎక్కువగా అభివృద్ధి అయిన ప్రాంతాల్లోనే విప్లవం రానవసరంలేదు. అలాగే కార్మికవర్గం, విజ్ఞానం, ప్రజాస్వామ్యాం బాగా అభివృద్ధి అయిన దేశంలోనే ఈనాడు విప్లవం మొదట రానవసరంలేదు. ఎక్కడ సామ్రాజ్యవాదుల గొలుసు బలహీనంగా ఉంటుందో, అక్కడ ఆ గొలుసును తెగగొట్టుటద్వారా కార్మిక విప్లవం బయలుదేరుతుంది. ఎందుకంటే ప్రపంచ సామ్రాజ్యవాదుల కోటకు బొక్క పెట్టుటద్వారానే ఈనాడు కార్మికవిప్లవం సాధ్యపడుతుంది. ఏ దేశంలో ఈపని జరుగుతుందో, ఆదేశం ఇతర దేశాలకంటె తక్కువగా అభివృద్ధియైన దేశం కావచ్చును. అయినప్పటికీ ఆదేశంగూడా ప్రపంచ పెట్టుబడివిధాన పంజరంలో ఒకభాగం అని మరిచిపోరాదు.

1917 లో సామ్రాజ్యవాద ముఠాను ఐక్యపరచే గొలుసు ఇతర దేశాల్లోకంటె రష్యాలో బలహీనంగాఉన్నది. ఎందుకని? రష్యాలో గొప్ప ప్రజావిప్లవం బద్దలయే పరిస్థితులు ఏర్పడి, దేశంలో భూస్వాముల క్రింద నానాబాధలు పడుతున్న అసంఖ్యాకమైన రైతాంగ సహాయంతో విప్లవ కార్మికవర్గం నాయకత్వాం వహించి ముందుకువచ్చింది. అంతేగాక రష్యా దేశస్తులందరూ ద్వేషిస్తున్న జారు సామ్రాజ్యవాదం నైతిక పతనంచెంది విప్లవాన్ని కృపంగా ఎదుర్కొనుటకు తయారైంది. ఈ కారణాలవల్ల ఫ్రాన్సు, జర్మనీ, ఇంగ్లండు, అమెరికా దేశాలకంటె

పెట్టుబడి, పరిశ్రమల విషయంలో రష్యా వెనుకబడి యున్నప్పటికీ, రష్యాలోనే సామ్రాజ్యవాదుల గొలుసు బలహీనమైంది.

తిరిగి మళ్ళీ త్వరగా సామ్రాజ్యవాదుల గొలుసు ఎక్కడ తెగిపోతుంది? అతి బలహీనంగా ఎక్కడ ఉంటే అక్కడ. ఉదాహరణకు ఇండియాలో ఆపని జరుగవచ్చును. ఎందుకని? ఆదేశంలో ఉత్సాహవంతమైన, చురుకైన, విప్లవకరమైన కార్మికవర్గం ఉన్నది. కార్మికవర్గానికి అండగా బలమైన జాతీయ స్వాతంత్ర్య ఉద్యమం ఉన్నది. అక్కడి జాతీయోద్యమం శక్తివంతమైన అండయని నిస్సందేహంగా చెప్పవచ్చును. ఇంతేకాదు. బానిసత్వమునకు, దోపిడీకి గురియైన భారతీయులందరూ ద్వేషించే పరాయి ప్రభుత్వం నైతికపతనంపొందిన పరాయి సామ్రాజ్యవాదం దేశంలోని విప్లవాన్ని వ్యతిరేకిస్తున్నది గనుక, ఇండియాలో సామ్రాజ్యవాదుల గొలుసు త్వరలోనే తెగిపోవచ్చును.

జర్మనీలోగూడా సామ్రాజ్యవాదుల గొలుసు తెగి దెబ్బతగుల వచ్చును. ఎందుకని? ఇండియాలో ఉన్న పరిస్థితులన్నీ ఈనాడు జర్మనీలోగూడా ఉండుటయే కారణం. కాని ఇండియాకు, జర్మనీకి పరిశ్రమాభివృద్ధివిషయంలో గల గొప్ప వత్యాసానికి ఫలితంగా జర్మనీలోని విప్లవ పరిణామ ఫలితాలు వేరుగా ఉండవచ్చును.

అందువల్లనే లెనిన్ ఈక్రిందివిధంగా చెప్పాడు:—

పాశ్చాత్య యూరప్ ఖండంలోని పెట్టుబడిదారీదేశాలు సోషలిస్టు స్థాపనకై తయారవుతున్నాయి. అన్నిచోట్ల ఒకేవిధంగా సోషలిజాన్ని స్థాపించుటకు పరిస్థితులు అనుకూలంగా ఉండుటకాదు కారణం. కొన్ని దేశాలను ఇతర దేశాలు దోపిడీచేయుటవల్ల, సామ్రాజ్యవాద యుద్ధంలో ఓడిపోయిన దేశాలను, తూర్పు ప్రాంతంలోని దేశాలను దోపిడిచేయుటవల్ల ఇది సాధ్యపడుతుంది. అయితే, మొదటి సామ్రాజ్యవాద యుద్ధఫలితంగా, తూర్పు దేశాలుగూడా చివరికి విప్లవోద్యమ రంగంలోకి లాగబడి ప్రపంచ విప్లవోద్యమంలో ఒకభాగంగా పరిణమించినాయి.''

అందువల్ల, తేలినవిషయం ఏమిటంటే, ఎక్కడ సామ్రాజ్యవాద సంఘటనయొక్క గొలుసు బలహీనంగా ఉంటే అక్కడ విప్లవం బయలుదేరుతుంది; అంతేగాని పెట్టుబడివిధానపు అభివృద్ధినిబట్టిగాని, లేక కార్మికవర్గ సంఖ్యను, రైతాంగముయొక్క బలాన్నిబట్టికాదు.

ప్లేగువ్యాధివలె విప్లవాన్ని గురించి భయపడే రెండవ అంతర్జాతీయ సంస్థకు చెందినవారు, ఒక్కొక్క దేశంలో, కార్మికవర్గ సంఖ్యను గురించి లెక్కలకు ప్రత్యేక ప్రాముఖ్యతను ఇస్తారు. నిజంగా ఆలోచిస్తే ఈ లెక్కలకు, అంచనాలకు ప్రాముఖ్యత లేదు.

రెండవ అంతర్జాతీయ సంస్థకు చెందిన 'వీరులు' బూర్జువా విప్లవానికి, కార్మిక విప్లవానికి మధ్య ఒక పెద్ద అగడ్త (చైనాగోడవంటిది) ఉన్నదని, రెండు విప్లవాలకు మధ్య చాలాకాలం జరుగవలెనని ఇప్పడుగూడా వాదిస్తున్నారు. బూర్జువా విప్లవ ఫలితంగా బూర్జువా వర్గం అధికారంలోకి వచ్చి, పెట్టుబడి విధానాన్ని అభివృద్ధిచేసినప్పుడు, కార్మికవర్గం క్రమేణా బలపడి పెట్టుబడివిధానాన్ని కూలద్రోయుటకు తయారుకాగలదని వీరివాదన. ఈరెండు విప్లవాలకుమధ్య కొన్ని పదుల సంవత్సరాలు గడవాలంటారు. ఒక్కొక్కప్పుడు ఇంకా ఎక్కువ కాలం పట్టవచ్చునని కూడా వీరు అంచనా వేస్తారు. సామ్రాజ్యవాద పరిస్థితులలో ఈ చైనాగోడ సిద్ధాంతానికి అర్థంలేదని వేరుగా చెప్పనవసరంలేదు. ఈ విధంగా మధ్య విరామం ఉండాలని చెప్పేవారందరూ బూర్జువావర్గముయొక్క విద్రోహక ఆశయాలను కప్పిపుచ్చే వుద్దేశ్యం కలవారే. సంఘర్షణలతోనూ, యుద్ధాలతో నిండుకొనియున్న సామ్రాజ్యవాద యుగంలో, సోషలిస్టు విప్లవంవచ్చే సమయంలో, పెట్టుబడి విధానం క్షీణించి శిథిలమయ్యే రోజుల్లో, ప్రపంచంలో అన్ని దేశాల్లో విప్లవాలు చెలరేగిపోతున్న పరిస్థితులలో, జారు ప్రభుత్వం దాస్యపు యజమానులు మొదలుకొని అన్నిరకాలైన విద్రోహశక్తులతో సామ్రాజ్యవాదులు చేతులు కలపటంవల్ల, ప్రపంచ విప్లవ శక్తులన్నీ-పాశ్చాత్య దేశాలలోని కార్మిక వుద్యమం మొదలుకొని తూర్పుదేశాల్లోని స్వాతంత్ర్య ఉద్యమాలన్నీ-ఐక్యమగుట తప్పనిసరియైన పరిస్థితులలో దాస్య భూస్వామ్యశక్తులను కూలద్రోయుటకై సామ్రాజ్య

వాదంతో సహా పోరాడవలసివస్తున్న పరిస్థితులలో–బూర్జువావిప్లవానికి, కార్మిక విప్లవానికి మధ్య ఆలస్యమేమి అవసరంలేదని, ఒకదానినుంచి రెండోదానికి వెంటనే సాగిపోవచ్చునని ప్రత్యేకంగా రుజువు చేయ నక్కరలేదు. రష్యాలో జరిగిన విప్లవచరిత్ర ఈవిషయాన్ని స్పష్టపరచి, సరియైనదని నిరూపించింది. బూర్జువావిప్లవం, కార్మిక విప్లవం–రెండూ ఒకే గొలుసులోని రెండు కొక్కెములని, రెండుకలసి ఒకేఒక రష్యన్ విప్లవం కాగలదని 1905 లోనే లెనిన్ తన "రెండు ఎత్తుగడలు" అను పుస్తకంలో వ్రాశాడు,—

"రైతాంగ సహాయంతో కార్మికవర్గం నిరంకుశ ప్రభుత్వాన్ని ఊగులాడుతున్న బూర్జువావర్గాన్ని బల ప్రయోగంతో నాశనం గావించి ప్రజాస్వామిక విప్లవాన్ని పూర్తిచేయాలి. ప్రజా సామాన్యం లోని అర్థకార్మికులైనవారి సహాయంతో, బూర్జువా వర్గానికి మధ్య ఊగులాడే రైతాంగం ఛోటా బూర్జువావర్గాల వ్యతిరేకతను బలప్రయోగంతో స్వస్తిచెప్పి కార్మికవర్గం సోషలిస్టు విప్లవాన్ని పూర్తిచెయ్యాలి. విప్లవ ఉద్దేశ్యాలను గురించి స్పష్టంగా, సూటిగా తమ వాదన లలోనూ, తీర్మానాలలో ఇస్క్రాయిస్టులు (మార్క్సిస్టులు) చెప్పిన కార్మికవర్గ కర్తవ్యాలు ఇవి."

"రెండు ఎత్తుగడలు" అనే గ్రంథం తరువాత లెనిన్ వ్రాసిన ఇతర గ్రంథాల్లో బూర్జువా విప్లవం ముందుకు సాగిపోయి కార్మిక విప్లవంలోకి మారుతుంది – అను భావం ఇంకా స్పష్టంగా నిరూపించ బడింది – లెనినిస్టు సిద్ధాంతంలో ఇది ఒక మూలసూత్రం.

1913 లోనే లెనిన్ ఈ నిర్ణయానికి వచ్చాడనీ, అంతవరకూ రష్యన్ విప్లవం బూర్జువావర్గ అధీనంలో ఉంటుందనీ, కార్మికనియంతృత్వం సంపాదించిన అధికారం బూర్జువావర్గపరం అవుతుందనీ లెనిన్ అభిప్రాయపడినట్లు కొందరి ఉద్దేశ్యం. కమ్యూనిస్టు ప్రచురణలలో కూడ ఈ ఉద్దేశ్యం వెల్లడిచేయబడినట్లు కొందరు వాదిస్తారు ఇది కేవలం అబద్ధప్రచారమని నేను చెప్పవలసియున్నది. యదార్థపరిస్థితులతో ఛేదించే ఈ అభిప్రాయం తప్పని రుజువు చేయనవసరంలేదు.

1905 లో జరిగిన మూడవపార్టీ కాంగ్రెసులో లెనిన్ ఇచ్చిన ప్రఖ్యాతమైన ఉపన్యాసంలో కార్మిక కర్షక నియంతృత్వాన్నిగురించి చెప్పిన విషయాన్ని జ్ఞాపకం చేస్తున్నాను. కార్మిక-కర్షకనియంతృత్వము (ప్రజాస్వామ్యవిప్లవ విజయం) యొక్క ఉద్దేశ్యం. "శాంతిభద్రతల"ను నెలకొల్పుటకాదని, ఇంకా ముందుకుపోయి పోరాటాన్నిసాగించుటయే అని లెనిన్ చెప్పాడు.

"తాత్కాలిక ప్రభుత్వం" అను శీర్షికక్రింద లెనిన్ 1905 లో వ్రాసిన వ్యాసాలను పరిశీలించినయెడల ఈ విషయం ఇంకా స్పష్టంగా బోధపడుతుంది. రాబోయే రష్యన్ విప్లవంయొక్క అవకాశాలను గురించి తెలియబరుస్తూ పార్టీ కర్తవ్యాన్ని నిర్ణయించాడు. రష్యన్ విప్లవంయొక్క ఉద్దేశ్యం ప్రభుత్వంనుండి ఏవో కొన్ని హక్కులను మాత్రం సంపాదించుటకై కొన్ని నెలల ఉద్యమాన్ని సాగించుట కాదని, కొన్ని సంవత్సరాలు పోరాటంచేసి నిరంకుశ ప్రభుత్వాన్ని యూరపు దేశాల్లోని విప్లవాలతో జోడించి ఈక్రిందివిధంగా చెప్పాడు.

"రష్యన్ విప్లవాన్ని జయప్రదంగా సాధించగలిగినయెడల, యూరపు అంతా విప్లవజ్వాలలు వ్యాపిస్తాయి. అప్పుడు ఇన్నాళ్ళ నుంచి బూర్జువావర్గంక్రింద కుమిలిపోతున్న యూరపియన్ కార్మికులు 'విప్లవాన్ని ఎలా నడపాలో' మనకు చూపిస్తారు. యూరపులో బయలుదేరే విప్లవజ్వాల తిరిగి రష్యాకి ప్రాకి కొన్ని విప్లవ సంవత్సరాల దశను ఒక మహా విప్లవయుగంగా మార్చివేస్తుంది."

1915 నవంబరులో లెనిన్ వ్రాసిన ఒక ప్రఖ్యాతమైనవ్యాసాన్ని గూడా ఉదహరిస్తాను. అందులో లెనిన్ ఈవిధంగా చెప్పాడు:

"అధికారాన్ని లాక్కొని, ప్రజాస్వామ్య ప్రభుత్వాము స్థాపించి, భూమినంతా స్వాధీనపరచుకొనుటకై కార్మికవర్గం ధైర్యసాహసాలతో పోరాడుతుంది. మిలిటరీ భూస్వామ్య సామ్రాజ్యవాదమునుంచి (జారిస్టు ప్రభుత్వంనుంచి) బూర్జువా రష్యాను విముక్తిచేయుటకై, కార్మికేతర ప్రజాసామాన్యాన్ని గూడా కలుపుకొని కార్మికవర్గం పోరాడుతుంది. భూస్వాముల నుంచి, జారు ప్రభుత్వంనుంచి విముక్తిచేసిన వెంటనే వ్యవసాయకూలీలకు ఎదురుతిరిగే ధనిక రైతులకు సహాయం చేయకుండా

యూరపియన్ దేశాల కార్మికుల సహాయంతో వెంటనే సోషలిస్టు విప్లవాన్ని జయప్రదం చేయుటకై రష్యన్ కార్మిక వర్గం పాటుపడు తుంది.

"రెండు ఎత్తుగడలు" అనే పుస్తకంనుంచి పైన ఉదహరించిన మాటలను చెప్తూ లెనిన్ తన "కార్మిక విప్లవం కాట్‌స్కీ ద్రోహి" అనే పుస్తకంలో రష్యన్ విప్లవ ఆశయాన్ని గురించి ఈక్రింది నిర్ణ యానికి వచ్చాడు :-

"మనం అనుకున్నట్లుగానే జరుగుతున్నాయి విషయాలన్నీ. రష్యన్ విప్లవరీతి అంతా మన వాదన సరియైనదని నిరూపిస్తోంది. మొదట మొత్తం రైతాంగముయొక్క సహాయంతో ప్రభుత్వానికి, భూస్వాములకు, మధ్యయుగాలనాటి పరిపాలనకు వ్యతిరేకంగా విప్లవం జరుగుతుంది. అంతవరకు అది బూర్జువా విప్లవం లేక బూర్జువా ప్రజా స్వామిక విప్లవం. కానీ తరువాత, పేదరైతులయొక్క అర్ధకార్మికుల యొక్క సహాయంతో, పీడిత ప్రజలందరి సహాయంతో ధనిక రైతు లకు- దోపిడీచేసేవారికి - పెట్టుబడి విధానానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం విప్లవం సాగించి జయప్రదంచేస్తుంది. ఇదే సోషలిస్టు విప్లవం. ఈరెండు విప్లవాలకు మధ్య ఒక పెద్ద అగడ్తను నిర్మించి వేరుచేయుట మార్క్సిస్టు సిద్ధాంతాలను పెడత్రోవలో పెట్టుటయేగాని వేరుకాదు. అయితే కార్మికవర్గం యొక్క సన్నాహ పరిమితినిబట్టి, రైతాంగ ముతో సాధించిన ఐక్యతా పరిమితినిబట్టి, రెండు విప్లవాలమధ్య కొద్ది విరామం ఉండవచ్చుగాని రెండు విప్లవాలను పూర్తిగా వేరుచేసి చెప్పుట మార్క్సిస్టు సిద్ధాంతానికి వ్యతిరేకం.

ఇంతటితో చాలనుకుంటాను.

అంతా బాగానే ఉందిగాని శాశ్వత (ఎడతెగని) విప్లవ దృక్ప థాన్ని లెనిన్ ఎందుకు నిరాకరించాడని అడుగవచ్చును.

రైతాంగముయొక్క విప్లవ శక్తినంతా వినియోగించి జారిస్టు విధానాన్ని కూలద్రోసి కార్మిక విప్లవానికి దారితీయాలని లెనిన్ అభి ప్రాయం. రైతాంగ విప్లవశక్తిని గుర్తించక రైతాంగ విప్లవశక్తిని లెక్కలోనికి తీసుకోకుండా రైతాంగమును నడిపించగలకార్మిక శక్తిని

నిర్లక్ష్యం చేయుటవల్ల బూర్జువా ప్రభావంనుంచి రైతాంగమును తప్పించి కార్మికవర్గంతో సమీకరించుటకు 'శాశ్వత విప్లవ' వాదులు పూనుకొనరు.

విప్లవం పూర్తిగా విజయవంతమయిన తరువాత కార్మికవర్గం పరిపాలనాధికారం స్వీకరించాలని లెనిన్ అభిప్రాయం. కార్మికవర్గం అధికారంతో ప్రారంభించాలని 'శాశ్వత విప్లవాదుల' అభిప్రాయం. దాస్యవిధానంక్రింద ఇంకా క్రుమ్మగిపోతున్నవారు రష్యాలో ఉన్నారని, విప్లవశక్తిగల గొప్ప రైతాంగము ఉన్నదనే విషయాన్ని గుర్తించక వారు ఇలా వాదిస్తారు. ఈ పాలసీ ఫలితంగా రైతాంగమును కార్మికవర్గం వైపుకు మరల్చుట త్వరగా జరుగదని వారు గుర్తించలేదు.

ఈ కారణాలవల్ల 'శాశ్వత' విప్లవవాదులతో లెనిన్ తీవ్రంగా పోరాటం చేయవలసివచ్చింది. విప్లవం ఎడతెగకుండా సాగిపోవాలనే విషయాన్ని గురించికాదు లెనిన్ వారితో పోరాడింది. శాశ్వతంగా విప్లవం ముందుకు సాగిపోవాలని లెనిన్ అనేకసార్లు చెప్పాడు. కాని కార్మిక వర్గానికి పెద్ద అండ అయినటువంటి రైతాంగముయొక్క విప్లవ పాత్రను గుర్తించకుండా కార్మిక కర్షక సమ్మేళనరీయొక్క ప్రాముఖ్యతను గుర్తించకుండా 'శాశ్వత' విప్లవవాదులు గ్రుడ్డిగా చేసే వాదనలను లెనిన్ నిరాకరించాడు.

'శాశ్వత' విప్లవభావం క్రొత్తగా బయలుదేరినదికాదు. 1850 లోనే తన "కమ్యూనిస్టు సంఘాని కిచ్చిన ఉపన్యాసం" లో మార్క్సు శాశ్వత విప్లవభావాన్ని వెల్లడించాడు. ఈ పుస్తకం నుంచి 'శాశ్వత' విప్లవవాదులు ఈ భావాన్ని తీసుకున్నారు. కాని తీసుకునేటప్పుడు కొంతవరకూ మార్పుచేసి, ఆచరణలో ఉపయోగపడని అర్థరహితమైన భావంగా తయారుచేసి చెడగొట్టారు. ఈ విధంగా అర్థరహితం చేయబడిన భావానికి తిరిగి సరియైన అర్థాన్ని ఇచ్చి పునరుద్ధరించుటకు అనుభవశాలియైన లెనిన్ అవసరమయ్యాడు.

కమ్యూనిస్టు సంఘానికి ఇచ్చిన ఉపన్యాసంలో కమ్యూనిస్టులు సంపాదించవలసిన విప్లవ ప్రజాస్వామ్య కోర్కెలనన్నీ చెప్పిన తరువాత, ఎడతెగని విప్లవం కావాలని మార్క్సు చెప్పిన మాటలు ఇవి:-

"పై కోర్కెలను సంపాదించిన వెంటనే విప్లవాన్ని వీలైనంత త్వరలో సమాప్తి చేయవలెనని ఛోటా బూర్జువావర్గం కోరుతుంది. కాని మనకర్తవ్యం అదికాదు; విప్లవాన్ని చిరస్థాయిగా సాగించి ఆస్తిపరుల నందరిని అధికృతనుంచి తొలగించి కార్మికవర్గ రాజ్యస్థాపన చేయాలి. ఏదో ఒక దేశంలోనే కాదు. ప్రధాన దేశాలన్నిటిలో గూడా కార్మికవర్గం పరిపాలనాధికారం సంపాదించి, వివిధదేశాల కార్మికుల మధ్యగల పోటీలన్నీ నిర్మూలింపబడేవరకూ, ఉత్పత్తిసాధనాలన్నీ కార్మికులపరం అయ్యేవరకూ విప్లవాన్ని ఎడతెగకుండా సాగించాలి."

అనగా,

(1) 1850 నాటి జర్మనీలో కార్మికవర్గ రాజ్యస్థాపనతో - విప్లవాన్ని ప్రారంభించాలని మార్క్సు చెప్పలేదు. మార్క్సు చెప్పినదంతా ఈ 'శాశ్వత' విప్లవవాదుల పంథాకు వ్యతిరేకంగా ఉన్నది.

(2) బూర్జువావర్గంలో ఒకభాగం తరువాత ఇంకొక భాగాన్ని క్రమంగా మెట్టు తరువాత మెట్టుగా అధికార గాడీలనుంచి తొలగించి కార్మికవర్గం రాజ్యాధికారాన్ని సంపాదించి కార్మికవర్గ రాజ్యస్థాపన చెయ్యాలని మార్క్సు సూచించాడు. రాజ్యాధికారం సంపాదించిన తరువాత, ప్రతిదేశంలో వచ్చే విప్లవానికి చిచ్చుపెట్టాలనిగూడా మార్క్సు చెప్పిన మాటలు లెనినిస్టు పంథాకు అనుగుణ్యంగానే ఉన్నాయి. సామ్రాజ్యవాద పరిస్థితులలో కార్మిక విప్లవ సిద్ధాంతం ప్రకారం లెనిన్ అనుసరించిన పంథాకు మార్క్సు సూచించిన పంథాకు భేదంలేదు.

కనుక, తేలిన విషయం ఏమిటంటే, మన 'శాశ్వత' విప్లవవాదులు రష్యన్ విప్లవములో రైతాంగము వహించవలసిన పాత్రను గురించి, కార్మిక-కర్షక సమ్మేళనమును గురించి తక్కువగా అంచనా వేయడమేగాక, మార్క్సుయొక్క శాశ్వత విప్లవ దృక్పథాన్ని పూర్తిగా మార్చివేసి ఆచరణయోగ్యం కాకుండా చేశారు.

అందువల్లనే లెనిన్ ఈ 'శాశ్వత' విప్లవవాదులను ఎక్కువగా పరిహసించి, ఈ సిద్ధాంతంతో 10 సంవత్సరాలకాలం వృధాగా తమ

జీవితాలను గడుపుటకు కారణం ఏమిటో గూడా ఆలోచించుటకు నిరాకరించే 'శాశ్వత' విప్లవవాదులను తీవ్రంగా ఖండించాడు ('శాశ్వత' విప్లవవాదం బయలుదేరిన 10 సంవత్సరాలకు, అనగా 1915 లో లెనిన్ తన వ్యాసాన్ని వ్రాశాడు).

అందువల్లనే లెనిన్ ఈ సిద్ధాంతాన్ని ఒకరకం మెన్షివిక్ సిద్ధాంతమని పిలిచాడు. విప్లవపోరాటంద్వారా కార్మికవర్గం రాజకీయ అధికారాన్ని హస్తగతం చేసుకోవాలనే సిద్ధాంతాన్ని బోల్షివిక్కుల నుంచి, రైతాంగంయొక్క విప్లవపాత్రను నిరాకరించే సిద్ధాంతాన్ని మెన్షివిక్కులనుంచి ఈ 'శాశ్వత' వాదులు తీసుకున్నారని లెనిన్ చెప్పాడు.

బూర్జువావిప్లవం కార్మికవిప్లవంగా పరిణమించే విషయాన్ని గురించి, బూర్జువా విప్లవాన్ని ఉపయోగించి వెంటనే కార్మిక విప్లవానికి దారితీసే పద్ధతిని గురించి లెనిన్ అభిప్రాయాలు ఇవి.

ఇప్పుడు మరొక విషయం.

బూర్జువావర్గాన్ని కూలద్రోయుటకు అన్ని దేశాల్లోని కార్మికులుగాని లేక బాగా అభివృద్ధిఅయిన దేశాల్లోని కార్మికులుగాని కలిసి పోరాటంచేయుట అవసరమనే ఉద్దేశంతో, ఒకే ఒక దేశంలో ముందు విప్లవం జయప్రదమగుట అసంభవమనే ఉద్దేశ్యం పూర్వం ఉండేది. ప్రత్యక్షప్రమాణంవల్ల ఈ దృక్పథం సరియైనదికాదని ఇప్పుడు స్పష్టపడింది. ప్రస్తుత సామ్రాజవాద పరిస్థితులలో అన్ని పెట్టుబడిదేశాలు ఒకేవిధంగా అభివృద్ధికాలేవు. మరియు వివిధ సామ్రాజవాదుల మధ్య పరస్పర వైరుధ్యములు పెరిగి సామ్రాజ్యవాద యుద్ధాలు బయలుదేరుతున్నాయి. అన్నిదేశాల్లో ప్రపంచమంతటా విప్లవోద్యమాలు లేగిపోతున్నాయి. ఈ పరిస్థితులలో, వ్యక్తిగత దేశాలలో కార్మిక విప్లవాలు జయప్రదమగుటకు అవకాశముండు[illegible]మేగాక, జయించుట తప్పనిసరి అవుతుంది. రష్యన్ విప్లవచరిత్ర[illegible]ాన్ని చక్కగా రుజువుచేస్తున్నది. అయినప్పటికీ, బూర[illegible]ద్రోయుటకు కొన్ని కనీస అవసర పరిస్థితులు ఏర్ప[illegible] కోవాలి. ఆ పరిస్థితులు లేనప్పుడు, [illegible] హరించే ప్రశ్నయేరాదు.

రాజ్యాధికార స్వీకరణకు ఉండవలసిన పరిస్థితులను గురించి లెనిన్ తన "అతివాద కమ్యూనిజం : చిన్నబిడ్డజబ్బు" అనే గ్రంథంలో ఈవిధంగా చెప్పాడు :-

"అన్ని విప్లవాలచే ముఖ్యంగా 20 శతాబ్దంలో జరిగిన మూడు రష్యన్ విప్లవాలచే నిరూపించబడిన ఒక ప్రధానసూత్రం ఇది:— పూర్వ పాత సమాజపద్ధతులలో జీవించుట అసంభవమని ప్రజాసామాన్యం గ్రహించుటయే కాదు విప్లవమునకు కావలసింది. పాతపద్ధతులలో ముందుకూడా దోపిడిచేస్తూ పరిపాలన సాగించుట పీడించి దోపిడీచేసే వర్గాలకు అసంభవమగుట గూడా విప్లవానికి అవసరం. "క్రింది వర్గాలు" పూర్వ పద్ధతులను నిరాకరించినప్పుడు, "పైవర్గాలు" పాతపద్ధతులలో పరిపాలన సాగించలేనప్పుడే విప్లవం జయప్రదం కాగలదు. ఈసత్యాన్ని మరొక విధంగా చెప్పవచ్చును. దేశవ్యాపితమైన సంక్షోభం (పీడించేవారికి పీడించబడేవారికి సంబంధించిన సంక్షోభం) లేకుండా, విప్లవం సాధ్యపడదు. అందువల్ల (1) కార్మికులలో అధిక సంఖ్యాకులు (కనీసం రాజకీయ చైతన్యం వర్గచైతన్యంగల కార్మికులలో అధికభాగం) విప్లవ అవసరాన్ని గ్రహించి విప్లవముకొరకై తమ జీవితములను ధారపోయుటకు సిద్ధపడినప్పుడు (2) పాలకవర్గాలు పెద్దప్రభుత్వ సంక్షోభంలో చిక్కుకొనిపోయి ఎంతో వెనుకబడియున్న ప్రజలుగూడా రాజకీయాల్లోకి లాగబడినప్పుడు విప్లవకారులు ప్రభుత్వయంత్రాన్ని బలహీనపరచి వేగముగా దాన్ని నాశనం చేయుగలరు."

అయితే ఏదో ఒక దేశంలో బూర్జువావర్గాన్ని కూలద్రోసి, కార్మికవర్గ అధికారాన్ని నెలకొల్పినంత మాత్రాన సంపూర్ణ సోషలిస్టు విజయం చేకూరదు. తన అధికారాన్ని స్థిరపరచుకొని, రైతాంగమునంతా తనతో సమీకరించుకొని విజయంపొందిన కార్మికవర్గం ఆదేశములో సోషలిస్టు [illegible] ్మాణానికి పూనుకోవాలి. అప్పుడుగూడా ఆదేశంలోని [illegible] నికి సుస్థిరత్వం ఏర్పడదు. ఇతరదేశాల [illegible] ్రభుత్వాలు జోక్యం కలిగించుకొని [illegible] సుస్థిరత్వం ఏర్పడాలంటే కనీసం [illegible] ాలి. అందువల్ల ఇతర దేశాల్లోని

విప్లవాలను విజయవంతంచేసే బాధ్యత జయప్రదమైన విప్లవం మీద ఉన్నది. అందువల్ల విజయం పొందిన దేశములోని విప్లవం తన విజయంతో తృప్తిచెందక, ఇతరదేశాల్లోని విప్లవాలుగూడా సత్వరంగా విజయవంత మగుటకు తోడ్పడాలి.

ఈభావాన్నే లెనిన్ క్లుప్తంగా ఒక వాక్యంలో చెప్పాడు. అన్ని దేశాలలో విప్లవాన్ని అభివృద్ధిచేయుటకు, బలపరచి విజయవంతం చేయుటకై జయప్రదమైన దేశంలోని విప్లవంయొక్క కర్తవ్యం ఆదేశంలో సాధ్యమైనంత యెక్కువగా కృషిచేయుటయే అని లెనిన్ చెప్పాడు:

కార్మికవిప్లవాన్ని గురించి లెనిన్ సిద్ధాంతంలోని ప్రధాన లక్షణాలు ఇవి.

"చైనా విముక్తికోసం మనం జరిపే పోరాటంలో అనేక రంగాలున్నాయి. వాటిలో వైజ్ఞానికరంగం (కల్చరల్ ఫ్రంట్) మిలటరీ రంగం చాలా ప్రధానమైనవి. ముఖ్యంగా శత్రువును ఓడించడం అనేది తుపాకిచేపట్టిన సైనికులమీద ఆధారపడి ఉంటుంది. కాని సంపూర్ణ విజయానికి సైన్యం ఒకటే చాలదు. తుపాకులతో పోరాడే సైన్యానికి తోడుగా ఒక ప్రత్యేక వైజ్ఞానిక సైన్యం (కల్చరల్ సైన్యం) కూడా కావాలి. మనలో ఐక్యతను సమకూర్చడానికీ, శత్రువును ఓడించడానికీ ఈ కల్చరల్ దళాలు తప్పనిసరి అవుతాయి.

మా - సి - టుంగ్

("కళలూ - సారస్వతం ఎవరికోసం" పేజీ 3)

అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు

23 వ సమావేశం

ఎనిమిదిలక్షల సభ్యత్వ బలంగల అఖిల భారతట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు 28వ చరిత్రాత్మక మహాసభ ముగిసింది. రెండు రోజులపాటు మే 28, 29 - 400 ప్రతినిధులు. (అందులోఅధికభాగంకార్మికులే) ఎడతెగని చర్చల అనంతరం మహాసభ యిచ్చిన "సంఘటితపడండి! అఖిల భారత పోరాటానికి సమాయత్తమవండి!!" అనే ఉజ్వలసందేశంతో బొంబాయినగరంవిడచి తమతమ రాష్ట్రాలకు తరలి వెళ్ళారు.

తన 30 సంవత్సరాల జీవితంలో అఖిల భారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు ఎన్నడూ యింతటిదారుణ శత్రు నిర్బంధ విధానం మధ్య సమావేశమై వుండలేదు. ఒకపరిశ్రమలోనేకాదు అన్ని పరిశ్రమల లోనూ యింతటి బ్రహ్మాండమైన పోరాటాలు జరుగుతూన్న సమయంలో అది ఇదివరకెన్నడూ సమావేశమై వుండలేదు. ఒక్క నగరంలోనేకాదు- అన్ని నగరాలలో - కోయంబత్తూరు, నాగపూర్, కలకత్తా, కాన్పూర్, బొంబాయివగైరా; ఒక్క పరిశ్రమే కాదు - అన్నిపరిశ్రమల లోనూ - బట్టల పరిశ్రమ, బొగ్గుగనులు, రైల్వేలు, పట్టణరవాణ మునిసిపాలిటీలు రోజురోజుకుముంచుకొస్తున్న ఆర్థికమాంద్యానికివ్యతిరేకంగా పెద్దపెద్దసమ్మెపోరాటాలు ఎరుగని నగరంకాని, పరిశ్రమకాని నిజానికి లేనేలేదు. ఇకముందు తాముఎదుర్కొనబోయే బ్రహ్మాండమైన సంక్షోభానికి ఇది భారతకార్మికుల జవాబు.

మహాసభకు ముందు అంతులేని నిర్బంధ విధానం ప్రయోగించబడింది. సరిగ్గా మహాసభ ప్రారంభానికి ముందు అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు కార్యాలయం కార్యకర్తలు అరెస్టు చేయబడ్డారు. (కామ్రేడ్ మేనక్ గాంధీ) మరికొంతమంది అజ్ఞాతవాసానికి వెళ్లవలసివచ్చింది. (కామ్రేడ్స్ బక్షి, పార్వతీకృష్ణన్) నిర్బంధ విధానం అసలు మహాసభనే వెంటాడింది. మొట్టమొదటలో ప్రతినిధులసమావేశానికి కూడా పోలీసులు అనుమతి నివ్వ నిరాకరించారు. ఆఖరుకు దేశంలోనూ, యితర దేశాలలోనూ వచ్చిన విపరీతమైన నిరసన ఫలితంగా ప్రతినిధుల సమావేశం జరగడానికి అనుమతి నిచ్చారు.

ఒకవైపున సమావేశం జరుగుతూవుండగానే కలకత్తాట్రాంవే ప్రఖ్యాత కార్మిక నాయకుడు కామ్రేడ్ కాళీబెనర్జీని కలకత్తా నుండి|జారీ చేయబడిన ఆర్డరు ననుసరించి బొంబాయి పోలీసులు అరెస్టు చేశారు. ఒకరోజల్లా, సమావేశ భవనం బ్లావట్స్కీలాడ్జి చుట్టూ సాయుధపోలీసులు ముట్టడివేశారు.

కాని సమావేశ ప్రతినిధులూ - దాని వెనకనున్న కార్మికవర్గమూ యీ దాడులన్నింటికీ సరియైన జవాబునిచ్చారు. బొంబాయిప్రభుత్వం ప్రతినిధుల సమావేశం జరుపుకోడానికి అనుమతి యిచ్చేటట్లు చేయగలిగారు. కామ్రేడ్ బెనర్జీ అరెస్టును ప్రతినిధులు తీవ్రంగా ప్రతిఘటించారు. కాని చిట్టచివరకు పోలీసులు అదేపనిగా తీవ్రమైన లాఠీచార్జి చేసి తమ కార్యాన్ని సాధించుకోగలిగారు.

ఈ దారుణ నిర్బంధ విధానానికి బొంబాయిలోని 15000 మునిసిపల్ కార్మికులనుండి అన్నింటికంటె సరియైనజవాబు వచ్చింది. ఎంతటి క్రూర నిర్బంధవిధానం తాండవమాడుతున్నా 400మందిని అరెస్టు చేసి జైళ్ళలో కుక్కినా, తమ కనీస వేతనాలకోసం, సమ్మెపోరాటాలను వారు సాగింతుతూనే ఉన్నారు. మునిసిపల్ కార్మికుల యీ వీరోచిత సమ్మె మహాసభకు ముందు, మహాసభ జరుగుతున్నప్పుడూ, ఆతరువాతకూడ కొనసాగించింది.

అంతేకాదు; ప్రభుత్వ తీవ్ర నిర్బంధ విధానానికి యిది మా జవాబు అన్నట్లు బొంబాయి ఫైర్‌స్టోన్ రబ్బర్ అండ్ టైర్ కంపెనీలోని 1200 మంది కార్మికులు భారత కార్మికవర్గం గర్వించదగిన, వీరోచిత పోరాటాన్ని సాగించుతున్నారు. అనేకమందికార్మికులు ఖూనీచేయబడ్డారు, అరెస్టుచేయబడ్డారు, బహిష్కార ఆజ్ఞలచే నాయకులు అక్కడనుండి బయటకు వెళ్ళగొట్టబడ్డారు. ఇంతజరిగినా కార్మికులు నాలుగుమాసాలుగా జనవరి 21 వ తేదీ నుండి విదేశ పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా మొక్కవోని ధైర్యంతో పోరాడుతున్నారు. భారత కార్మికులుచేసిన గొప్ప పోరాటాలలో ఇదొకటి. నాలుగుమాసాలుగా అతిబాధతో అంతులేని అవస్థలు పడినా కార్మికులు తలొగ్గలేదు.

గత రెండు సంవత్సరాలలో గడచిన అత్యున్నత సుసాంప్రదాయాలకు తగినట్లుగాసమావేశస్థలమైనబొంబాయిపోరాట వాతావరణానికి తగినట్లుగా మహాసభ భారత కార్మికవర్గ చరిత్రలోనే గణనీయమైన మహత్తర పిలుపునిచ్చింది. మహాసభలో ఆమోదించబడిన తీర్మానాలూ, దాని రిపోర్టులూ, అక్కడ జరిగిన ప్రసంగాలూ-అన్నీ రణభేరిని మ్రోగించాయి. కార్మికులారా! దేశవ్యాపిత పోరాటమొక్కటే మీ డిమాండ్లను సాధించగలదు. పోరాడేందుకు ఐక్యమవండి!!

మహాసభ, అదిచేసిన ప్రతిఒక్క తీర్మానమూ-కనీసకోర్కెల తీర్మానం, నిర్బంధ విధానంపై తీర్మానం, నాయకులందరి విడుదలకూ, ట్రేడ్‌యూనియన్ హక్కుల కొరకూ, రైల్వే, బట్టలమిల్లుల మహాసభల కొరకూ, కామన్‌వెల్తు, అట్లాంటిక్ ఒడంబడికలకు వ్యతిరేకంగా, మూడో ప్రపంచ యుద్ధ కుట్రదారులకు వ్యతిరేకంగా, నూతన ప్రజాతంత్ర రాజ్యంకోసం, సోషలిజంకోసం, మొదలుగాగల వాటికోసం చేసిన తీర్మానాలన్నీ కాంగ్రెసు కేపిటలిస్టు ప్రభుత్వానికి ఒక ప్రత్యక్షసవాలు. ఈ డిమాండ్లలో దేనినైనా ఒక్కఅఖిల భారత పోరాటంమాత్రమే సాధించగలదు.

ఆ రకమైన అఖిలభారత పోరాటం జరిపి, కోర్కెలను సాధించడంకోసం అఖిల భారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు ఆధ్వర్యాన కార్మికుల బ్రహ్మాండమైన సంయుక్త సంఘటన నిర్మించవలసిందిగా మహాసభ మహత్తరమైన పిలుపునిచ్చింది.

యావత్తు భారత కార్మికవర్గానికి ధైర్యంగా నాయకత్వం వహించి నడపగల శక్తి సామర్థ్యం అనేక పోరాటాలలో కాకలు తీరిన యీ కేంద్రసంస్థ ఒక్కదానికే ఉంది.

కనివినీ ఎరుగనంతటి దారుణ నిర్బంధ విధానంతో అణచివేయబడిన మార్చి 9 వ తేదీ రైల్వేసమ్మె తరువాత జరిగిన యీ మహాసభ భారతకార్మికవర్గం సర్వనాశనం చేయబడిందని వూహించిన శత్రువుకు ఒక పిడుగులాంటి జవాబు. గత రెండు సంవత్సరాలుగా జరిగిన పోరాట అనుభవాలద్వారా రాటు తేలిన కార్మికవర్గం యీ సమావేశంద్వారా ముందున్న మహత్తర పోరాటానికి పిలుపునిచ్చింది. పెట్టుబడిదారీ విధాన సంక్షోభాన్నుండి బయటపడటానికి పోరాట మొక్కటే ఏకైకబాట అని ఉద్ఘాటించింది. ఇందులోనే యీ మహాసభయొక్క చరిత్రాత్మక ప్రాముఖ్యత యిమిడిఉంది.

ఇది ట్రేడ్‌యూనియన్ సైన్యాధికారుల బిజినెస్ సమావేశం. ఈ సమావేశానికి 400 మంది కమాండర్లు సరాసరి యుద్ధరంగాలనుండి హాజరయ్యారు. ఇలా ఎందుకు కావలసి వచ్చిందంటే యానాడు యావత్తు దేశమూ ఒక యుద్ధరంగమై పోయింది. ఇందులో అత్యధిక సంఖ్యాకులు కార్మికులూ, మధ్యతరగతి ఉద్యోగులే.

ఇందులో పాతప్రముఖులెవరూ లేరు. వారంతా జైళ్లలోనో లేక పోలీసులచే వెంటాడబడుతూ అజ్ఞాతవాసంలోనో ఉన్నారు. అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు అధ్యక్షుడు కామ్రేడ్ శ్రీపాదఅమృతడాంగే, ఉపాధ్యక్షులైన కామ్రేడ్స్ యస్. యస్. యూసఫ్. యస్. యస్. మిరాజ్‌కర్‌లూ యింకా యితరులూ జైళ్లలో ఉన్నారు. వర్కింగ్ కమిటీలోని ప్రముఖసభ్యులైన కామ్రేడ్సు బి. టి. రణదివే, డి. యస్. వైద్యా, యమ్. కళ్యాణసుందరం, జ్యోతిబాసు, ఆర్. కె. ఘోగ్లే మొదలగువారూ సమావేశంలో లేరు. ఇక భరద్వాజ్, డి. బి. కులకర్ణిలాంటి కామ్రేడ్సు కాంగ్రెసు జైళ్లలో మరణించి అమరజీవులయ్యారు.

కాని యీ సమావేశంలో నూతన ట్రేడ్‌యూనియన్‌యొక్క నూతన నాయకులున్నారు. వారు యిదివరకెన్నడూ లేనంత క్రూర నిర్బంధ విధానంలో సహితం కార్మికసంఘాలకూ, సమ్మెలకూ నాయకత్వం వహించి నడుపుతున్నారు. వారిలో కలకత్తా ట్రాంవే కార్మిక మహానాయకులూ, బలవత్తరమైన దక్షిణ భారత రైల్వే లేబర్‌యూనియన్ నాయకులూ ఉన్నారు. ఇంకా రేషనలైజేషన్ ప్రతిఘాతోద్యమ ప్రారంభకులు కోయంబత్తూరుబట్టలమిల్లు కార్మికనాయకులూ; జీవనప్రమాణస్కేళ్లలెక్కలను తప్పుడుగా తగ్గించినందుకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన కాన్పూర్, షోలాపూర్‌బట్టల కార్మికులూ ఉన్నారు. అంతే కాక యీ సమావేశానికి బొంబాయి గిర్నీకామ్‌గార్ యూనియన్ ప్రతినిధులూ, మహారాష్ట్రకార్మికఉద్యమానికి మణిపూసల్లాంటి అమల్నర్, జాల్గాన్, ధూలియాలాంటి కాందేష్ బట్టలమిల్లుల కార్మికులూవున్నారు. వీరంతా తమ జాతీయసంస్థ సమావేశానికి హాజరవడానికిగానూ తాత్కాలికంగా తమ పోరాట బాధ్యతలను యింకొకరికి అప్పజెప్పిరావడం సంభవించింది.

ప్రతినిధులను వయస్సురీత్యా లెక్కతీస్తే వారిలో అత్యధిక సంఖ్యాకులు 30 యేండ్లలోపలివారే. వారంతా చిన్న

వారే అయినా రెండుసంవత్సరాల మంచి అనుభవం వారిని బాగా దిట్టపరచి యోధులుగా తయారుచేసింది. వారు పోరాటాలలో దెబ్బలకూ, హింసలకూ గురై వచ్చారు. అయితే లాఠీచార్జీల టియర్ గ్యాస్‌లస్థానంలో రోజురోజుకు పోలీసు గుండుదెబ్బలకు స్థానం యిస్తున్న వీరోచిత పోరాటాలలో వారు బాగా రాటుతేలి యింకా దృఢ నిశ్చయులయ్యారు. పోలీసు కాల్పులతో, అసంఖ్యాకుల అరెస్టులతో, యూనియన్లను బలవంతంగా మూసివేయడంతో, గూండాల భీభత్సంతో దారుణ నిర్బంధవిధానం విచ్చలవిడిగా సాగుతున్న పశ్చిమ బెంగాల్, తమిళనాడులనుండీ బలమైన ప్రతినిధివర్గాలు మహాసభకు వచ్చాయి. నిజంగా ఈ అత్యద్భుత ధైర్యసాహసాలు ప్రదర్శించిన ఈ ప్రతినిధి వర్గాలే ప్రభుత్వ నిర్బంధ విధానానికి సరియైన జవాబు!

ప్రతి పరిశ్రమా, ప్రతి రాష్ట్రమూ, ప్రతి పారిశ్రామిక పట్టణమూ, ఈ మహాసభ సలహాలందుకొనేందుకు తమ తమ ప్రతినిధులను పంపించాయి. అసలు ఏడు వందల ప్రతినిధులు రావలసివుంది. కాని పోలీసుల భీభత్సం విపరీతంగా వుండబట్టి వందలాది ప్రతినిధులు తమ పట్టణాలను విడిచిపెట్టి రాలేకపోయారు. సమావేశానికి అనుమతిని సాధించగలిగామనే విషయం కూడా అనేకమంది ప్రతినిధులకు సకాలంలో తెలియలేదు.

భారత కార్మికవర్గంతో తమ ఐక్య సంఘటిత భావాన్ని తెలుపుతూ మహత్తరమైన ప్రపంచ ట్రేడ్‌యూనియన్ ఫెడరేషన్, సోవియట్ యూనియన్ ౧ాకవర్గం, ఇటలీ, పోలండ్, ఫ్రాన్సు, జెకొస్లొవేకియా యింకా యింకా యితర దేశాల ట్రేడ్‌యూనియన్ సంస్థలు పంపిన సందేశాలు మహాసభలో చదువుతూ వుంటే బ్రహ్మాండమైన హర్షధ్వానులకూ, నినాదాలకు అంతులేకపోయింది. ప్రపంచ ట్రేడ్‌యూనియన్ ఫెడరేషన్ నాయకత్వాన దినదినాభివృద్ధి పొందుతున్న అంతర్జాతీయ కార్మిక ఐక్య సంఘటనకు ఇదొక ప్రబల నిదర్శనం. ఆంగ్లో-అమెరికన్ సామ్రాజ్యవాదుల ఏజెంట్లు ఇచ్చిన కుట్రలకూ, ప్రపంచాధిపత్యానికై నూతన యుద్ధానికి కుట్రలు పన్నుతున్న యుద్ధోన్మాదులకు ఇదొక సవాలు.

ఆహ్వాన సంఘాధ్యక్షుడైన కామ్రేడ్ యమ్. యస్. బక్షీ ఉపన్యాసాన్ని చదివిన తరువాత (బక్షీపై పోలీసులు అరెస్టు వారంటు పుట్టించారు.) ప్రతినిధులు పోరాటాలలో వీరోచిత మరణంపొందిన అమరవీరులకు నిలబడి తమ జోహారులర్పించారు. ఆ తరువాత మద్రాసు ప్రఖ్యాత ట్రేడ్‌యూనియన్ నాయకుడు కామ్రేడ్ వి. చక్రయ్య చెట్టియార్ తన అధ్యక్షోపన్యాస మిచ్చాడు. ప్రభుత్వం యొక్క కార్మికవర్గ వ్యతిరేక పాలసీ, నిర్బంధ విధానాన్ని, విచ్ఛిన్న పోకడలనూ తీవ్రంగా ఖండించుతూ, కార్మికవర్గమంతా అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ వెనుక సమీకరణ కావాలని ఆయనపిలుపు నిచ్చాడు. సుఖజీవనానికీ, ప్రపంచ శాంతికీ, ప్రజాస్వామికం. సోషలిజంలకు పోరాడే సంస్థ అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు ఒక్కటే ఏకైకపోరాట సంస్థఅని ఆయన తన ప్రసంగంలో ఎలుగెత్తి చాటాడు.

II

ఆతరువాత మహాసభ అంతటిలోకీ ప్రభుత్వాన్ని ప్రభుత్వపాలసీనీ అతి తీవ్రంగా ఖండించిన ప్రధాన కార్యదర్శి రిపోర్టు ప్రతినిధులకు అందచేయబడింది. అందులో రెండు మహాసభలకు మధ్య కాలంలో కార్మికరంగంలో జరిగిన సంఘటనలు, రోజురోజుకు తీవ్రతర మవుతున్న ఆర్థికసంక్షోభం, కేపిటలిస్టు కాంగ్రెసు ప్రభుత్వం మద్దత్తుతో యజమానులు కార్మికులపై సాగిస్తున్న దాడులు దేశమంతటా ఉవ్వెత్తుగా విజృంభించిన (యింకా విజృంభించుతూనేఉన్న) మహత్తర సమ్మెతరంగాలు, రోజురోజుకూ ఎక్కువగుతున్న కార్మికుల ఎదురుదాడులు అన్నీ విపులంగా వివరించబడ్డాయి.

రిపోర్టులో ఇలా ఉదహరించబడిఉంది.

"పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభం యింకా తీవ్రతరమవుతున్న పరిస్థితులలో, అన్ని పరిశ్రమలలోని కార్మికుల స్థితిగతులు మరింతఅధ్వాన్నమవుతున్న పరిస్థితులలో మన సమావేశం జరుగుతున్నది. జీవన వ్యయం నిత్యావసర వస్తువు లన్నింటిధరలూ త్వరితగతిని అదేపనిగా పెరిగిపోతున్నాయి. కార్మికుల వేతనాలు అలాగే నిలబడివుండటమో లేక ప్రత్యక్షంగా తగ్గిపోవడమో జరుగుతోంది. కార్మికుల నిజవేతనాలు త్వరితగతిని తగ్గిపోతున్న ఫలితంగా వారు విపరీతమైన కష్టాలకూ అతి నికృష్టమైన దుర్భర దారిద్ర్యానికీ గురికావలసి వస్తోంది."

మనదేశ చరిత్రలో యింతవరకు ఎరుగని యీ బ్రహ్మాండమైన సమ్మెల ప్రవాహాల్లే యీ కష్టనష్టాలకు కార్మికులజవాబు.

రిపోర్టునుండి అవసరమైన ముఖ్యాంశాలను ఉదహరించుదాం:

దేశమంతటా కార్మికవర్గ జీవనవ్యయాన్ని తెలిపే పాయింట్లసంఖ్య పూర్తిగా పెరిగిపోయింది. జీవన వ్యయాన్ని సంఘటిత కార్మికవర్గం ఎంతో తగ్గించి వుంచడానికి ప్రయత్నించిన బొంబాయిలోనే 1939 లో 100 పాయింట్లు వుంటే 1948 ఆఖరుకు అది 310 పాయింట్లకు పెరిగింది. కాన్పూర్‌లో 508, నాగపూర్‌లో 413, మద్రాసులో 329 కి పెరిగింది. ఒక్క 1949 లోనే కంట్రోళ్ళు తీసివేసి ప్రజల ప్రాణాలతో చెలగాటాలాడిన ప్రభుత్వ విధాన ఫలితంగా 50 పాయింట్లనుండి 108 పాయింట్ల వరకూ పెరిగింది.

డబ్బురూపంలో వేతనాలు పెరిగినా విపరీతంగా పెరిగిపోయిన వస్తువులధరలకు అవి యేమాత్రం సరిపోవు. ఇంకా రిపోర్టుప్రకారం 1939 వేతనాలతో పోల్చిచూస్తే బెంగాల్‌లో మొత్తం సగటు వేతనాలు (కరువుభత్యంతో కలుపుకొని) నూటికి 21. 8 వంతులు తగ్గిపోయాయి. బొంబాయిలో నిజమైన వేతనాలు నూటికి 2.6 వంతులమాత్రం పెరిగింది. 1947 లో బీహార్‌లో నూటికి 39.7 యు. పి. రాష్ట్రంలో నూటికి 23 చొప్పున వేతనాలు తగ్గిపోయాయి. మద్రాసు ఒక్కచోటే నిజవేతనాలలో కొంత పెరుగుదల చూపెట్టింది. కాని "ఇండియన్ లేబర్ గజెట్" స్వయంగా వొప్పుకొన్నట్లు 1939 లోని మద్రాసు వేతనాలు "చాలతక్కువ"గా వున్నాయి. అందువలన వాటితో పోల్చిచూస్తే యిప్పుడున్న వేతనాలు గమనించదగినట్లుగా పెరుగుదలఅయినట్లు కనపడుతున్నది. నూటికి 26.8 వంతులు పెరుగు

దలవున్నా మద్రాసు వేతనాలు కార్యదర్శి రిపోర్టులో ఉదహరించినట్లుగా దేశం అంతటిలోనూ హీనస్థితిలో వున్నాయి.

"1939 లోని వేతనాలతో పోల్చి చూస్తే కార్మికులు ఎంతనష్టపడ్డారో పైన వివరించాం. అయితే మరొక విషయాన్ని కూడా స్పష్టంచేయదల చాం. అదేమంటే అసలు 1939 వేతనాలే కనీసజీవితానికి సహితం చాలీ చాలకుండా వుండేవి. అదికూడా యిప్పుడు తగ్గిపోయి, మరీ దుర్భరమైంది. 1948-49 వేతనాల లెక్కలుచూస్తే యింకాఅవి తగ్గిపోయి నట్లు కనపడుతుంది. ఎందువల్లనంటే 1948-49 లో ఏ పరిశ్రమలో పరిశీలించినా జీతాల స్కేళ్ళలో పెద్దగా మార్పుచేసినట్లు కనపడదు. మరొక వైపున పైనచూపెట్టినట్లు ధరలు మాత్రం విపరీతంగాపెరిగిపోయాయి."

ఇండియా ప్రభుత్వపు లేబర్ ఇయర్ బుక్కు (1946) ప్రకారం —

"1939 నుండి 1946 వరకూ వున్న కాలాన్ని మొత్తంగా తీసుకొని అన్ని పరిశ్రమలలోని సగటు ఆదాయాన్ని లెక్కతీస్తే నూటికి 115 చొప్పున పెరిగినట్లు కనపడుతుంది. మరొకవేపున వివిధ రాష్ట్రాలలోని జీవనవ్యయం నూటికి 150 నుండి 250 వరకూ పెరిగింది. దీనినిబట్టి ధరల పెరుగుదలతో పోల్చుకుంటే జీతాల పెరుగుదల చాల వెనకబడినట్లు స్పష్టపడుతున్నది."

ఆ తరువాత రిపోర్టులో జనపనార, పత్తి, బట్టలు, రైల్వేలు, గనులూ, లోహాలూ, మొదలుగాగల పెద్దపెద్ద పరిశ్రమలలోనూ, తేయాకుతోటల్లో, మునిసిపల్ కార్మికుల (వీరు కార్మికులుగాని, ఉద్యోగులుగాని మొత్తం 85 లక్షలమంది ఉన్నారు) జీతాల సమస్యల విడివిడిగా చర్చించబడింది. పైన ఉదహరించిన ప్రతి పరిశ్రమలోనూ పరిశీలించిచూస్తే వేతనాలు 1939 చాలీచాలని కరువు వేతనాలకంటే కూడా తగ్గిపోయినట్లు స్పష్టమైంది.

ఉదాహరణకు బాగా సంఘటితపడిన బట్టలమిల్లు పరిశ్రమలలోని కార్మికుని పరిస్థితిని చూద్దాం. ఈ పరిశ్రమలలో యజమానులు అత్యధిక లాభాలను సంపాదించారు. కాని 1947లో భారతీయ టెక్స్టైయిల్ కార్మికుని మొత్తం సగటు ఆదాయాన్ని 1939 లోని వేతనాలతో పోల్చి చూస్తే నూటికి 184 వరకూ పెరిగింది. అదే కాలంలో జీవనవ్యయం నూటికి 150 నుండి 250 వరకూ పెరిగింది. బొంబాయిలో సహితం డబ్బు రూపేణావున్న కార్మికుల వేతనాలు ధరల పెరుగుదలతోపాటు పెరగలేదు.

బాగా సంఘటితవర్గమైన రైల్వేకార్మికుల స్థితిని చూసినా పైయదార్థమే బోధపడుతుంది. ఇతరులకంటే "ఉన్నత వేతనాలను" రైల్వేకార్మికులు పొందుతున్నారని ప్రభుత్వం పదే పదే అడుతున్న అబద్ధాన్ని యీ రిపోర్టు బట్టబయలు చేసింది. 1948 మార్చి 31 వ తేదీకి - పేకమీషన్ సిఫార్సులు అయిన తరువాత కూడా - రైల్వేకార్మికుని సగటు సంవత్సరాదాయం 769.1 రూపాయలు మాత్రమే. ఇది 1939 సంవత్సరపు ఆదాయంతో పోల్చి చూస్తే నూటికి 42.2 పెరుగుదల అన్నమాట. ఇక బొంబాయిలోని బట్టల మిల్లులలోని కార్మికుని ఆదాయం 1041 రూపాయలు (రాష్ట్రంలోని యితరప్రదేశాలలో 911.3 రూ) గని కార్మికుని ఆదాయం 890.2 రూ. టంకసాల కార్మికుని ఆదా

యం 1071.2 రూపాయలు. దానిని బట్టి రైల్వే కార్మికుని స్థితి అందరికంటే మేలనే ప్రభుత్వం చెప్పే కల్లి బొల్లి కబుర్లలలోని బండారం బయట పడుతున్నది.

సంఘాలలో బాగా సంఘటితపడిన కార్మికుల స్థితిగతే యిలావుంటే ఇక ఇతరులసంగతి మనం బాగానే ఊహించుకోవచ్చు.

అన్నింటికంటే ముఖ్యంగా కార్యదర్శి రిపోర్టు ప్రభుత్వం ప్రకటించిన లెక్కలనే ఆధారం చేసుకొని భారతదేశంలోని ఏడు కోట్ల వ్యవసాయకూలీల దుర్భరపరిస్థితులను బట్టబయలు చేసింది. భారతీయులలో ప్రతి నలుగురిలోనూ ఒకరు "బానిస నికృష్ట పరిస్థితులలో బ్రతుకుతున్నాడు. కొన్ని ప్రదేశాలలో వారి రోజుకూలీ రూపాయి ఆరణాలుమాత్రమే. భూస్వాముల క్రింద బానిసలుగాక మరొకవిధంగా జీవించే అవకాశమే వారికి లేదు. అంతులేని దరిద్రం అమానుష మైనపీడన, భయంకరమైన కరువుపరిస్థితులూ—యివీ నేడు వారిస్థితి."

ఇక కరువుభత్యం విషయమో, "అది నిర్ణయించే విషయంలో ఒక శాస్త్రీయ దృక్పథం అంటూ లేనేలేదు. కరువుభత్యం జీవన వ్యయాన్నిబట్టి నిర్ణయించ నేలేదు. లేక ప్రమాణాన్ని సహితం స్థిరీకరించలేదు. కరువుభత్యంరేటు పరిశ్రమకూ పరిశ్రమకూ రాష్ట్రానికి రాష్ట్రానికి మారిపోయింది. ఇంకా విచిత్రమేమంటే ఒక రాష్ట్రంలో ఒక పట్టణంలోనే వేరువేరు రేట్లప్రకారం కరువుభత్యం నిర్ణయించడం కద్దు. వారు అనుసరించిన సూత్రమల్లా ఒక్కటే. అదేమంటే ఎంత తక్కువ కరువుభత్యం చెల్లించడానికి వీలుంటుందా అనీ, కార్మికునికి ఎంత తక్కువ చెల్లించి పెట్టుబడిదారుడు అధికలాభం గుంజడానికి వీలుందా అని మాత్రమే."

ఉన్నంతలో ఎక్కువరేటు కరువుభత్యం తెచ్చుకొంటున్నా డనుకుంటున్న బొంబాయి బట్టలమిల్లు కార్మికునికి సహితం యివ్వవలసినంత యివ్వక మోసంచేస్తున్నారు. ఈ విషయాన్ని కార్యదర్శి రిపోర్టు చక్కగా రుజువు చేసింది. 8 సంవత్సరాలుగా అదేపనిగా ధరలు పెరుగుతూవచ్చినా కోలార్ బంగారు గనులలో చెల్లించే కరువుభత్యం 8 రూపాయలు మాత్రమే. జనపనార కార్మికునికి ధరల పెరుగుదలనుబట్టి నిజంగా అతనికి చెల్లించవలసినంత చెల్లించాలంటే 1947 కు 57-8-0 రూ. ముట్టజెప్పవలసి ఉంటుంది. కాని 1948 అక్టోబరునాటికి సహితం అతనికి రూ 32-8-0 మాత్రమే చెల్లించబడుతున్నది.

రోజు రోజుకు తీవ్రతరమవుతున్న సంక్షోభాన్ని గురించి ఇంకా రుజువు కావాలంటే కార్యదర్శి నివేదిక కార్మిక వర్గానికి అవసరమైన వస్తువులధరల అఖిల భారత పట్టికను ఉదాహరణగా ఉదహరించింది. 1948 లోనే ధాన్యాదులధరలు 178 పాయింట్లూ, బట్టలధరలు 76 పాయింట్లూ పెరిగాయి. 1939 ఆగస్టులో 100 అనుకుంటే 1948 డిసెంబరుకు 384 వరకూ పెరిగింది.

దరిద్రం ఎంత మిక్కుటంగా పెరిగిపోయిందంటే 1939-40 కు 1947-48 మధ్య మనిషి ఒకటికి సగటు అహారఖర్చు 388 పౌనులనుండి 357 పౌనులకు తగ్గిపోయింది. అ విధంగానే మనిషి ఒకటింటికి బట్టఖర్చు అదేకాలంలో 16 గజాల నుండి 11 గజాలకు తగ్గిపోయింది.

దీనివలన నివేదిక తేల్చిన నిర్ణయాలు యీ క్రింది విధంగా ఉన్నాయి.

(1) 1939 సంవత్సరస్థితికి మొత్తం సగటు డబ్బురూపేణా వున్న వేతనాలను పోల్చి చూస్తే నూటికి 160 లోపుగా హెచ్చాయి. కాని జీవనవ్యయం నూటికి 150 నుండి 250 వరకూ పెరిగింది. ఇక ధాన్యాదులూ, యితర ఆహారపదార్థాలూ బట్టల ధరలు ఇంకా పెరిగిపోయాయి. అవి నూటికి 300 నుండి 400 వరకూ పెరిగాయి. దీని ఫలితంగా నిజమైన వేతనాలు 1939 లో చాలీచాలనీ వేతనాలస్థితికంటే కూడా బాగా తగ్గిపోయినట్లు స్పష్టమవుతున్నది.

మూడు లక్షలకు పైగావున్న గని కార్మికుల వేతనాలూ, మూడు లక్షలకు పైగా వున్న జనపనార కార్మికుల వేతనాలూ, లక్షకుపైగా ఉన్న మునిసిపల్ కార్మికుల వేతనాలు మరీ అధ్వాన్నంగా వున్నాయి. 11 లక్షలకు పైగా వున్న తేయాకుతోటల కార్మికుల వేతనాలు యింకా మరింత అధ్వాన్నంగా ఉన్నాయి. ఇక 7 కోట్ల వ్యవసాయకూలీల స్థితి ఎంత అధోగతిలో వున్నదంటే 1947 లో రోజుకు 1-6-0 నుండి రెండు అణాల వరకూ వారి కూలీరేటు పడిపోయింది. ఇక దీనినేమని వర్ణించాలో తెలియడం లేదు.

2. కరువుభత్యం రేట్లలో ఒక పద్ధతి లేదు. పచ్చి దోపిడీ క్రిందనే లెక్క వేయవచ్చు. ధరల పెరుగుదలలో మహావుంటే కరువుభత్యం నూటికి 50 వంతులు వుండటము కనాకష్టం.

3. చౌకబియ్యపు దుకాణాలను అమితంగా తగ్గించివేయడంవలన ప్రభుత్వం పరోక్షంగా 8½ లక్షల రైల్వే కార్మికుల కరువుభత్యాన్ని చాలవరకు కోతకోసింది. దీని ఫలితంగానే రైల్వే కార్మికుల నిజ వేతనాలు పూర్తిగా తగ్గిపోయినాయి.

ఈ రకమైన జీతాల కోతలతోపాటు ఉద్యోగాలమీదకూడా దాడి ప్రారంభమైంది. కార్యదర్శి నివేదిక ప్రభుత్వ ఎంప్లాయిమెంటు జీక్సుచేంజి లెక్కలనే ఉదహరించుతూ పారిశ్రామికంగాఅంతగా అభివృద్ధికాని ఇండియాలాంటి దేశంలో కూడా నిరుద్యోగుల సంఖ్య ఏ విధంగా వృద్ధిపొందుతున్నదో రుజువు చేసింది. యుద్ధం దగ్గరనుండి 1948 ఆఖరులోగా నిరుద్యోగులసంఖ్య 15 లక్షలకు అందుకొన్నది. అయితే యీ సంఖ్య అసలు వాస్తవిక పరిస్థితిలో ఒకభాగంమాత్రమే. ఎంప్లాయిమెంటు ఎక్సుచేంజి ఆఫీసులలో తమ పేర్లను నమోదుచేయించుకోని నిరుద్యోగులు కొన్ని వేలమంది ఉన్నారు. నిరుద్యోగులసంఖ్య రోజురోజుకు యింకా హెచ్చుతూనేవున్నదని నివేదిక తెలుపుతోంది.

ఇక ఫ్యాక్టరీల స్థితిగతులను గురించి విచారిద్దాం. పారిశ్రామికంగా వెనుకబడిన రెండు రాష్ట్రాలనూ - అస్సాం, అజ్మీర్ - మేర్వార్‌లనూ, పారిశ్రామికంగా కొంతవరకు అభివృద్ధిచెందిన రెండు రాష్ట్రాలు - బొంబాయి, యు. పి. రాష్ట్రాలనూ పరిశీలించితే 1947-48 లో 648 ఫ్యాక్టరీలు మూసివేయబడినాయి. ఈ లెక్కలు తెలియజేసిన 'ఇండియన్ లేబర్ గజెట్' 1949 ఫిబ్రవరి సంచిక యీ మూసివేతకు కారణాలను తెలుపలేదు. కాని విపరీతంగా పనినుండి కార్మికులు వేలకొలది తొలగించబడుతున్నారనే విషయాన్ని యిది మరుగు పరచలేకపోయింది.

1948-49 లోనే పరిస్థితి ఏవిధంగా విషమించిపోతున్నదీ దినపత్రికలలో బయటపడిన విషయాలను బట్టే స్పష్టంగా గ్రహించుకోవచ్చు. బాగా అభివృద్ధి చెందిన, బాగా లాభాలు గడించుతున్న బట్టల పరిశ్రమలలోనే రిట్రెంచిమెంటు (పనినుండి కార్మికులను తొలగించడం) విపరీతంగా సాగుతున్నది. కోయంబత్తూరులోని 38 వేల కార్మికులలోనూ 1948 సంవత్సరంలో 10 వేలమంది కార్మికులు పనినుండితొలగించబడ్డారు. తిరిగి ఈనాడు విద్యుచ్ఛక్తి తగినంతగా సరఫరా కావడం లేదనే సాకుతో 29 మిల్లులు మూసివేయబడినాయి. దాదాపు 15 వేల జనపనార కార్మికులు 1948 లో రిట్రెంచిమెంటుకు గురి అయ్యారు. ఇంకా ఇప్పుడు మొత్తం మగ్గాలలో 12-5 మగ్గాలు ప్రతి నెలలో కొద్దిరోజులు మూసివేయబడుతున్నాయి. వేలకొలది రైల్వే కార్మికులు యిదివరకే పనినుండి తొలగించబడ్డారు. ఆ తరువాత రైల్వే విచారణకమిటీ వర్కుషాపులలో వున్న "అదనపు" సిబ్బందిని యింకా రిట్రెంచిచేయవలసిందని సలహాయిచ్చింది.

ఇదంతా చాలదన్నట్లు 'వర్కులోడ్'ను (పనిబరువు) పెంచారు. బొంబాయిబట్టలమిల్లులలో యిప్పటికిది నాలుగుమిల్లులలో ప్రవేశపెట్టబడింది.

రైల్వేలలోకూడా వర్కులోడ్ను అధికం చేద్దామన్న ప్లానుతయారయింది. త్వరలోనే అది ఆచరణలో పెట్టబడుతుంది. రేషనలైజ్స్కీములు ప్రవేశపెట్టేందుకు తమకు "హక్కు" కలదని అప్పుడే బట్టలమిల్లుల యజమానులు ఆందోళనప్రారంభించారు. వర్కులోడ్ను ప్రతిఘటించే కార్మికులను బర్తరఫ్ చేయడానికి ప్రభుత్వ ట్రిబ్యూనల్సు అనుమతినిస్తూ యజమానుల కోర్కెలకు అప్పుడే ప్రభుత్వం వంతపాడటం ఆరంభించింది.

దోపిడీ, కరువు పరిస్థితులూ, దారిద్ర్యం యీ విధంగా రోజురోజుకు ఒకవైపున విపరీతంగా పెరిగిపోతూవుంటే మరొకవైపున పెట్టుబడిదారుల లాభాల పెరుగుదలకు అంతులేదు. పెట్టుబడిదారులు స్వయంగా ప్రకటించే లెక్కలప్రకారమే (వారు విపరీతంగా తక్కువ అంచనావేసి చెపుతారు) 1929లో 100 వుంటే 1929-1946 సంవత్సరాలలో బట్టల మిల్లు లాభాల సూచిక సంఖ్య నూటికి 154.5 నుండి 680.5 వరకూ పెరిగిపోయింది. బొగ్గుగనులలో లాభాలు నూటికి 189.1 నుండి 278.8 వరకూ పెరిగాయి. తతిమ్మా పరిశ్రమలలో నూటికి 72.4 నుండి 159.4 వరకూ లాభాలు పెరిగాయి.

ఇక తరువాత సంవత్సరాలను పరిశీలించితే 1948 సంవత్సరంలో లాభాలు అత్యున్నత శిఖరాలను అందుకొన్నాయి. నిజం చెప్పాలంటే యజమానులు తమకు లభించిన లాభాలనుచూచి తమఆనందాన్ని సహితం మరుగుపరచుకోలేకపోయారంటే అవి ఎంతఅధికమో ఊహించుకోవచ్చు. బొంబాయి యిండస్ట్రియల్ ట్రిబ్యూనల్ ప్రకారం 1948 లోనే బొంబాయి బట్టల పరిశ్రమ 20 కోట్లకుపైగా లాభాలను తెచ్చిపెట్టింది. అందువలననే యుద్ధకాలంలోగాని ఆ తరువాతగానీ ఇవ్వనంతగా - రెట్టింపు బోనస్ను గ్రాంటు చేసింది. (ఆ తరువాత యితర బొంబాయి పరిశ్రమలను పరిశీలించగా చాలవాటిల్లో యిలాంటి లాభాలే రాగా నాలుగున్నర నెలల వేతనాలు బోనస్ గా ప్రకటించబడింది.)

ఇంత జరిగినప్పటికీ బట్టలపరిశ్రమ చక్రవర్తులు తమవర్గబంధువైన నెహ్రూ - పటేలు ప్రభుత్వంయొక్క అండ జూచుకొని కార్మికవర్గంపై యుద్ధాన్ని ప్రకటించారు. జీతాలకోత, కరువుభత్యం తగ్గింపు కోయంబత్తూరులో వలె వేలకొలది కార్మికులను రేషనలైజేషన్ పేరిట బర్తరఫు చేయడం, ధరలను పెంచడం, పన్నుల తగ్గించుకోవడం మొదలుగాగల రూపాలలో పెట్టుబడిదారులు తమ దాడిని ప్రారంభించారు.

III

నానాటికి తీవ్రతరమవుతున్న పెట్టుబడిదారీ సంక్షోభంయొక్క వికృతచిహ్నాలూ, దీని విచ్ఛిన్నపోకడలూ ఏ విధంగా పరిణమించాయో చూశాం. అందుకనే కార్మికులుఅఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసునాయకత్వాన యీ ప్రమాదానికి వ్యతిరేకంగా బూర్జువా రాజ్యాంగయంత్రం ఎంతటిదారుణ నిర్బంధ విధానాన్ని అమనుపరచినప్పటికీ, దాని ఏజెంట్లు ఎంతటి విచ్ఛిన్న ప్రయత్నాలకు జరిగినప్పటికీ, లెక్కచేయకుండా పోరాడారంటే ఆశ్చర్యపడవలసిన పని లేదు. ప్రభుత్వ రిపోర్టులనే ఆధారం చేసుకొని సమ్మెల వెల్లువ అణచబడకపోగా తిరిగి బ్రహ్మాండమైన ఉధృతంతో విజృంభించే సూచనలున్నాయని కార్యదర్శి నివేదికలో సగర్వంగా చెప్పబడింది.

1947-48 సంవత్సరాల - అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు రెండు మహాసభల మధ్య -

"చాల మితవాదంగా, బాగా తక్కువ అంచనావేసి "ఇండియన్ లేబరు గజెట్" ప్రకారమే 3445 సమ్మెలు జరిగాయి. యీ సమ్మెలలో 3159006 కార్మికులు పాల్గొనడం జరిగింది. నష్టపడినరోజుల సంఖ్య 24,600,198. యిది ఎంతటి బ్రహ్మాండమైనసంఖ్యో ఎవరికైనా బోధపడుతుంది. అయితే యీ లెక్కలలో రాజకీయ సమ్మెలనూ, లాకౌట్లను కలుపలేదు. (ఇవి చాల అధికంగా వున్నాయి.) అయినప్పటికీ ఈసంఖ్య మొత్తం యుద్ధకాల మంతటిసంఖ్యతో పోల్చిచూస్తే కొద్దిగా తక్కువగా మాత్రమే. యీ యుద్ధకాలంలో 1942 లో యజమాన్ల లాకౌట్లుకూడా కలసి ఉన్నాయని గుర్తుంచుకోవాలి. యీసందర్భంలో మరొక ముఖ్యవిషయాన్ని కూడా గుర్తుంచుకోవాలి. అదేమంటే యీ లెక్కలు మొత్తం యుద్ధానంతర బ్రహ్మాండమైన వెల్లువలోని 24 మాసాలలో 16

మాసాలకు చెందినవి మాత్రమే. అంతేకాక యీ లెక్కలు విభజించబడిన భారతానికి సంబంధించినవి. భారత విభజన తరువాత దారుణంగా జరిగిన మతకలహాలు కార్మిక సమ్మెలవెల్లువను కొంతవరకు వెనక్కునెట్టిందనికూడా యీ సందర్భంలో గమనించవలసి ఉంది. వీటన్నింటినీ దృష్టిలో వుంచుకొంటే బ్రహ్మాండమైన యుద్ధానంతర కార్మికసమ్మెల వెల్లువను యీలెక్కలు ఎంత తక్కువగా అంచనా వేశాయో బోధపడుతుంది.”

ఈ సమ్మె వెల్లువకు ఒక ప్రధానమైన ముఖ్య కారణం తక్కువ జీతాలూ, చాలీచాలని కరువుభత్యమూ. ఈ కారణంపై జరిగిన సమ్మెలు మొత్తంలో నూటికి 40 ఉన్నాయి. ఇంకా అవి పెరగడంకూడా జరిగింది. 1945 లో 466 సమ్మెలు 1946లో 683, 1947లో 769 - యీ విధంగా హెచ్చాయి. 1948 నవంబరు మాసంలోనే నూటికి 48 వరకూ జీతాల సమస్యపైనే జరిగాయి. ఆ తరువాత నెలలో 38 వరకూ వెళ్ళింది.

కార్మికవర్గ మిత్రులైన గ్రామీణ శ్రామికవర్గమూ, మధ్యతరగతి ఉద్యోగులూ, విద్యార్థులూ తమతమ రంగాలలో యీ సంక్షోభదాడిని ఎదురు తిప్పికొట్టడానికి కార్మికవర్గ ఆయుధమైన సమ్మెనే వినియోగించారు. ముఖ్యంగా గమనించవలసిన విషయమేమంటే కార్మికవర్గం వలెనే యీ కాలంలోవారి సమ్మెలూ, ప్రదర్శనాలు, తీవ్ర కార్యాచరణ బాగా విస్తృతమయ్యాయి. కార్మికవర్గంవలెనే వారు విపరీతమైన నిర్బంధ విధానంమధ్య-తుపాకి కాల్పులనూ, వయసూ, స్త్రీ-పురుష విచక్షణా లేకుండా వందలాదిగా జరిగిన అరెస్టులను తట్టుకొని వీరోచితంగా పోరాడారు.

“ఈ సంక్షోభం తీవ్రమైన నిర్బంధ విధానాన్ని, విచ్ఛిన్నతనూ సహితం ఎదుర్కొని కార్మికులను పోరాడేటట్లు ఎంతగా చేసిందో” కార్యదర్శి నివేదికలో ఉదహరించిన ఒక్క యదార్థ సంఘటనే స్పష్టంగా చెప్పక చెపుతుంది. అదేమంటే: ఎన్నడూ లేనంత దారుణ నిర్బంధవిధానం అమలు జరపబడినప్పటికీ కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నపరచడానికి ఎన్నో కుతంత్రాలు జరిగినప్పటికీ, ఎంతో వ్యతిరేకప్రచారం జరిగినప్పటికీ, యింకా ఎన్నెన్నో సంభవించినప్పటికీ “1948 సంవత్సరపు సమ్మె లెక్కలు యుద్ధ కాలంలోని ఏ రెండు సంవత్సరాల సమ్మె లెక్కలతోనైనా సరిసమానంగా తూగగలుగుతాయి.” ఇందులో పెద్దగా డబ్బా వాయించుకోబడిన 1942 కూడా కలిపినా (కాని యిందులో 1940 సంవత్సరం లెక్కలు కలుపరాదు. ఎందువల్లనంటే ఆ యేడాది యుద్ధానికి వ్యతిరేకంగా దేశం నలుమూలలా బ్రహ్మాండమైన సమ్మెలు జరిగాయి.)

అంతేకాదు; సమ్మె లెక్కలవిషయంలో ప్రభుత్వం పచ్చి అబద్ధాలను కార్యదర్శి నివేదిక బట్టబయలు చేసింది. 1947 డిసెంబరులో ప్రభుత్వం “పారిశ్రామికసంధి” అనే ఒక బూటకపు ఒడంబడికను కార్మికులపై రుద్దింది. దానితో

కార్మికులను మోసం చేయడానికి జీవన వ్యయాన్ని సూచించే పాయింట్ల సంఖ్యను తప్పుడుగా తగ్గించి చూపెట్టడం ప్రారంభించింది. కాని నిజానికి అవి ధరలు పెరుగుతున్న రోజులు. దీనితోపాటు ప్రభుత్వం ప్రజలను మోసపుచ్చడానికి సమ్మెల వలన నష్టపడిన రోజులసంఖ్యను తప్పుగా దాచడానికి లేక చాలతక్కువగా చూపడానికి ప్రయత్నించింది. వీటిని బట్టబయలు చేయడానికి "ఇండియన్ లేబర్ గజెట్" ప్రకటించిన 1949 జనవరిలో కరువుభత్యం కోతకు ప్రతికూలంగా జరిగిన కాన్పూరు సమ్మె లెక్కలనూ, రిట్రెంచిమెంటుకు వ్యతిరేకం జరిగిన కోయంబత్తూరు బట్టలమిల్లు కార్మికుల సమ్మె లెక్కలనూ ఎత్తిచూపెట్టింది. ఇవి రెండూ కూడా ప్రభుత్వం ప్రకటించిన జనవరి లెక్కలలో అసలు కనపడనే కనపడవు.

"పారిశ్రామిక సంధి"ని సమర్థించుకోడానికి ప్రభుత్వం చేసిన మోటు ప్రయత్న మిలా పరిణమించింది. "పారిశ్రామికసంధి" జరిగిన మొదటిమాసంలో "ధరలు తగ్గించడానికి?" (!) "సమ్మెలను తగ్గించడానికీ" (!) తానువేసిన ప్లానును ఎలా అమలుపరచిందీ ప్రపంచానికి చూపడానికి ప్రభుత్వం చేసినపనియిది? అప్పటి నుండీ యిలాంటిప్రయత్నాలను ప్రభుత్వం చాల చేసింది. అలాంటివాటిని చాల చూపెట్టవచ్చునని కార్యదర్శి నివేదిక స్పష్టంగా పేర్కొన్నది.

రోజురోజుకు అధికమవుతున్న నిర్బంధ విధానానికి వ్యతిరేకంగా కార్మికులు సమ్మెలద్వారా యిచ్చిన జవాబులనుకూడా కొన్నింటిని ఉదహరించవచ్చు. "పారిశ్రామికసంధి" తరువాత మొదటి ఎనిమిది మాసాలలో ప్రభుత్వం తీవ్రమైన ఫాసిస్టుదాడులను ప్రారంభించినప్పటికీ కార్మికులు ఒకరోజునిరసనసమ్మె చేయడంమూలంగా 15 లక్షలపనిరోజులు నష్టమైనాయి. (ఇదిచాలతక్కువగా వేసిన అంచానా)

ఆ తరువాత కార్యదర్శి నివేదిక ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ నిర్బంధ, సమ్మె వ్యతిరేక శాసనాలను క్లుప్తంగా ఉదహరించింది. ఈ నిర్బంధ శాసనాల ఫలితంగా నేడు 25000 కు పైగా ప్రజానాయకులు జైళ్ళలో మ్రగ్గుతున్నారు. ఇందులో అధికభాగం ఎట్టివిచారణలేకుండా డిటెయిన్ చేయబడ్డవారే. వీరుకాక అరెస్టువారంట్లు జారీచేయబడిన వారి సంఖ్య కొన్ని వేలలో ఉంటుంది. రైల్వేసమ్మెకు వ్యతిరేకంగా అమలుజరిపిన దారుణ నిర్బంధ విధానంలో 8000 మందిని అరెస్టుచేసి 35000 మైళ్ళ పొడుగున కనపడితే కాల్చడానికీ, చంపేందుకు కాల్చడానికి ఉత్తరువులు జారీచేయడంతో ప్రభుత్వ నిర్బంధ విధానం పరాకాష్టను చేరుకొన్నది.

కార్యదర్శి నివేదికలో యింకా యిలా ఉంది :

"1948 సంవత్సరమంతటా "పారిశ్రామికసంధి" జరిగిన వెనువెంటనే అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు (ఎ. ఐ. టి. యు. సి.) ఆధ్వర్యానవున్న అన్ని యూనియన్‌లూ దాదాపు నిషేధం కిందకే వచ్చాయని చెప్పవచ్చు. ప్రభుత్వం వందలాది అరెస్టులు జరిపింది. యూనియన్‌ల ఆఫీసులను మూసి

వేసింది. కొన్నిచోట్ల ఆఫీసులను యజమానుల గూండాలకూ, స్థానిక జాతీయ 'యూనియన్' లకు అప్పజెప్పింది. ఆఫీసు రికార్డులను స్వాధీనం చేసుకుంది.... ఇదంతా బూర్జువా వర్గ న్యాయసూత్రాల ప్రకారంకూడ అక్రమమేకాని వర్గపోరాటంలో బూర్జువా వర్గానికి అంతా సవ్యంగానే కనపడుతుంది."

విపరీతమైన దారుణ నిర్బంధాలకూ, అరెస్టులకూ, డిటెన్షన్లకు, లాఠీ చార్జీ వగైరాలకు గురికాని సమ్మెంటూ లేనే లేదు. తన నాయకులలో మెజారిటీ అరెస్టుకో లేక అజ్ఞాతవాసానికో గురికాని యూనియన్ అంటూ లేనేలేదు. అన్నింటికంటే వళ్లు జలదరించే ఉదాహరణ ఏమంటే: 1948 మార్చి మాసంలో జరిగిన బీజపూర్ పాకీ పనివారి సమ్మె సందర్భంలో ప్రతి పురుషుడూ, ప్రతి స్త్రీ, ప్రతిబిడ్డా —ఒక్క మాటలో పనివాండ్రంతా, వారి బంధువులతో సహా జైళ్ళలో త్రోయబడి డిటెయిన్ చేయబడ్డారు. దీని ఫలితంగా ఒక స్త్రీ కాంగ్రెసుజైల్లో బిడ్డను కనవలసి వచ్చింది.

"ఈ దారుణ నిర్బంధ విధానదశలో ప్రతి ఒక్క సంఘటనను ఉదహరించడం అనవసరమని" చెప్పుతూ కార్యదర్శి నివేదిక యీ కాలంలో కార్మికులపై జరిగిన కొన్ని కాల్పుల ఉదంతాలను పేర్కొన్నది. 1947-1948 మధ్య జరిగిన నిర్బంధ విధానదశ 1947 జనవరి 6 వ తేదీన కాన్పూరులో జరిగిన కాల్పులతో ప్రారంభమైంది.

(కాంగ్రెసు మంత్రులు అధికారంలోకి వచ్చిన మొదటి ఎనిమిది మాసాలలోనే 32 మంది కార్మికులు యిద్దరు స్త్రీలతో సహా చంపబడ్డారు. 400 మంది గాయపరచబడ్డారు. ఇదికాక తరువాత ఘట్టమే వివరించబడుతున్నది.) జూలై 27 వ తేదీన ఇద్దరు రైల్వేకార్మికులు చంపబడ్డారు. "స్వాతంత్ర్యం" లభించిన మొదటి పది మాసాలలోనే కనీసం 5 గురు చంపబడ్డారు. ఇందులో ఒక బిడ్డకూడావుంది. ఒక్క కాల్పులలోనే 1050 మంది గాయపరచబడ్డారు. ఇక లెక్కలేనన్నిసార్లు జరిగిన లాఠీచార్జీల ఫలితం గాయపడినవారి సంఖ్య యిక చెప్పనే అవసరంలేదు.

ఇవికూడా పూర్తిలెక్కలను తెలుపవు. ఇదంతా ప్రారంభంమాత్రమే. ఇంకా తుపాకి కాల్పులకు ప్రజలు గురవుతూనే వున్నారు. 1949 ఏప్రిల్లో కార్మిక నాయకులూ, యితర డిటెన్యూల నిరాహారదీక్షకు సానుభూతిని ప్రదర్శించినందుకు కలకత్తాలోను, బొంబాయిలోను ప్రజలపై కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల ఫలితంగా కలకత్తాలో 5 గురు స్త్రీలూ, యిద్దరు పురుషులూ చనిపోయారు బొంబాయిలో ఒకరు చనిపోయారు.

కాని ప్రభుత్వం యింతటిదారుణమైన నిర్బంధవిధానాన్ని అమలుజరిపి సాధించలేకపోయింది. అందువలన కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నపరచడానికి బాగ

ఆలోచించి కుతంత్రాలు పన్నింది. గులామ్ సంస్థయైన జాతీయ ట్రేడ్‌యూనియన్ నేగాక, పెద్దగా తీవ్రపదజాలాన్ని వల్లించే సోషలిస్టు నాయకత్వం సహితం యూనియన్‌లను విచ్ఛిన్నంచేయడానికి, సమ్మెలను భగ్నంచేయడానికి కడకు పోలీసులకు గూఢచారులుగా పనిచేసే స్థితికికూడా ముఖ్యంగా మార్చి 9వ తేదీ రైల్వే జనరల్ సమ్మెసందర్భంలో దిగజారారు.

ఇంతటి బ్రహ్మాండమైన సమ్మెవెల్లువ దేశంలో వున్నప్పుడు "ప్రభుత్వ బీభత్సంతో కూడిన నిర్బంధవిధానం దాని ఏజెంట్ల విచ్ఛిన్నప్రయత్నాలు వృధా అవుతుందనే విషయం అందరికీ తెలిసినదే. ఇప్పటివరకూ జరిగినది యుద్ధానికినాంది మాత్రమే ననే విషయమనికూడా ప్రతి ఒక్కరూ గుర్తించకపోరు..." అంతే కాదు; "భారతకార్మికవర్గం యావత్తు దేశాన్ని ముంచివేసే బ్రహ్మాండమైన సమ్మె వెల్లువ ముంగిటనున్నదనికూడా గుర్తించకపోరు."

ఇవిఏవో చిన్నచిన్న సమ్మెలు కాదనే విషయమూ, యివి వర్గపోరాటంలో తీవ్రమైన పోరాటాలనే సత్యాన్ని నాలుగు నెలలపాటు జరిగిన 38 వేల కోయంబత్తూరు బట్టలకార్మికులసమ్మె, రెండు మాసాలపాటు జరిగిన 30 వేల నాగపూర్ బట్టల కార్మికులసమ్మె, బొంబాయిలో జరిగిన రెండు మహత్తరమైన సమ్మెలూ - నాలుగు మాసాలకు పైగా జరిగిన 1200 ఫైర్‌స్టోన్ రబ్బర్, టైర్ వర్కర్స్ సమ్మె, యిప్పటివరకూ 600 నాయకులను పోగొట్టుకొని యింకా అతి పట్టుదలతో వీరోచిత పోరాటాన్ని కొనసాగించుతున్న 15000 మునిసిపల్ కార్మికుల సమ్మె - రుజువు చేస్తున్నాయి.

కార్మికుల ప్రధాన కోర్కెలనూ, కార్మికవర్గ రాజకీయఆశయమైన సోషలిజమూ, నూతన ప్రజాతంత్రం పేర్కొని కనీసవేతనాలకొరకు, ఉద్యోగాల గ్యారంటీ కొరకు, పూర్తి ట్రేడుయూనియన్ హక్కులకొరకూ, సమ్మె హక్కుకొరకూ, నిర్బంధవిధానాన్ని అంతమొందించుటకూ అఖిలభారత పోరాటమొక్కటే శరణ్యమని, దాని నిర్వహణకూ, విజయానికీ కార్మికులంతా ఐక్యమై సమాయత్తమవండనే సింహనాదంతో కార్యదర్శి నివేదిక ముగిసింది.

IV

తీవ్రతర మౌతున్న సంక్షోభంయొక్క ప్రధాన స్వరూపాన్ని తీర్మానాలు ఎంతో సరిగా వ్యక్తంచేయటమే కాకుండా ఈ సంక్షోభంనుంచి బయటపడేందుకు కార్మికవర్గ మార్గమేమిటోకూడ అంత చక్కగా చూపెట్టినాయి. ఆ మార్గావలంబనలో సర్వవ్యాపిత పోరాటానికి తీర్మానాలు పిలుపునిచ్చాయి. ఇది ఏదో మామూలు నిత్యకార్యక్రమంలో పాక్షిక పోరాటానికై యిచ్చే పిలుపుకాదు. దేశమంతటావున్న ఏదోఒక పరిశ్రమలోని కార్మికులకు యిచ్చిన సర్వవ్యాపిత పోరాట పిలుపూకాదు. దేశం నలుమూలలావున్న పారిశ్రామిక కేంద్రాలన్నింటిలోను - చిన్నవికాని పెద్దవికాని - ఒకేమారు సర్వవ్యాపిత పోరాటం ప్రారంభించవలసిందిగా పారిశ్రామిక కార్మికులకు మొత్తంగా ఇచ్చినపిలుపు ఇది.

ఒకప్రక్క నిర్బంధవిధానం పెచ్చు పెరుగుతూ వుండటం, రెండోవైపున కార్మికుల ప్రతిఘటనాశక్తి మిన్ను ముట్టుతూ వుండటంవల్ల యీసర్వవ్యాపిత పోరాటం ఒక సంకులసమరం వంటిది అవుతుంది. ఇదే రెండవరోజు మహా సభలో ప్రదర్శితమైంది. ప్రతినిధులు ప్రవాహంలా మహాసభ ఆవరణలోకి ప్రవేశిస్తున్నారు. కలకత్తా పోలీసుల ఆదేశంప్రకారం బొంబాయి పోలీసులు, కలకత్తా ట్రాంవేకార్మిక నాయకుడు కామ్రేడ్ కాళీబెనర్జీని అరెస్టుచేశారు. అకస్మాత్తుగా యీ దాడిజరిగినప్పటికీ, అరెస్టు అంత తేలికగా చేయలేకపోయారు. ప్రతినిధులు అక్రమమైన యీ దాడిని ప్రతిఘటించారు. దారుణమైన లాఠీచార్జీ జరిపినపిదపనే పోలీసులు తమ దుష్టత్వంలో కృతకృత్యులయారు.

తీర్మానాలను ప్రతిపాదిస్తూ చేసిన ఉపన్యాసాలలో యీఘటనా స్వరూపం గోచరమైంది. ఆనాటి కార్యక్రమం చైనా విముక్తసైన్యాలయొక్క అఖండవిజయాలను హృదయపూర్వకంగా అభినందిస్తూ చేసిన తీర్మానంతో ప్రారంభమైంది. ఆ తీర్మానాన్ని చదువుతుండగా మధ్య మధ్య నినాదాలు మిన్నుముట్టాయి. "ఆంగ్లో అమెరికన్ సామ్రాజ్యవాదులు నశించాలి" "ఫాసిస్టు పాలన నశించాలి" మొదలైనవి.

రాజకీయ ఖైదీలను విడుదలచేయాలనీ, డిటెన్యూలు రాజకీయఖైదీలని గుర్తించుకొని, దానికి తగినట్లు సౌకర్యాలు కలిగించాలనీ, డిటెన్యూల సహాయనిధిని ఏర్పరచాలనీ, 8 మంది తెలంగాణా యువకవీరులపైన విధించిన మరణశిక్షను రద్దుచేయాలనీ, అఖిల మలయా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కామ్రేడ్ గణపతిని ఉరితీయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ వివిధములైన తీర్మానాలు అంగీకరించబడ్డాయి. ప్రపంచ శాంతిసైనిక కాంగ్రెసును బలపర్చుతూ, యుద్ధోన్మాదులు చేసుకున్న ఉత్తర అట్లాంటిక్ ఒడంబడికను నిరసిస్తూ, కామన్‌వెల్తు సంధిపాశం ద్వారా పెట్టుబడిదారీతొత్తుప్రభుత్వాన్ని సామ్రాజ్యవాదుల యుద్ధ కూటమిలోకి యీడ్చుకొని, తద్వారా ఆగ్నేయాసియాలో వెల్లివిరిసిన విముక్త పోరాటాలకు వ్యతిరేకంగా జరిగే కుట్రలను ఖండిస్తూ తీర్మానించబడింది. భారత కార్మికవర్గమూ ప్రజలూ కలసి ఈ దౌర్భాగ్య ప్లానులను కృత నిశ్చయంతో ప్రతిఘటిస్తారని యీ తీర్మానంలో వెలిబుచ్చటమైనది.

వస్త్రకార్మికులు, రైల్వే కార్మికులు, మ్యునిసిపల్ కార్మికులు మొదలగు వివిధ భాగాలకు చెందిన కార్మికవర్గంయొక్క ప్రత్యేక కోర్కెలను బలపర్చుతూ తీర్మానాలను చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలచేత అమలుపర్చబడుతున్న కర్షక వ్యతిరేక, జమీందార్ అనుకూల ధాన్యసేకరణ విధానాన్ని నిరసిస్తూ, ఆవిధానం రైతుల కడుపుకొట్టుతూ, పట్టణ మధ్యతరగతి పొట్టలనుమాడ్చుతూ, బ్లాక్‌మార్కెట్‌ను ప్రోత్సహిస్తోందని యిందులో వివరించబడింది.

సంక్షోభంవల్ల వచ్చు విషమఫలితాలు, వాటిని ఎదిరించటానికి కార్మికులు అవలంబించాల్సిన మార్గాన్నిగూర్చి వివరించిన తీర్మానాలు చాలా ప్రాముఖ్యమైనట్టివి. వీటిలో ప్రతి ఒక్క తీర్మానం సంక్షోభానికి సంబంధించిన ప్రధాన సమస్యలను చర్చించింది. జీవనభృతి, ఉద్యోగభీమా, జీవన వ్యయంలోని పెరుగుదలకు నూటికి

నూరుపాళ్ళు పరిహారం యివ్వటం, ట్రేడ్ యూనియన్ హక్కులను గుర్తించటం, నిర్బంధవిధానాన్ని - ఈ నిర్బంధవిధానం ద్వారానే బూర్జువా రాజ్యాంగయంత్రం తనశక్తినంతా వుపయోగించి పెట్టుబడిదారీ సంక్షోభ భారాన్ని కార్మికుల నెత్తిపైకి నెట్టగలుగుతారు - అంతమొందించటం మొదలైన సమస్యలు యీ తీర్మానాలలో చర్చించబడ్డాయి.

ఈ తీర్మానాలలోని ముఖ్య విషయమేమంటే, పైన వివరించబడిన కోర్కెలను సాధించకుండా, కార్మికులు, శ్రామిక జన సామాన్యం సంక్షోభపు ఉధృతాన్ని తట్టుకొని జయప్రదంగా తిప్పికొట్టలేరు. ఇంకొక అతి ప్రధానమైన విషయమేమిటంటే పెట్టుబడిదారీ సంక్షోభపుచట్టంలో వుంటూ, లాభాలు, దోపిడీ యధాప్రకారము కొనసాగుతూవుండగా, పైన చెప్పిన కోర్కెలలో ఏ ఒక్కదాన్నికూడ సాధించుకోవటానికి వీలులేదు. ప్రతి ఒక్క కోర్కెకోసం ఎప్పటికప్పుడు పెచ్చు పెరుగుతున్న నిర్బంధాగ్ని జ్వాలల మధ్య - ఈ నిర్బంధాగ్ని జ్వాలలే పెంపొందుతున్న సంక్షోభానికి సూచిక - స్థిరసంకల్పంతో పోరాడిసాధించుకోవాలి.

ఇక్కడ ఒక విషయంచెప్పటం అసంగతం కానేరదు. అతిముఖ్యంగా గమనించవలసిందికూడా. ఈ కోర్కెలలో ఏ ఒక్కటీగాని, లేక అన్నీగానీ భారత కార్మికవర్గానికి కొత్తవికావు. అనేక సార్లు, ముఖ్యంగా గతరెండు సంవత్సరాలుగా భారత కార్మికులు వీటికై ఎడతెగని పోరాటాలను సాగించారు. అందువల్ల యీ తీర్మానాలవల్ల ప్రధానంగా సాధించినది ఏమిటంటే అన్ని రాష్ట్రాల లోను, అభివృద్ధి అయిన ప్రాంతాలలోను అభివృద్ధికాని ప్రదేశాలలోవున్న ప్రతి పరిశ్రమలోను పని చేసే కార్మికులందరి యొక్క సమిష్టి కోర్కెలుగా మొట్టమొదటిసారిగా వెలుబుచ్చబడ్డాయి. ఇంతేకాదు. వెంటనే సాధించవలసిన లక్ష్యంగా కార్మికులందరినీ సమీకరించే నినాదంగా అద్యతన భావిలో జయించాల్సినవిగా చూపెట్టబడ్డాయి. దీనికి కార్యరూపంకూడ యివ్వబడింది. దేశ వ్యాపితంగా ఒకేసారి, అటో ఇటో తేలే సర్వవ్యాపిత పోరాటమే దీని కార్యరూపం. ఇట్టిపోరాటం యిదివరకు ఎన్నడు జరుపబడి యుండలేదు. కాని గత రెండు సంవత్సరాల అనుభవాన్ని తార్కాణంగా తీసుకున్నట్లయితే, యిటువంటి పోరాటాన్ని సాగించటానికి కావలసిన శక్తిసామర్థ్యాలు భారత కార్మికులకు కలవనితప్పక చెప్పవచ్చు.

ఈ తీర్మానాలలో వెలిబుచ్చబడిన ప్రధాన కోర్కెలేమిటి ?

1. (ఎ) పనితనంలేని కార్మికులకు కనీసభృతి 80. రూ. పనితనం కలిగిన కార్మికులకు 125 రూ. గా నిర్ణయించాలనీ, (బి) జీవనవ్యయ పెరుగుదలకు నూటికి నూరుపాళ్ళు పరిహారం యివ్వాలనీ, (సి) ఉద్యోగభీమా కల్గించాలనీ, (డి) రోజుకుఏడుగంటలు, వారానికి 40 గంటలపని నిర్ణయించాలనీ, (ఇ) తాత్కాలికంగా నియమించబడ్డ కార్మికులను వెంటనే ఖాయపర్చాలనీ, (ఎఫ్) నిరుద్యోగభయంనుండి హామీ నివ్వాలనీ,

(జి) సమ్మెచేసే హక్కుతోసహా ట్రేడ్‌యూనియన్ కార్యకలాపాలు నెరవుకొనేహక్కును చట్టసమ్మతం చేయాలనీ; (హెచ్) ట్రేడ్‌యూనియన్‌నాయకులను, యితర ప్రాముఖ్య ప్రజానాయకులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలనీ; (ఐ) నిర్బంధ చట్టాలను, సమ్మె ప్రతీప చట్టాలను రద్దుచేసి సంపూర్ణమైన ప్రజాస్వామిక హక్కులను అంగీకరించాలనీ; 4½ మాసాలపాటు పూర్తిజీతాన్ని, అధిక ధరల అలవెన్సుతోసహా బోనస్‌గా యిచ్చి సెలవు అంగీకరించాలనీ మొ॥ కోర్కెలు యిందులోవున్నాయి

2. ట్రేడ్‌యూనియన్ హక్కులనుగూర్చి చేసిన తీర్మానంలో "ఫాసిస్టు (ప్రభుత్వం యొక్క నిర్బంధ) చర్యలద్వారా ట్రేడ్ యూనియన్ నిర్మాణానికి సంబంధించిన ప్రాథమికహక్కులు, సమ్మె చేసే హక్కు భారతకార్మిక వర్గానికి మృగ్యం చేయబడ్డాయి" అని వివరించబడింది. "ఈ నిర్బంధ పాలన వెనువెంటనే రద్దుచేయాలని డిమాండ్" చేయిడమైంది. ఇంకా (ఎ) కార్మిక, కర్షకనాయకుల నందరినీ వెంటనే బేషరతుగా విడుదలచేయాలనీ, (బి) సభలు మొదలైనవాటిపై వున్న నిషేధాలను ఉపసంహరించుకోవాలనీ, (సి) ట్రేడ్‌యూనియన్ యితర కార్మికవర్గ పత్రికలకు ప్రచురణావకాశం కలుగచేయాలనీ, (డి) సమ్మె వ్యతిరేక చట్టాలనన్నింటినీ రద్దుచేసి, సమ్మెచేసుకొనేహక్కును అంగీకరించాలనీ (ఇ) నిర్బంధ చట్టాలనుచేసే అవకాశమునిచ్చే చట్టాలను ఉపసంహరించాలనీ కోరబడింది.

పోగా మరోరెండు ముఖ్యతీర్మానాలు అంగీకరించబడ్డాయి. ఒకటి రైల్వే కార్మికులనుగూర్చి, రెండోదివస్త్ర కార్మికులనుగూర్చి వారికోర్కెలను ఉద్ఘాటిస్తూన్న భాగాలు ముఖ్యమైనప్పటికీ, ఆ తీర్మానాల ప్రాధాన్యత వేరేవుంది. అదే సంఘనిర్మాణానికి సంబంధించినది. సాధ్యమైనంత త్వరలో అఖిలభారత మహాసభలను జరిపి ముంచుకువస్తున్న సంక్షోభాన్ని ప్రతిరంగంలోను ఎలా ఎదుర్కోవాలో యీ మహాసభలలో చర్చలు జరిపి చర్యలు తీసుకోవాలని తీర్మానించడమైంది.

ఒకప్రక్క పనిభారం హెచ్చుచేసే దాడి మిన్నుముట్టుతోంది. రెండోప్రక్క కార్మికులను పనినుండి తొలగించేవిధానం పెచ్చు పెరుగుతోంది. ఇదంతా హెచ్చు ధరలు, మూల్గుతున్న నిల్వాలవల్ల జరుపబడుతోంది. వస్త్రపరిశ్రమలో ఈ పరిస్థితి ప్రమాదకరమైనస్థితికి దిగజారుతోంది. దక్షిణాదినవున్న కోయంబత్తూరునుంచి ఉత్తరాదినున్న కాన్పూర్‌వరకు, పశ్చిమాదిన

వున్న బొంబాయి, అహమ్మదాబాదులనుండి, తూర్పుకోసనున్న కలకత్తా వరకు, మధ్యరాష్ట్రాలలోవున్న నాగపూర్ ప్రాంతాన్ని కలుపుకొని దేశవ్యాపితంగా తుడిచిపెట్టుకుంటూ ఈదాడి వస్తోంది. కనుక యావద్భారత దేశవ్యాపితంగా సుసంఘటితమై, చక్కటి ప్లానును సక్రమంగా అమలుజరపటం ద్వారానే యీదాడిని తట్టుకోగలరు. ఇది గుర్తించటంవల్లనే, భారత కార్మికవర్గానికి చెందిన ఒక ప్రధాన భాగమై, సుసంఘటితమై వున్న వస్త్రకార్మికుల పురోగామిపాత్రను గుర్తించటంవల్లనే, మహాసభ అఖిలభారత వస్త్ర కార్మికుల మహాసభను జరపాలని నిర్ణయం తీసుకొన్నది.

1934 సం॥ వస్త్ర పరిశ్రమ యజమానులందరూ దేశం మొత్తంమీద యిదేవిధమైన రేషనలైజేషన్ దాడిని సాగించాలని కుట్రపన్నారు. ఈ దాడిని తిప్పికొట్టటంకోసం అప్పుడు వస్త్రకార్మికులందరూ కలసి బొంబాయిలో అఖిలభారత వస్త్ర కార్మిక మహాసభను జరిపారు. దాని తర్వాత వచ్చిన సమ్మెలపరంపర మాత్రమే ఆదాడిని ఓడించ గలిగింది.

నేడు భారత వస్త్రకార్మికులు సంఖ్యలోను, నిర్మాణంలో యవ్వనాన్ని పొందారు. అసంఖ్యాకమైన పోరాటాగ్నులలో రాటుతేలారు. అందువల్ల వారి శక్తులను క్రోడీకరించుకోవాలని నిర్ణయించుకోవటం లాభాపేక్షతో మత్తెక్కిన యజమానులకు ఒక సవాల్ వంటిది.

రాబోతున్న రైల్వే కార్మికుల మహాసభకూడ యింతే ప్రాధన్యత కలది. మార్చి 9 సమ్మెను పశుబలంలో అణచటం వల్ల 8½ లక్షల రైల్వేకార్మికులకు ఎదుర్కొంటున్న ఏ ఒక్కసమస్యా పరిష్కారం కాలేదు. పైగా తర్వాత ఘటనలు వారి పరిస్థితిని మరింతగా అధ్వాన్నపర్చాయి. మార్చి 9 సమ్మెవైఫల్యానికి ప్రధాన కారణము యింతవరకు రైల్వే కార్మికుల జాతీయ సంఘం అని పిలవబడే అఖిల భారత రైల్వేమెన్స్ ఫెడరేషన్ అవలంబించినకార్మికవర్గవ్యతిరేకపాత్రమాత్రమే.

సమ్మెబ్యాలెట్ ద్వార 8½ లక్షల రైల్వే కార్మికులు తెలియపర్చిన అభీష్టాన్ని ఆ సంఘ నాయకులు అతిక్రమించారు. దానికి అనుబంధ సంఘాలలో ఉత్తమమైన వాటిని ప్రజాస్వామిక సూత్రాలను కాలదన్నుతూ బహిష్కరించి, తద్వారా ఫెడరేషన్ను విచ్ఛిన్నపరచారు. ఇదంతా చాలదన్నట్లు, ప్రభుత్వానికి గూఢచారుల్లాగా సిగ్గనేది లేకుండా పనిచేసి మిలిటెంట్ కార్యకర్తలను అరెస్టు చేయించటానికి ప్రయత్నించారు. తమకు చేతనైనంతలో సర్వవిధాల కార్మికులకు ద్రోహం చేసారు. అట్టివారిని బహిరంగ పోరాటంలో నిర్మూలించటంద్వారానే కార్మిక వర్గం తన కోర్కెలను సాధించుకోగలదు.

అందువల్ల రైల్వేకార్మికుల నందరినీ కొత్త విప్లవకరసంస్థ వెనక సమీకరించాల్సిన అవసరం తప్పనిసరి అవుతోంది. ఈ విప్లవకరసంస్థమాత్రమే కార్మికుల కోసం నిలబడి, రైల్వే అధికారులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడగలదు. ఈ విధంగాకాక మరోవిధంగా ఏమిచేసినప్పటికి, సమ్మె విచ్ఛిన్నకుల సంస్థగా మారి పతనమైన అఖిలభారత రైల్వేమెన్స్ ఫెడరేషన్ చేస్తున్న ద్రోహానికి చేయూతనివ్వటం తప్ప వేరు కానేరదు. ఈ నిర్ణయాలను భవిష్యత్తులో రాబోతున్న గడ్డుపోరాటాలను దృష్టిలో వుంచుకొని దానికి తగినరీతిలో అఖిల

భారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ తన నిబంధనావళిలోని కొన్ని భాగాలను తిరిగి మూసపోసుకోవాల్సి వుంటుంది. ఈసవరణల ప్రధానోద్దేశం యిది. పాతనిబంధనావళి ట్రేడ్‌యూనియన్ సంస్థకు అప్పట్లో వున్న కొద్దిపాటి స్వేచ్ఛావాతావరణానికి తగినట్లువుంది. కాని ప్రస్తుతం మారిపోయిన పరిస్థితుల్లో ఆ పాత నిబంధనావళి యీ సంస్థయొక్క అభివృద్ధికీ, పోరాటశక్తి యినుమడించటానికీ, అడ్డురాకుండా చూడటమే యీ సవరణల ప్రధానోద్దేశం. కో-ఆప్షన్‌కు సంబంధించిన నియమాలలో కొన్ని మార్పులు చేయబడ్డాయి. అరెస్టు అయిన వారిస్థానే ముఖ్యకమిటీ సభ్యులను కో-ఆప్ట్ చేసుకోవటం మొదలైనవి ప్రస్తుత పరిస్థితులకు తగినట్లు మార్చడమైంది.

తన లక్ష్యాన్ని చేరుకోవడంలో తన మహత్తర పోరాట సాంప్రదాయాల్లో దృఢమైన నమ్మకంవుంచి, అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ముందుకు పోతుందనటానికి కార్యనిర్వాహకుల ఎన్నికయే ప్రబల నిదర్శనం. ప్రఖ్యాత కార్మిక నాయకులైన డాంగే, రణదివే, మిరాజకర్ యూసఫ్, వైద్యా, జ్యోతిబాసు, భోగ్లే, కళ్యాణసుందరం, బాయిజ్‌నాథ్‌సింగ్ మొదలైనవారు జైల్లోవుండటమో లేక వారిపై వారంట్లు జారీఅయి వుండటంవల్ల రహస్యజీవితం గడుపుతూవుండటమో జరిగింది. కాని వారంతా కార్యనిర్వాహకులుగానో కార్యవర్గ సభ్యులుగానో తిరిగి ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. కార్మికోద్యమంలో తలనెరసిన కార్మికనాయకుడు కామ్రేడ్ చక్రయచెట్టియార్ (మద్రాస్) అధ్యక్షులుగాను, కామ్రేడ్ డాంగే ప్రధానకార్యదర్శిగాను ఎన్నుకోబడ్డారు.

మలాన్‌లో జరుగనున్న ప్రపంచకార్మిక సమాఖ్యయొక్క మహాసభకు ప్రతినిధులుగా కామ్రేడ్స్ డాంగే, యూసఫ్, మిరాజకర్ గార్లను - వీరు ముగ్గురు డిటెన్యూలుగా జైల్లో వున్నప్పటికీ—ఎన్నుకొన్నారు. కార్మికవర్గ ప్రతినిధులు యీ విధంగా ముగ్గురినీ ఎన్నుకోవటం ద్వారా ఈ నాయకుల పోరాటపంథాయెడ తమ భక్తి విశ్వాసాలను మరోసారి పునరుద్ఘాటించారు.

V

ఈ సమావేశం సాధించిన విజయమేమిటి? దీని చారిత్రిక ప్రాముఖ్యత ఏమిటి?

నానాటికి అధ్వాన్నపరిస్థితులకు దిగజారుతూఉన్న సంక్షోభంవైపు అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ శ్రామిక ప్రజలదృష్టిని సరిగా ప్రసరింపజేసింది. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొని బైటపడడానికి అఖిలభారత పోరాటం ఒక్కటే సరియైన సాధనమని పిలుపు ఇచ్చింది. ప్రభుత్వం సాగించే ఈ దాడిని తిప్పి కొట్టడానికి ఒక్క కార్మికులు మాత్రమే శక్తిమంతులని తెలియజేసింది. కార్మికులు తమ అమోఘమైన శక్తిని గుర్తించేటట్లు చేసింది. వారిని పీడించే శత్రువులశక్తి రోజురోజుకూ ఎలా ఉడిగిపోతూవుందో కార్మికులచే గుర్తింపబడేటట్లు చేసింది. పస్తులుపండుకొని కృశించి కృశించి చివరకు నశించిపోయేదానికంటె ప్రభుత్వం ఎంతటి తీవ్ర నిర్బంధవిధానానికి పూనుకున్నాసరే లక్ష్యం చేయకుండా పోరాటం సాగించడం ఒక్కటే తక్షణ

కర్తవ్యమనీ అంతకంటె మరోగత్యంతరం లేదనీ, చరిత్ర ఈనాడు స్పష్టంచేస్తూ ఉంది. సంక్షోభానికివ్యతిరేకంగా అఖిల భారత పోరాటం సాగించాలని ధైర్యోపేతంగా పిలుపు ఇవ్వడంద్వారా ప్రభుత్వ దాడిని ఓడించి సుఖప్రదమైన జీవితాన్ని సాధించుకోడం కార్మికులకు అత్యవసరమే కాకుండా అది పూర్తిగా ఆచరణసాధ్యమనికూడా అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు చాటిచెప్పింది. కాబట్టి కార్మికులు ఇప్పుడే-వెంటనే తమ కర్తవ్యాన్ని నిర్ణయించుకోవలసి ఉంటుంది.

తీవ్రతరం అవుతూవున్న ఏ ఆర్థిక సంక్షోభంవైపు అయితే ఈ సమావేశం కార్మికుల దృష్టిని సునిశితంగా ప్రసరింపజేసిందో, ఏ సంక్షోభాన్ని ఎదుర్కోడానికి తన సర్వశక్తులను కేంద్రీకరించిందో ఆ సంక్షోభం రోజురోజుకూ విపరీతమైన దారుణ పరిస్థితికి దిగజారిపోతూ ఉంది. పెట్టుబడిదారీ వర్గానికి వంతపాడే సోషలిస్టు నాయకుల్లాంటివాళ్ళుకూడా చివరకు ఈ సంక్షోభ తీవ్రతను అంగీకరించవలసి వచ్చింది.

భారతదేశంలో అన్నిటికంటె పెద్ద పరిశ్రమఅయిన నూలు పరిశ్రమలయొక్క (కాటన్ టెక్స్‌టైలు) పెద్ద పెద్ద కేంద్రాలలో కూడా ఈసంక్షోభాన్ని మరుగుపరచడంఅసాధ్యమైపోతూవుంది. అహమదాబాద్‌లో పదికోట్ల రూపాయల విలువగల స్టాక్ నిలవ ఉండిపోయింది. బొంబాయిలో కనీసం ఏడు మిల్లుల్లోనయినా రాత్రి షిఫ్టులు మూసివేయడం జరిగింది. తదితర మిల్లులుకూడా ఇదే పద్ధతి నవలంబించబోతున్నాయి. కోయంబత్తూరు, కాన్పూర్, ఖాండేష్, పశ్చిమ బెంగాల్ ప్రాంతాలనుంచికూడా ఇలాంటి వార్తలే వస్తున్నాయి. ఇదివరకే ధరలు అధికంగా ఉంటే నెహ్రూ ప్రభుత్వం వాటిని ఇంకా అధికంచేసింది. బట్టలు సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండాపోయ్యాయి.

ఇది ఒక్క వస్త్ర పరిశ్రమల పరిస్థితులకు సంబంధించిన విషయమేకాదు. సిమెంటు, ఇనుము, ఉక్కు, చక్కెర, తేయాకు, జనుము, సబ్బువగైరా పరిశ్రమలలోకూడా పరిస్థితులింతే ఉన్నాయి.

సంక్షోభాన్ని మరుగుపరచి ఉంచడానికీ, ప్రజలను దోపిడిచేయడానికీ, కార్మికవర్గాన్ని పీల్చడానికీ, పెట్టుబడిదారీవర్గానికి రహస్యాయుధంగా ఉపయోగపడే నోట్లముమ్మరం యుద్ధకాలంనాటి విపరీతసంఖ్యను ఎప్పుడో మించిపోయింది. దాన్ని అరికట్టే ప్రయత్నమేమీ జరగ లేదు. ఇక పారిశ్రామిక ఉత్పత్తి చూద్దామా అది యుద్ధకాల సంఖ్యనుకూడా అందుకోలేకుండాఉంది. అందుకోలేకపోవడమే కాదు; ఎంతో వెనకపడిందికూడా. యుద్ధానికి పూర్వం 100 అనుకుంటే యుద్ధకాలంలో (1943-44) 126.8 వరకు పెరిగింది. కాని 1948లో 113 ను దాటిపోలేదు. ఇక వ్యావసాయిక ఉత్పత్తి యుద్ధపూర్వం 100 అయితే 1948-49 లో 93 మాత్రమేఉంది.

ఈ అంకెలు ఏమితెలియజేస్తున్నాయి. ఉత్పత్తి ఒకవైపు పడిపోతూఉంటే మరోవైపు నోట్లముమ్మరంద్వారా యథేచ్ఛగా ధరలు పెంచివేయబడుతున్నాయి. ప్రజలు పస్తులుపండుకోవలసి వస్తూఉంది. ప్రజల కొనుగోలుశక్తి పూర్తిగా పడిపోతూ ఉండడంవల్ల పస్తులు పండుకోవడం రోజురోజుకు ఎక్కువైపోతూఉంది. సంవత్సరానికి మనిషి 1కి పస్టేటిండిన్, బట్టను తగ్గించివేయడమే ఇందుకు ప్రబల

నిదర్శనం. ఎందుకంటే జీవితావసరవస్తువుల్లో అత్యంత ముఖ్యమైనవి తిండీబట్టే. 1939-40లో మనిషి 1కి బట్టవాడకం 16 గజాలుంటే 1947-48 లో 11 గజాలు మాత్రమే ఉంది. అదేవిధంగా తిండి 388 పౌనులనుంచి 357 పౌనులకు తగ్గిపోయింది.

నెహ్రూ - పటేల్ పెట్టుబడిదారీ ప్రభుత్వాన్ని దాని ఇష్టం వచ్చినట్లు సాగిపోనిస్తే కష్టజీవులైన ప్రజాసామాన్యానికి లభించేది పస్తులూ మరణాలు మాత్రమే. ప్రజలు చినిగిపోయిన గుడ్డపీలికలతో దుర్భరదారిద్ర్యంతో తమ బ్రతుకు వెళ్ళదీయవలసిందే.

తన పెట్టుబడిదారీ ప్రభుత్వ స్వభావానికి తగినట్లుగానే నెహ్రూ - పటేల్ ప్రభుత్వం ఇండియా వలసదేశ ఆర్థిక విధానాన్ని ఆంగ్లో-అమెరికన్ సామ్రాజ్యవాదులకు అమ్మివేయడంద్వారా సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసింది. స్వదేశీ విదేశీ పెట్టుబడిదార్లకు కావలసిన సౌకర్యాలన్నిటినీ అమర్చిపెడుతూవుంది. మనదేశంలోని సహజసంపత్తినీ చౌకగా లభించే మానవశక్తినీ పెట్టుబడిదారులు తమ సంకుచిత స్వప్రయోజనాలకు ఉపయోగించుకోవలసిందని సిగ్గుమాలిన పెట్టుబడిదారులను దువ్వుతూవుంది. తన కవసరమైన పెట్టుబడికీ, యంత్రసామగ్రికీ ఆంగ్లో - అమెరికన్ యజమానులపైనే పూర్తిగా ఆధారపడతామని సిగ్గుమాలి అంగీకరించి తన బానిసబుద్ధిని బైట పెట్టుకుంది. దీని ఫలితమేమిటో ధరలు పెరిగిపోవడంలోనూ, పెట్టుబడిదారులు విపరీతలాభాలను మూటగట్టుకోడంలోనూ నిరుద్యోగ సమస్య తీవ్రమైపోవడంలోనూ ప్రజాసామాన్యం అనుభవిస్తూనేవుంది. దినపత్రికల్లో చూచినా ఈ విషయాలు బోధపడతాయి.

నెహ్రూ-పటేల్ ప్రభుత్వంయొక్క బలాన్ని అండగాతీసుకొని పెట్టుబడిదారీ వర్గం సిగ్గుమాలి తన సంక్షోభ భారాన్ని అంతా ప్రజలనెత్తిపై మోపాలని చూస్తూవుంది. తన విపరీతలాభాలను యధాతథంగా నిలబెట్టుకోడంకోసం ప్రజలను బలిచేయడం ద్వారా తాను సంక్షోభాన్నుంచి బైటపడాలనుకుంటోంది.

సంక్షోభంయొక్క వాస్తవిక పరిస్థితి ఇదే. సంక్షోభం రోజురోజుకూ మరింత తీవ్రతరం అవుతూవుంది. రానున్న ప్రమాదాన్ని అ. భా. ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ సరిగా అవగాహన చేసుకోడమే కాకుండా దాన్ని ఎదిరించడానికి ప్రజాశక్తులను ఏవిధంగా నడిపించాలో కూడా దారిచూపింది. అఖిలభారత (జనరల్) పోరాటానికి పిలుపు ఇవ్వడమే అది చూపిన దారి.

రైల్వే సమ్మెఘటనకు వెంటనే ఈ విధంగా సరియైన సమయంలో పిలుపు ఇవ్వడం ముఖ్యముగ గమనించతగిన విషయం. ప్రభుత్వం అవలంబించిన నిర్బంధ చర్యలు ఎనిమిదిన్నర లక్షల రైల్వే కార్మికుల సమస్య వొకటికూడా పరిష్కరించలేకపోవడమే ఇందుకు కారణము.

కార్మికవర్గంయొక్క అఖిలభారత పోరాటం ఒక్కటే నేడు పోరాటాన్ని సరియైన స్థాయికి తీసుకు వెళ్ళకలుగుతుంది. భారత కార్మికవర్గం తన ప్రధాన (బేసిక్) డిమాండ్లుద్వారా, అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు నాయకత్వాన పెట్టుబడిదారులకూ వాళ్ళ ప్రభుత్వానికి ఒక సవాల్ విసిరింది.

మీ సంక్షోభ భారాన్ని మా భుజాలమీద వహించడానికి ఇక మేము ఎంతమాత్రం అంగీకరించం. మానవజీవుల్లాగే బతికే హక్కు మాకుకూడా ఉందని మేండిమాండ్ చేస్తున్నాం. ఇప్పుడు మేము వెల్లడిస్తున్న విశకనీస బేసిక్ డిమాండ్లు (ప్రాతిపదిక హక్కులు) మాత్రమే. మేము వీటిని సాధించి తీరుతాం. మా కోర్కెల్లో ఏ ఒక్కదాన్ని మీరంగీకరించరని మార్చి 9వ తేదీన మా రైల్వే కామ్రేడ్లు ఎదుర్కొన్న దానికంటెకూడా ఇంకా దారుణమైన హింసాకాండను మాపై ప్రయోగిస్తారనికూడా మాకు తెలుసు.

"అయినా మేము మీ సవాల్‌ను అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నాం. మా పోరాటైక్యతలోనే మాబలం ఉంది. మాబలం మాకు రోజురోజుకూ ఎక్కువగా లభించే ప్రజాసహకారంలోకూడా ఉంది. ఎందుకంటే మా డిమాండ్సే వారి డిమాండ్లు. మాపోరాటమే వారి పోరాటం. మా విజయంలోనే వారి భవిష్యత్తుకూడా ఉంది."

శ్రామికప్రజాసామాన్యానికీ, గ్రామీణ శ్రామికవర్గానికీ, పట్టణ మధ్యతరగతికి చెందిన ఉద్యోగులకూ, విద్యార్థులకూ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ యిచ్చిన పిలుపు ఒక తక్షణ యుద్ధ నినాదం. అది వారిలో ఒక నూతనోత్సాహాన్ని పురికొల్పుతుంది. ఆ పిలుపుద్వారా కార్మికవర్గం తన మిత్రులకు ఇలా చెప్పింది.

"ఈ విపరీత సంక్షోభం మీ ముందు ఒకే ఒక కర్తవ్యాన్ని ఉంచుతూ ఉంది - పోరాడి సుఖప్రదమైన జీవితాన్ని జీవించండి, లేదా పోరాడకుండా దుర్భరమైన దారిద్ర్యం అనుభవిస్తూ పస్తులైనా పండుకోండి. పోరాటాల్లో రాటలు తీరిన మేము - కార్మికులం ఈ పోరాటాన్ని సాగిస్తున్నాం. నడుపుతున్నాం. మీ బలాలన్నిటితో సహా మాలో చేరి మా పోరాటాన్ని బలపరచడంలోనే మీ శ్రేయస్సుకూడా ఇమిడి వుంది. తటస్థతగానీ, ఉపేక్షాభావంగానీ, విలంబనగానీ చూపడమంటే శత్రువుకు విజయాన్ని చేకూర్చిపెట్టడమే అవుతుంది."

"పెట్టుబడిదారులపై భారాన్ని వేయడం ద్వారా ప్రభుత్వం ఈ సంక్షోభాన్ని పరిష్కరించదు-పరిష్కరింపజాలదు. ఎందుకంటే అది తనవర్గానికి వ్యతిరేకంగా పోరాడజాలదు. ప్రజలెంతటి దుర్భరదారిద్ర్యానికి గురి అయినా, ఎందరు ప్రజలు మృత్యువువాతబడినా లెక్కచేయకుండా ఈ సంక్షోభ

భారాన్ని అంతా ప్రజల మూపులపై మోపి తనవర్గానికి అండగా నిలబడుతుం."

"కాబట్టి ఈసంక్షోభం నుంచి బైటబడడానికి ప్రజలు కార్య రంగంలో దుమికేటట్లు వారిని ప్రోత్సాహపరచాలి. క్రియద్వారానే విరోధివర్గ ప్రభుత్వాన్ని మార్చి ఆ స్థానంలో, కార్మికులు, రైతుల, అణచబడిన మధ్య తరగతి, శ్రామికప్రజల ప్రభుత్వాన్ని స్థాపించగలం. సర్వవ్యాపిత పోరాటం ద్వారానే అది సాధ్యమవుతుంది. ఇందులో గోడమీది పిల్లివాటం పనికిరాదు. మూడో పంథా అంటూ లేదు. మూడో పంథా అంటే లొంగిపోవడం, పస్తులు పండుకోడం, ప్రాణాలు కోల్పోవడం మాత్రమే. సుఖప్రదమైన జీవితం కోసం, భవిష్యత్తును నిర్మించుకోడం కోసం, ఈ బరువునంతా దోపిడిదారులపై వేసి సంక్షోభాన్ని పరిష్కరించడం కోసం అఖిలభారత పోరాటం వైపు పురోగమించండి."

గత రెండుసంవత్సరాల అనుభవాన్నిబట్టి తదితర శ్రామిక ప్రజానీక సహకారం తనకు లభిస్తుందని అ॥ భా॥ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు సంపూర్ణంగా విశ్వసిస్తూ ఉంది. ఎందుకంటే తమ తమ రంగాల్లో సంక్షోభం సాగించే దాడిని తిప్పి కొట్టడానికి ఎంతటి నిర్బంధ చర్యలనైనా ఎదుర్కొని గత రెండు సంవత్సరాల్లో ఈ శ్రామిక ప్రజలు కూడా కార్మికవర్గాయుధమైన సమ్మె పోరాటాన్నే అవలంబించారు. కాబట్టి ఈ పిలుపు ఒక్కటే - అఖిలభారత జనరల్ పోరాటానికి ఇచ్చిన ఈ పిలుపు ఒక్కటే - శ్రామిక ప్రజలందరి ఆశయాలనూ చక్కగా ప్రతిధ్వనిస్తూ ఉంది.

ఈ పోరాటానికి ప్రజా సహకారం విరివిగా లభిస్తూ ఉన్నకొలదీ బూర్జువా లేబరు ఏజెంట్లు అయిన జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్సూ, సోషలిస్టు నాయకత్వమూ విచ్ఛిన్నచర్యలకు ఉపక్రమించారు. కాని వాళ్ళు వేసుకున్న ముసుగు ఎంతో కాలంపనిచేయదు. ఎందుకంటే బూర్జువా వర్గానికి అన్నిటికంటె ప్రధానంగా కావలసింది లాభాలను కాపాడడం. ఈ తీవ్రమైన సంక్షోభ దశలో అది కార్మికవర్గానికి ఏకొద్దిపాటి సౌకర్యాలనుకూడా కలిగించలేదు. ప్రతి చిన్న విషయానికి తీవ్రపోరాటం జరపవలసివస్తుంది. నేడు జరుగుతూవున్న ఏ సమ్మెపోరాటాన్ని చూచినా యిదే స్పష్టంగా రుజువు అవుతుంది. కాబట్టి బూర్జువా ప్రభుత్వ లేబరు ఏజెంట్లు తమ విచ్ఛిన్న చర్యలను కొనసాగించాలంటే వాళ్ళు వేసుకున్న ముసుగులను చించివేసి తమ నిజస్వరూపంలో - బూర్జువా వర్గానికి ఏజెంట్లుగా - బైటపడక తప్పదు. ఎందుకంటే, పోరాటం లేకుండా కార్మికులకు సౌకర్యాలు లభించడమనేది హుళక్కి. పోతే యిక పోరాటాలకు నాయకత్వం వహించడమనేది వారికి అసాధ్యమైన విషయం. ఈ విచ్ఛిన్నకులు

వేటికోసం బేరం ఆడాలనిచూస్తారో అంతకంటె ముఖ్యమైన విషయాలకోసమే సమ్మెపోరాటాలు విజృంభిస్తాయి.

కాబట్టి యిక వాళ్ళకు మిగిలిందల్లా బాహాటంగా బైటపడి, తెగబడి మార్చి 9 ద్రోహంకంటె ఇంకా పెద్దద్రోహాలకు పూనుకోడమే. పాక్షిక పోరాటాల ద్వారా కార్మికవర్గ ఐక్యతను సాధించడం అంటే అఖిలభారత పోరాటానికి కార్మిక వర్గాన్ని సన్నద్ధం చేయడమే అని ఈ బూర్జువా ఏజెంట్లకు బాగా తెలుసు. అందువల్ల జాతీయంగా అంతర్జాతీయంగా ప్రజా ఐక్యత సాధించబడకుండా ఎంతటి దుర్మార్గానికైనా ఒడిగట్టిదాన్ని విచ్ఛిన్నం చేయడంకోసం తెగబడిప్రయత్నించడమే వాళ్ళు చేసేపని.

అయినప్పటికీ యీ సమస్యలమీదనే అనేకసార్లు కార్మికవర్గం ఇదివరకు పోరాటాలు జరిపింది. వర్గఐక్యత పెంపొందడానికీ కనీస బేసిక్ డిమాండ్లుకోసం పోరాటం జరపడానికీ అనుకూలపరిస్థితులు ఏర్పడు తున్నాయి. సంక్షోభదాడిని తిప్పి కొట్టడానికి పోరాటైక్యతలోనే తమ బలం ఉంది అని స్వానుభవంద్వారానే కార్మికులు పాఠాలు నేర్చుకుంటున్నారు. సంక్షోభంయొక్క దాడిని ఎదిరించి సుఖప్రదమైన భద్రమైన జీవితాన్ని సాధించడానికి తాము జరిపే పోరాటంలో కలిసి రావలసిందని కార్మికవర్గం ఆహ్వానించిన తదితర శ్రామిక ప్రజలందరి విషయంలో కూడా ఇది ఎంతో ప్రాముఖ్యత వహిస్తూవుంది.

ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ పిలుపులో ఉన్నట్లుగా అలాంటిఐక్యత పోరాటంలో పాల్గొనేవారి ఐక్యతగానే వుంటుంది. ఎందుకంటే పోరాటంకోసమే ఈఐక్యత. పిరికిపందలకూ, రాజీవాదులకూ ఇందులో తావులేదు. గత కాలంలో ఉజ్వల పోరాటాలకు నాయకత్వం వహించిన చరిత్ర కలిగిన అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్సే ఈ ఐక్యతకు ఆధారభూతంగా ఉంటుంది. వర్గపోరాటాలకు సంబంధించిన దాని పురోగమన కార్యక్రమమూ, అఖిలభారత కార్యాచరణకు అది ఇచ్చినపిలుపూ, ఇవే ఐక్యత యొక్క కార్యక్రమంగా ఉంటాయి. కార్మికుల జీవనస్థాయిపై వారి హక్కులపై సాగించే ప్రతి దాడికి వ్యతిరేకంగా విరామంలేకుండా జరిపే పాక్షిక పోరాటాలే ఐక్యతను సాధించడానికి సాధనాలుగా ఉంటాయి.

రాజకీయంగా గ్రూపులవారీగా ఎలాంటి అభిప్రాయ భేదాలున్నా పోరాటం సాగించే అరుణ పతాక వెనుక ఉమ్మడి పోరాటాలద్వారా కార్మికులందరినీ సమీకరించడానికి ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు సమావేశం అందువల్లనే పిలుపు ఇచ్చింది. ఎంత అతివాదశబ్ద జాల ప్రయోగం మరుగుననైనా, ఏ ముద్రల క్రిందనైనా, కార్మికులలో ఐక్యత ఏర్పడకుండా నిరోధించే ప్రయత్నం చేయడం అంటే, కార్మికుల్లో చీలికలు కలిగించ పూనుకోడం అంటే పెట్టుబడిదారులకు కావలసిన పనిని చేసిపెట్టడమే అవుతుంది. ముఖ్యంగా ఈ రోజుల్లో - తమ బ్రతుకు తెరువుకే కార్మికులు జీవన్మరణ సంగ్రామం సాగించవలసి వస్తూ ఉన్న ఈ రోజుల్లో - ఇది మరింత ప్రాముఖ్యత వహిస్తుంది.

అందువల్లనే తమ జీవనస్థాయిపైనా, తమ హక్కులపైనా జరిగే ప్రతి చిన్న దాడినీ, పెద్దదాడినీ ప్రతిఘటించి నిలబడ

వలసిందని ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు సమావేశం పిలుపు ఇవ్వడంజరిగింది. కార్మికులపై జరిగే ఏ దాడిఅయినా చిన్నదిగా కన్పిస్తూ ఉందంటే అందుకు కారణం కార్మికుల బలమే. కార్మికులు తిరిగి మళ్ళీ దెబ్బకు దెబ్బకొడతారని పెట్టుబడిదారులు భయపడడమే. తమపై జరిగే దాడులను కార్మికులు ఎప్పటికప్పుడు ఖచ్చితంగా ప్రతిఘటించి వాటిని త్రిప్పికొట్టడంవల్ల ముందు రానున్న పెద్ద పెద్ద దాడులను ఎదుర్కోడానికి కార్మికులు కాకలుతీరి ఉక్కులాగా తయారుకావడం జరుగుతుంది. పోరాటైక్యత సాధించబడుతుంది. అఖిలభారత పోరాటానికి తర్ఫీదు పొందటం జరుగుతుంది. అఖిలభారత పోరాటం ఒక్కటే సంక్షోభాన్ని కార్మికుల కనుకూలంగా పరిష్కరించ గలుగుతుంది. అంతకు మినహా మరే మార్గంలేదు. కాబట్టి పాక్షిక పోరాటాలు నేడు ఎంత ప్రాముఖ్యత వహిస్తున్నాయో పై సమావేశం స్పష్టపరిచింది.

గత రెండు సంవత్సరాల పోరాటం నుంచి భారతకార్మికవర్గం ఒక గుణపాఠాన్ని నేర్చుకోవలసి ఉంది. కార్మిక వర్గం పోరాటైక్యతను సాధించడమే కాకుండా నిర్బంధచర్యలనూ విచ్ఛిన్న చర్యలనూ త్రిప్పి కొట్టగలిగినటువంటి, కార్మికులను విజయవంతంగా నడిపించ గలిగినటువంటి నిర్మాణాన్ని (ఆర్గనైజేషన్) కూడా సాధించవలసి ఉంది.

ప్రతి పరిశ్రమలోనూ, ఫ్యాక్టరీలోనూ ధైర్యసాహసోపేతంగా పోరాడే వారితో కమిటీల నేర్పరచడం ద్వారా అలాంటి నిర్మాణం సాధ్యమవుతుందని సమావేశం సూచించింది. అలాంటి కమిటీలు ప్రతి మిల్లులోనూ, ప్రతిఫ్యాక్టరీలోనూ కార్మికులను సంఘటితపరచి వారిని ముందుకు నడిపించవలసి ఉంటుంది. పోరాటంలో నుంచి వచ్చిన అలాంటి కార్మికుల నాయకత్వమే (ఫైటింగ్ రేంక్ అండ్ ఫైల్ లీడర్‌షిప్) నిర్బంధ చర్యలకూ, విచ్ఛిన్న చర్యలకూ వ్యతిరేకంగా కార్మిక ఐక్యతను రక్షించడానికి హామీగా ఉంటుంది.

ఈ సమావేశానికి హాజరైన 400 మంది ప్రతినిధులు తిరిగి తమ తమ స్థానాలకు వెళ్ళారు. వారు ముమ్ముందు సాగించవలసిన పోరాటంలో అవలంబించవలసిన సరియైన ధృక్పథంతోనూ, కార్మికవర్గంలోనూ ఆ వర్గమిత్రులైన గ్రామీణ శ్రామికవర్గంలోనూ మధ్యతరగతిఉద్యోగుల్లోనూ, విద్యార్థుల్లోనూ తమ తమ రంగాల్లో ఎదుర్కొంటూన్న సంక్షోభానికి వ్యతిరేకంగా వీరోచితంగా నేడు పోరాటాల్లో పాల్గొంటూన్న ప్రజలందరిలోనూ ఒక నూతన విశ్వాసంతో ఒక నూతన ఆశతో వారు తిరిగి వెళ్ళారు. భారత కార్మికవర్గంయొక్క కనీస బేసిక్ డిమాండ్సుకోసం అఖిల భారత పోరాటానికి సన్నాహాలు చేయవలసిన తమ నూతన కర్తవ్యాలకు సరిపడే నూతన నిర్మాణాన్ని సంఘటిత పరచడానికి వారు తిరిగివెళ్లారు.

సంక్షోభానికి గురిఅవుతూవున్న పెట్టుబడిదారీవిధానంయొక్క దాడికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో కార్మికులను నడిపించే దృఢసంకల్పంలోనూ, విజయంలో అచంచల విశ్వాసం ఏర్పడడంలోనూ అఖిల భారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు 23 వ సమావేశంయొక్క చారిత్రక ప్రాముఖ్యత ఉంది.

('కమ్యూనిస్టు' 4 వ సంచిక
(జూన్-జులై నుండి)

త్వమేవాఽహం

రచయిత: ఆరుద్ర

కళాకేళీ ప్రచురణ, సామర్లకోట.

వెల: 1—0—0

ఇది శ్రీ శ్రీ లాంటి వారిచే చాలా గొప్పగా మెప్పుపొందిన గ్రంథం. ఈ గ్రంథాన్ని గురించి శ్రీశ్రీ గారిలా అంటున్నారు:

"తెలంగాణా విప్లవం 'త్వమేవాఽహం' రచనకు ప్రోద్బలం. నిస్సందేహంగా రేపు ఏర్పడ బోతూన్న సామ్యవాద వ్యవస్థకు 'త్వమేవాఽహం' పునాది."

శ్రీ ఆరుద్రగారు తమ ప్రతిభా శక్తితో అనేక అభ్యుదయ భావాలకు చక్కని కవితా స్వరూపం ఇచ్చారు. వారి కూర్పులో ఒక ప్రత్యేకత ఉంది. ఉదాహరణలు:

"అబద్ధాల అమ్మకాన్ని ప్రభుత్వాలు జాతిపరం చేస్తాయి".

"పరబ్రహ్మ పదార్థాన్ని
ఎరపెట్టి అరికట్టలేం
వీళ్ళ గమనాన్ని –"

"ఇక మీదట పోలింగు
స్టేషన్ రాజ్యాంగానికి
చూపుడువేలు
కానేకాదు"

"కనీనికలజ్వాలలే జనత
కంటనీరు పెట్టిందంటే!
అనీ అననిశాపమే ప్రజ
నిరాశ దారిపట్టిందంటే!"

"అట్టడుగున పరిశ్రమించేజనావళి
మనకందరికీ రక్షక పత్రావళి"

ఈ విధంగా శ్రీ ఆరుద్ర గారు ప్రజలతో భుజం భుజం కలిపి వారితోపాటు పురోగమిస్తూ వారి మనోగత భావాలనే హృద్యంగా తమ పద్యాల్లో ప్రతిబింబించారు. శ్రీ శ్రీ గారన్నట్లు "ఆరుద్ర మహోద్రేకంతో ఘోషిస్తున్నాడు. గొంతుక వింతగా ఉండవచ్చు కాని ఆవేశం మాత్రం అతిస్పష్టం".

కాని 'ప్రకాశిక'లో చెప్పినట్లు "సాంప్రదాయ సిద్ధంగా వస్తూ ఉన్న కవితారీతుల్లో అలవాటు పడ్డ ఎక్కువమంది పాఠకులకి ఆరుద్ర ఒక కొరకరాని కొయ్య". కాబట్టి ప్రకాశకులు ఇచ్చే సలహా ఏమిటంటే "ఆరుద్ర ఈ యుగాన

బలవత్తర కంఠాలలో ఒకటి కనుక పాఠకులు తప్పనిసరిగా తమ వైఖరిని మార్చుకోవలసి ఉంటుంది” అని.

అంటే నేను మాత్రం నా ఈ అయోమయ (త్వమేవాఽహంలో ఎక్కువభాగం అయోమయమే) స్థానంలోనే తిష్ఠవేసుకొని కూర్చుంటాను. మీకు అవసరమైతే, ఓ ప్రజలారా! నావద్దకు వస్తేరండి, లేదా పోండి! నేనుమాత్రం “దిగిరాను దిగిరాను దివినుండి భువికి” అన్నమాటే కాదూ?

“కళలూసారస్వతం ఎవరికోసం” అనే తన వ్యాసంలో మా-సి-టుంగ్ చెప్పిన సుభాషితాలను అభ్యుదయ కవులందరూ గుర్తుంచుకోడం ఎంతైనా అవసరం. “ప్రజలకు శిష్యత్వం చేస్తేనే వారికి గురువులం కాగలం. అలా కాకుండా ప్రజలకు నీవొక యజమానివని లార్డులాగా వారినెత్తిమీద కూర్చుందా మనుకుంటే నీ వెంత గొప్పవాడవైనా సరే, నీకెంత పాండిత్యం సామర్థ్యం ఉన్నాసరే, ప్రజలకు నీతో పని ఉండదు. నీకూ నీ రచనలకూ భవిష్యత్తు శూన్యం.........

“మొట్టమొదట మీరు ప్రజల భాషను అర్థం చేసుకోవాలి. మీరు మీ రచనలో ఎంతసేపూ విద్యావంతుల హెచ్చుస్థాయి భాషను వాడుతారు. ప్రజలు ప్రయోగించే భాషకి మీరు రాసే దానికీ ఎక్కడా లంగరు అందదు.”

హెచ్చుస్థాయి భాషను వాడడమే కాకుండా శ్రీ ఆరుద్రగారు భాషలో సాముగరిడీలకు కూడా పూనుకున్నారు.

“సింతటిక్ చింతనాధరించు కవి
అంతట ఖయోసు పెరిపించు
ఒయాసిస్సు పోయిట్రీ
కవిత్వపు ఖయోసులో
ఖయోసుకి ఉరికొయ్య”

ఈకవిత్వం ఎవరికోసం? ప్రజలకోసమేనా? పోనీ హెచ్చుస్థాయిలో ఉన్నా కొద్దిమంది పండితులకైనా అర్థం అవుతుందేమో అనుకోవచ్చు. కాని-

“చెట్లు చిట్టెలుకలు
కాకిమెడ నుసిరంగు
స్నో తెలుపు ద్యూ తెలుపు
చెట్లు చిట్టెలుకలు”

ఇది భావకవుల అయోమయానికంటె ఏం తక్కువ తిన్నది?

పైగా “శ్రీ ఆరుద్ర వ్రాసిన కవిత్వం హాస్యలిపిని అర్థంచేసు

కుంటే 'త్వమేవాఽహం' అర్థమై నట్టే" అని ప్రకాశకులు సమర్థించుకోచూశారు. పోనీ ఆ 'హ్రాస్వలిపి' ఏదో (అసలది ఉంటే) గ్రంథాదినో గ్రంథాంతంలోనో ప్రకటించకపోయారు?

ఇదితర విషయాలన్నిటికిలాగే భాషకుకూడా ప్రజలే మూలాధారం, అంతేకాని ఏ నలుగురు వ్యక్తులో తలుపులు బిగించుకొని, ఒక గదిలో కూర్చొని, తమ చిత్తం వచ్చినట్లు భాషను పోతపోయడం నేలవిడిచి సాముచేయడం తప్ప మరేమీగాదు. స్థాలీ పులాకంగా ఉదాహరణకు వీరుచేసిన విశ్వామిత్ర సృష్టి చూడండి. పెరిషించు (Perish + ఇంచు) రనండి = (Run + అండి) పరుగెత్తండి. (మేము చేసుకున్నట్లు ఈ మాటల కిదే అర్థం అయితే) వీటిని ముక్కోటి ఆంధ్రులలో ఏ ఒక్కరైనా ప్రయోగిస్తున్నారా? ఒకరి భావాలను వారొకరికి తెలియపరిచే సాధనమే గదా భాష! అయితే 'రనండి' అన్నప్పుడు ఏ మానవుడికయినా అర్థం అవుతుందా? ప్రజలకు అసలు అర్థమే కాకపోతే ప్రజాదరణ ఎలా లభిస్తుంది?

"ఎంతో సంస్కారం ఉంటేగాని ఇతరులను అర్థంజేసుకోలేము" అని ఈ సాము గరిడీలను సమర్థించిన శ్రీ శ్రీ గారు కూడా దీన్నిగురించి ఒకసారి – మరోసారి ఆలోచించవలసి ఉంటుంది. ప్రజలకు సులభ గ్రాహ్యం గాకుండా ఉండేందుకు శ్రీ ఆరుద్ర గారు చేసిన మరోపని విరామ చిహ్నాలను పూర్తిగావిడనాడడం. అందువల్ల వీరు వ్రాసిన వచనం సైతం సరిగా అర్థంగాక పాఠకులను తికమకలు పెడుతుంది. ఉదాహరణకు చూడండి. "కారణం వీళ్ళకి వీళ్ల సమస్తాన్నీ ఏ బిందువు దగ్గర కేంద్రీకరించాలో తెలీదు కేంద్రాలలో అపనమ్మకం వృత్తాలలో అసంతృప్తి విధ్వంసన యొక్క ధ్వంసం కారణంయొక్క కారణం మార్పును మార్చాలి గానీ వీళ్ల అపనమ్మకాలూ నమ్మకాలూ కూర్మ కవచాలు"

దీన్నిగురించి శ్రీశ్రీగారిలా అంటున్నారు.

"శుద్ధ వచనం రాస్తున్నా దాని గమనంలో ఒక కొంత వేగం సాధించగలడు ఆరుద్ర. దీని కిటుకు, కొంత వరకు విరామ

చిహ్నాలను బహిష్కరించడంలో ఉంది."

అసలు అర్థంలో సౌలభ్యం, వైశద్యం లేకపోయిన తర్వాత గమనంలో ఎంత వేగం ఉంటే మాత్రం ఫలితమేమిటి?

కాబట్టి 'పాఠకులు తప్పనిసరిగా తమ వైఖరిని మార్చుకో'డానికి బదులు ఆరుద్రగారూ ప్రకాశకులూ పాఠకుల అభిప్రాయానుసారం తప్పనిసరిగా తమ వైఖరిని మార్చుకోడం మంచిది. అలా మార్చుకున్నప్పుడే శ్రీ ఆరుద్ర గారు తమకున్న అభ్యుదయ భావాలకూ, ప్రతిభకూ, కూర్పులో తమకున్న నేర్పుకూ తగిన ప్రజాసేవ చేయగలుగుతారు.

★

ఆడజన్మ

రచయిత:

కొడవటిగంటి కుటుంబరావు

ప్రగతి ప్రచురణ

వెల 1-0-0

దొరుకు చోటు:

ప్రగతి ప్రచురణాలయం-నిడమర్రు (వయా) పెంటపాడు

పశ్చిమ గోదావరి జిల్లా

ఈ పుస్తకంలో 'ఆడజన్మ' 'లేచిపోయిన మనిషి' అనే రెండు పెద్దకథలున్నాయి.

ఆడజన్మ అనే కథలో నేటి ఈ సమాజంలో స్త్రీలు పుట్టిన దాది వివిధంగా ఇక్కట్లకు గురి అవుతున్నారో చక్కగా చిత్రించబడింది. లేచిపోయినమనిషి కథలో కాంతంలాంటి వాళ్ళు చేసే స్వార్థపూరిత కుట్రలను చక్కగా బట్టబయలు చేయడం జరిగింది.

*

స్వీకారం

తెలుగు విజ్ఞాన సర్వస్వము

(పరిచయ సంపుటి)

తెలుగుభాషా సమితి - మద్రాసు

*

హెూమియో చికిత్స

(మొదటి భాగం)

వెల 3-8-0 (పేజీలు 112)

గ్రంథకర్త

ముసునూరి సీతారామరాజు

బి. యస్‌సి. ఏ జి.

సూర్యారావుపేట, కాకినాడ.

BCd

Regd No. 5296 JANATA, A Telugu Marxist Fortnightly

TPLA134M121

త్వరలో

వెలువడుతోంది

నూతన ప్రజాతంత్రం కోసం సోషలిజం కోసం పోరాటం

(వ్యూహం : ఎత్తుగడలకు సంబంధించిన కొన్ని సమస్యలు)

మీ మీ కాపీలకోసం ముందుగానే త్వరపడండి

..........ప్రతులకు..........

లీలా బుక్ డిపో & అరుణ న్యూస్ ఏజెన్సీ
విజయవాడ 2

పీపుల్స్ పబ్లిషింగ్ హౌస్
పురుషోత్తమ బిల్డింగ్సు, మౌంట్ రోడ్
మద్రాసు

కావలెను

మా
జనత
పత్రికకు ఈదిగువ ప్రదేశాలలో డిపాజిట్లు కట్టగల సమర్థులగు ఏజంట్లు కావలెను.

నెల్లూరు	విశాఖపట్టణం
గూడూరు	పెనుగొండ
తిరుపతి	(ప॥గోదావరి)

..........వివరాలకు..........

జనత కార్యాలయం
బకింగ్ హామ్ పేట పోష్టు
విజయవాడ 2

మద్రాసులో
మా జనత
పత్రిక ఈదిగువ ప్రదేశంలో దొరకును.
పీపుల్సు పబ్లిషింగు హౌస్ లిమిటెడ్
పురుషోత్తం బిల్డింగ్సు, మౌంట్ రోడ్
మద్రాసు

Edited, Printed & Published by
G. Venkateswara Rao Kottapet, [illegible] Printed at Kavitilaka Press, Vijayawada

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA134M121
పుస్తకం పేరు	జనత
తారీఖు	31/10/24
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	81
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	A1, BC1
లేని పేజీలు	NO
తయారు చేసినది	Navya
పేజీలు విడదీసినది	Bhanu
స్కాన్ చేసినది	Mounika
పరీక్ష చేసినది	RUKSANA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good